శ్రీ గోదాదేవ్యై నమః
శ్రీమతే రామానుజాయ నమః

# *తనియన్లు

*కర్త: - శ్రీరంగనాథుడు*

**శ్లో॥ శ్రీ శైలేశదయాపాత్రం ధీభక్త్యాది గుణార్ణవమ్,**
**యతీంద్రప్రవణం వన్దే రమ్యజామాతరం మునిమ్.** 1

**టీక:** (ప్రతిపదార్థము)

శ్రీ శైలేశదయాపాత్రం = తిరుమలై యాళ్వార్లు అను తిరువాయ్ మొళి పిళ్ళైగారి దయకు పాత్రులును, ధీభక్త్యాది గుణార్ణవమ్, ధీ = జ్ఞానము, భక్తి = భగవంతునియందు ప్రేమ, ఆది = మొదలగు, గుణ = గుణములకు, అర్ణవం = సాగరమైనవారును, యతీంద్ర ప్రవణం = రామానుజులయందు భక్తిగలవారును అగు, రమ్యజామాతరం మునిమ్ = మణవాళ మామునులను, వన్దే = నమస్కరించెదను.

**వివరణము:**

శ్రీరంగమున గరుడ మంటపమున మణవాళమామునులు భగవద్విషయమును కాలక్షేపము చెప్పుచుండిరి. అపుడు శ్రీరంగనాథుడు దానిని వినుటకు అచటకు వచ్చి ఒక యర్చకబాలు నావేశించి పైశ్లోకముతో వారిని నుతించెనని యైతిహ్యము.

* * * * *

---

*తనియన్ అనగా ప్రత్యేకతను తెల్పునది అని భావము. ప్రతిపాద్యాంశము, కథావస్తువు, కవితాశిల్పాదులు ఇందు సూక్ష్మీకరింపబడును.

ప్రతి దివ్యప్రబంధము ప్రారంభించునపుడు నీ యైదు శ్లోకములును పాఠ్యములు.

**కర్త:** కూరేశులని ప్రసిద్ధులైన కూరత్తాళ్వారు.

**శ్లో॥ లక్ష్మీనాథ సమారంభాం నాథయామునమధ్యమామ్,**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురపరంపరామ్. 2**

**టీక:** లక్ష్మీనాథ సమారమ్భాం, లక్ష్మీనాథ = శ్రీ మహావిష్ణువును, సమారమ్భాం = ఆరంభమందు గలిగినదియు, నాథయామున మధ్యమామ్ = నాథమునిని, యామునాచార్యులను నడుమ గలదియు, అస్మదాచార్య పర్యన్తామ్ = మనయొక్క గురుని చివర గలదియు అగు, గురుపరమ్పరాం = ఆచార్యుల పంక్తిని, వన్దే = సేవింతును.

**వివ:** మన గురుపరంపర శ్రీమహావిష్ణువుతో ఆరంభమైనది. నడుమ నాథమునులు యామునాచార్యులు నుందురు. మన ఆచార్యులు చివర నుందురు. అట్టి గురుపరంపరను సేవించుచున్నాను.

* * * * *

**కర్త:** కూరత్తాళ్వారు

**శ్లో॥ యో నిత్య మచ్యుతపదాంబుజ యుగ్మరుక్మ**
**వ్యామోహతస్తదితరాణి తృణాయ మేనే,**
**అస్మద్గురోర్భగవతోఽస్య దయైకసింధో**
**రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే. 3**

**టీక:** యః = ఏ యతిపతి, నిత్యం = సదా, అచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ వ్యామోహతః = అచ్యుతుని పాదపద్మములందు ప్రేమాతిశయమును పొందుటచే, తత్ + ఇతరాణి = ఆ భగవత్పాద ద్వయముకంటె ఇతరమైన వానిని, తృణాయ మేనే = తృణీకరించిరో, అస్మత్ = మన, గురోః = ఆచార్యులును, భగవతః = దేవునివలె పూజ్యులును, దయా + ఏక సింధోః

= కరుణకు సముద్రుడును అయిన, అస్య = ఈ, రామానుజస్య = రామానుజులవారి, చరణౌ = శ్రీపాదములను, శరణం = రక్షకముగా, ప్రపద్యే = ఆశ్రయించుచున్నాను.

**వివ:** రామానుజులు శ్రియఃపతి పాదపద్మయుగళియందే సదా ప్రావీణ్యము కలిగియుందురు. ఇతర విషయము లన్నియును వారికి తృణప్రాయము. మన యాచార్యులును దయారత్నాకరులును అయిన అట్టి భగవద్రామానుజుల శ్రీ చరణములనే శరణముగా స్వీకరించు చున్నాను.

* * * * *

**కర్త:** ఆళవందార్ అని ప్రసిద్ధిచెందిన యామునాచార్యులు.

**శ్లో॥ మాతా పితా యువతయస్తనయా విభూతి**
**స్సర్వం యదేవ నియమేన మదన్వయానామ్,**
**ఆద్యస్య నః కులపతేర్వకుళాభిరామం**
**శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా 4**

**టీక:** మత్ + అన్వయానామ్ = నా వంశమందు జన్మించిన వారికి, మాతా = తల్లి, పితా = తండ్రి, యువతయః = భార్యలు, తనయాః = బిడ్డలు, విభాతిః = ఐశ్వర్యము (మొదలగునవి) సర్వం = సమస్తమును, నియమేన = అవశ్యముగా, యత్ + ఏవ = ఏ ఆళ్వారుల పాదపద్మద్వయమే (అగుచున్నదో), ఆద్యస్య = ప్రథములైన, నః = మా యొక్క, కులపతేః = ప్రపన్న జనకూటస్థుల (గు నమ్మాళ్వారుల) యొక్క, వకుళ + అభిరామం = పొగడ పుష్పములచే మనోహరమైన, శ్రీమత్ = శోభాయుక్తమయిన, తత్ = ఆ, అంఘ్రియుగళం = చరణద్వయమును, మూర్ధ్నా = శిరస్సుతో, ప్రణమామి = సేవించెదను.

**వివ:** తల్లిదండ్రులు, భార్యలు, బిడ్డలు, ఐశ్వర్యము మొదలగునవన్నియును మా వంశమువారికి ఆ యాళ్వారుల పాదపద్మములే. నమ్మాళ్వారులు మా కులస్వాములు. ప్రపన్న జనకూటస్థులు, ప్రప్రథములు, పొగడపూలచే నింపులొలుకు శోభతో ప్రకాశించువారును అగు నా శఠకోపుల పాదయుగళిని శిరసువంచి నమస్కరింతును.

* * * * *

**కర్త:** శ్రీ పరాశరభట్టర్.

**శ్లో॥ భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ**
**శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్,**
**భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్రమిశ్రాన్**
**శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్. 5**

**టీక:** భూతం = పూదత్తాళ్వారులను, సరశ్చ = పొయ్‌గైయాళ్వారులను, మహత్ + ఆహ్వయ = పేయాళ్వారులను, భట్టనాథ = పెరియాళ్వారులను, శ్రీ = గోదాదేవిని, భక్తిసార = తిరుమళిశై ఆళ్వారులను, కులశేఖర = కులశేఖరాళ్వారులను, యోగివాహాన్ = తిరుప్పాణాళ్వారులను, భక్తాంఘ్రిరేణు = తొండరడిప్పొడి యాళ్వారులను, పరకాల = తిరుమంగై యాళ్వారులను, యతీంద్రమిశ్రాన్ = పూజ్యులగు యతిపతిని, శ్రీమత్ = కైంకర్యశ్రీగల, పరాంకుశమునిం = నమ్మాళ్వారులను, నిత్యం = సర్వదా, ప్రణతః = నమస్కరించువాడను, అస్మి = అగుచున్నాను.

**వివ:** మనకు సర్వదేశ సర్వకాలసర్వావస్థలయందును పూజ్యులై మన నీయులైన ఆళ్వారులను ఇందు పేర్కొనుచున్నారు: ఆళ్వారు అను పదమునకు భగవద్గుణానుభవమను మహానదిలో ఎల్లప్పుడును మునిగియుండికూడ నిర్హేతుకకటాక్షముచే మనబోటి బద్ధజీవుల నుద్ధరించుటకే ప్రయత్నించు

చుండు మహాజ్ఞానులని యర్థము. సంసారమను నదిలో మునిగిపోవుచున్న వారిని తమవెంట అద్దరికి – పరమపదమునకు – లాగుకొనిపోవువారు సుడీ యీ యాళ్వారులు! ఇట్టి యాళ్వారులను పన్నిద్దరుగా మనపూర్వులు పాడినారు.

1) పూదత్తాళ్వారులు 2) పోయ్‌గయాళ్వారులు 3) పేయాళ్వారులు
4) పెరియాళ్వారులు 5) గోదాదేవి 6) తిరుమళిశ యాళ్వారులు
7) కులశేఖరాళ్వారులు 8) తిరుప్పాణాళ్వారులు 9) తొండరడిప్పొడి యాళ్వారులు 10) తిరుమంగయాళ్వారులు 11) భాష్యకారులు
12) నమ్మాళ్వారులు – వీరందరిని సదా సేవింతును.

ఇక నీ యాళ్వారులలో కొందరిని గూర్చిన విశేషములు: పొయ్‌గై అను సరస్సున నవతరించినారు పొయ్‌గ ఆళ్వారులు. భగవద్భక్త్యున్మాదముచే ప్రసిద్ధులు పేయాళ్వారులు. శ్రీదేవి యవతారమే గోదాదేవి. సారమైన భక్తిగలవారు భక్తిసారులు, శ్రీరంగనాథుని యాజ్ఞచే లోకసారంగ మహామునియొక్క భుజస్కంధారూఢులై భగవత్సన్నిధానమునకు వెళ్లినవారు యోగివాహనులైన తిరుప్పాణాళ్వారులు. భాగవత పాదధూళియని తమ పేరు మార్చుకొన్నవారు తొండరడిప్పొడి యాళ్వారులు. పర (ఇతర) మతములకు కాలుని (యముని) బోలినవారు పరకాలు డనబడు తిరుమంగయాళ్వారులు. పరమతములనెడి దిగ్గజముల కంకుశమును బోలినవారు పరాంకుశముని యనబడు నమ్మాళ్వారులు.

* * * * *

## తిరుప్పల్లాండు

**శ్లో॥ శ్రీరంగార్యదయాపాత్రం రామానుజపదాశ్రయం**
**శ్రీనృసింహార్యసత్పుత్రం జగన్నాథగురుం భజే.**

**శ్లో॥ శ్రీమాన్ వేంకటతాతార్యో వైయాకరణకేసరీ**
**అస్మద్దేశికవర్యో మే సన్నిధత్తాం సదా హృది.**
**శ్లో॥ యత్పాదపద్మప్రావణ్యా దభవం జ్ఞానలేశవాన్**
**వన్దే తం విష్ణుభక్తాగ్ర్యం వకుళాభరణం మునిమ్.**
**శ్లో॥ శ్రీచరణరేణుకృపయా శ్రీగీతిం వ్యాఖ్యయాఽతి సుగమయతి**
**"శ్రీ చరణరేణు" రిత్థం శ్రీపదయోర్నిత్యమంగళం భూయాత్.**

## తనియన్లు

**కర్త:** శ్రీ మన్నాథముని

**శ్లో॥ గురుముఖమనధీత్య ప్రాహ వేదానశేషాన్**
**నరపతిపరిక్లుప్తం శుల్కమాదాతుకామః,**

**శ్లో॥ శ్వశురమమరవంద్యం రంగనాథస్య సాక్షాత్**
**ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి.** **1**

**టీక:** యః = ఏ ఆళ్వారులు, నరపతి పరిక్లుప్తం = (వల్లభదేవరాయడను) నరపతిచే కల్పింప (కట్ట) బడిన, శుల్కం = (విద్యాశుల్కమగు బంగరుకాసుల) మూటను, ఆదాతుకామః = గ్రహించుకోరికతో, గురుముఖమ్ = గురుముఖముగా, అనధీత్య = నేర్చుకొనకయే, అశేషాన్ = సకలమైన, వేదాన్ = వేదములను, ప్రాహ = పలికిరో, తం = అట్టి (గొప్ప మహిమ వంతులును), రంగనాథస్య = శ్రీరంగనికి, సాక్షాత్ = నేరుగ, శ్వశురం= మామయును, అమరవంద్యం = దేవతలచే (సైతము) వందనము చేయదగిన, ద్విజకులతిలకం= వేదవేత్తలగు బ్రాహ్మణుల కలంకారమగు, విష్ణుచిత్తం= శ్రీ పెరియాళ్వారులను (గురించి) నమామి= (సాష్టాంగముగ) నమస్కరించుచున్నాను.

**వివ:** వల్లభదేవరాయడను పాండ్య రాజ్యాధీశుడు పరతత్త్వనిర్ణయమునకై పండితసభలో బ్రహ్మవిద్యాశుల్కమును కట్టెను. శ్రీమహావిష్ణువు ఆదేశానుసారము విష్ణుచిత్తులను మహాభక్తకవి ఆ సభ కేగి గురుముఖముగ నే విద్యను నభ్యసింపకపోయినను కేవల భగవత్కటాక్షముచే విష్ణుపరత్వము నా మహాపండితసభలో స్థాపించి యవలీలగ నా విద్యాశుల్కమును గెల్చుకొనెను. అంతేగాదు. తన కుమార్తెను వలచి పాణిగ్రహణము చేసికొన్నందున శ్రీరంగనాథునికి సాక్షాత్తుగ మామ యయ్యెను. కాననే వారు పెరియాళ్వారు. భక్తిప్రపత్తులలో అందరను మించిన గొప్ప యాళ్వారు – అను ఖ్యాతి నార్జించుకొన గల్గిరి. అట్టి విష్ణుచిత్తులకు వందనము.

* * * * *

**కర్త:** శ్రీ పాండ్యభట్టర్.

**2. మిన్నార్ తడ మదిళ్ శూళ్ విల్లిపుత్తూ రెన్ఱొరుకాల్,**
**శొన్నార్ కళఱ్కమలమ్ శూడినోమ్, మున్నాళ్**
**కిళియఱుత్తానెన్ఱురైత్తోమ్, కీళ్మెయినిఱ్చేరుమ్.**
**వళియఱుత్తోమ్ నెఞ్జమే వన్దు**

**టీక:** మిన్ + ఆర్ = ప్రకాశముతో నిండి, తడైమదిళ్ శూళ్ = విశాల ప్రాకార పరివృతములైన, విల్లిపుత్తూర్ ఎన్ఱు = "శ్రీ విల్లిపుత్తూరు" అని, ఒరుకాల్ శొన్నార్ = ఒక్కసారియైనను చెప్పిన (పల్కిన) వారి, కళల్ కమలమ్ = పద్మముల బోలిన పాదములను, శూడినోమ్ = (శిరసున) నలంకరించు కొన్నాము, మున్నాళ్ = ఇంతకుముందు, కిళి = (పరతత్వ) శుల్కమును, అరుత్తాన్ ఎన్ఱు = (విష్ణుపరత్వస్థాపనతో) ఛేదించిరి అని, ఉరైత్తోమ్ = అనుసంధించితిమి (పల్కితిమి), నెఞ్జమే = ఓ మనసా! వన్దు= (నీ యానుకూల్య భాగ్యమును) అందుకొని (న వారమై), కీళ్మెయినిల్శేరుమ్ = అధోగతికి పోవు, వళి = (ధూమాది) మార్గమును, అఱుత్తోమ్ = నిరోధించితిమి.

**విప:** ఓ మనసా! నీ వెంత మంచిదానవు: ఈ ప్రపంచమున మా కెవ్వరు ప్రతికూలించినను లెక్కచేయము. నీ వనుకూలించుట చేతనేగదా విశాలోన్నతప్రాకార రమణీయమయిన శ్రీ విల్లిపుత్తూరు పేరు నొక్కసారియైన నుచ్చరించిన శ్రీవైష్ణవశిరోమణుల దివ్యపాదారవిందములను మా చూడామణిగా ధరింపగల్గినాము. నీ మూలముననే గదా పాండ్య భూపతిపరికల్పితమయిన విద్యాశుల్కమును విష్ణుపరత్వ స్థాపనచే గెలుచుకొన్న యా మహాత్ముని దివ్యవైభవము జిహ్వతో ననుసంధించుకొనగల భాగ్యము బడయుగల్గినాము. నీ యనుగ్రహము చేతనేగదా శ్రీ పెరియాళ్వారులతో సంబంధము కల్గించుకొని యధఃపతన కారణమగు ధూమాదిమార్గమును హరినామ జపహేతిచే ఛేదించి అర్చిరాది మార్గమున పరమపదము చేర నర్హత గడించుకొన్నాము. అట్టి నీ ఋణమెట్లు తీర్చుకొనుటయో చిత్తమా! మాకు తెలియంగ జెప్పు మిపుడు.

ఈ సందర్భమున నీ తిరువాయ్మొழி పాశురము అనుసంధేయము.

పా॥ **నెంజమే నల్లైనల్లై యున్నై ప్పెత్తాల్**
**ఎన్ శెయ్యో, మినియెన్న కుఱైవినమ్,**
**మైన్దనై మలరాళ్ మణవాళనై,**
**తుఞ్జుమ్బోదుమ్ విడాదు తొడర్ కణ్డాయ్.** **2**

ఓ మనసా! నీ వెంత మంచిదానవు, ఎంత మంచిపని చేసితివి. నిన్ను బోలిన మిత్రుని బడయగల్గిన మా కిక పడయరానిదేమి గలదు! మే మెంత భాగ్యవంతులము! ఇక మా కేమి కొఱత! పద్మామనోహరుడైన సర్వేశ్వరుని నే నెన్నడైన నెడబాయదలచినను నీవు మాత్రము నన్నాపని చేయనీయకుము సుమా!

* * * * *

**3. పాణ్డియన్ కొణ్డాడ ప్పట్టర్పిరాన్ వన్దా నెన్ఱు,**
**ఈణ్డియ శఙ్గ మెదు త్తూద, వేణ్డియ**
**వేదఙ్గళోది విరైన్దు కిళియఱుత్తాన్**
**పాదఙ్గళ్ యాముడైయ పత్తు.**

**టీక:** పాణ్డియన్ = పాండ్యరాజు, కొణ్డాడ = కొనియాడుచుండగా, పట్టర్పిరాన్ = (పండితకవి) భట్టనాథులు, వన్దాన్ = (పరతత్త్వనిర్ణ యమునకై) వచ్చినారు, ఎన్ఱు = అని, ఈణ్డియశఙ్గమ్ = శ్రేష్ఠ శంఖములను, ఎడుత్తు = ఎత్తి, ఊద = ఊదగా, వేణ్డియ = ఆవశ్యకములైన, వేదఙ్గళ్ = వేదప్రమాణములు, ఓది = వచించి (ఉపన్యసించి), విరైన్దు = వెంటనే, కిళి = మూట, అఱుత్తాన్ = తెంచిన (తన పాదమూలమున పడునట్లు చేసిన) వారియెక్క, పాదఙ్గళ్ = శ్రీపాదములే, యామ్ ఉడైయ = మనము పొంద (ఆశ్రయింప) దగిన, పత్తు = పెన్నిధి సుడీ!

**వివ:** "షడ్దర్శనచక్రవర్తి – కవిచూడామణి – శ్రీ భట్టనాథులు అరుగో విచ్చేసినారు" అని పాండ్యనృపతి వల్లభరాయడు కైవారముచేయుచు సాంజలిబద్ధుడై సేవింపగా – దిగ్విజయశంఖనాదములతో భూనభోంత రములు పిక్కటిల్లుచుండగా – అపరిమేయ నిగమ ప్రమాణము లతో విష్ణుపారమ్యము స్థాపించి పరతత్త్వశుల్కము తనకుతానై వచ్చి తమ పాదారవిందమూలమున పడునట్లు చేసినట్టి మహామహిములు శ్రీ పెరియాళ్వారుల దివ్యచరణనళినద్వయమే మాకు శరణము!

**1. *పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డు,**
**పలకోడి నూఱాయిరమ్**

---

*నక్షత్రచిహ్నితములను రెండేసి మార్లు పఠింపవలెను.

**మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణా,**
**ఉన్‌శేవడి శెవ్వి తిరుక్కాప్పు.**

**టీక:** మల్ + ఆణ్డ = (చాణూరాది) మల్లులజయించిన, తిణ్ + తోళ్ = బలిష్ఠభుజములుగల, మణివణ్ణా = (ఇంద్రనీల) మాణిక్యాభ (తో నొప్పు శరీర) వర్ణము గలవాడా! (ఓ స్వామీ!), పల్ + ఆణ్డు = పలువత్స రములు, పల్లాణ్డు = మంగళము, పల్ + ఆయిరత్తు + ఆణ్డు = అనేకబ్రహ్మ కల్పములు, పలకోడి నూఱు ఆయిరమ్ = కాలతత్త్వమున్నంత పర్యంతము, ఉన్ = దేవరయొక్క, శే + అడిశెవ్వి = కోమలపాదసౌందర్యమునకు, తిరు + కొప్పు = (కొఱతలేని) శ్రీరక్ష (కలుగుగాక!)

**వివ:** అవక్రమగు త్వదీయ బలవిక్రమముచే చాణూరముష్టికాది మల్లుర పీచమడచిన మహాపరాక్రమశాలీ! నీకు జయము. సర్వకాలమును విజయివి కమ్ము. ఇంద్రనీల రత్నాభమగు దివ్యదేహ శ్రీసంయుక్తుడవగు నో మా కులస్వామీ! నీకు సదా మంగళము. నైకసహస్రకోటి శతవర్షావధి భవదీయ రమారమణీయ చరణరాజీవలక్ష్మికి శ్రీరక్ష నిత్య మగుగాక!

శ్రీ విష్ణుచిత్తులు పాండ్యరాజసభలో పరతత్త్వనిర్ణయము చేసినారు. నారాయణపారమ్యము స్థాపించి తన పరువు నిలిపిన యా భక్తవరుని సేవించి ధన్యత గాంచుటకు గరుడవాహన మధిరోహించి శ్రీ మహావిష్ణు వా సభవారికి ప్రత్యక్షమయినాడు. భట్టనాథుల కపుడు కల్గిన యుద్వేగబ్రహ్మానంద పారవశ్యము వర్ణింప మనకేమి చేతనగును; వెంటనే యా భక్తశిఖామణి నమస్కరించి ప్రస్తుతించుటకు మారుగా నా భువనమోహన దివ్యమంగళ విగ్రహ లావణ్యశ్రీకి ప్రాకృతజనదృష్టి యెక్కడ తగులునో యను భీతితో పై రీతిగ స్వామి నాశీర్వదించిరి. దీనినే మంగళాశాసన మందురు.

ఇది పండ్రెండు పాశురములలో నొప్పారిన ద్రావిడ వేదారంభ దివ్య ప్రబంధము. సంస్కృత వేదమున ప్రణవమునకున్న ప్రాముఖ్యమే ద్రావిడ వేదమున ఈ తిరుప్పల్లాణ్డుకును గలదు.

**2. *అడియోమోడుం నిన్నోడుం పిరివిన్ఱి యాయిరం పల్లాణ్డు,**
**వడివాయ్ నిన్ వలమార్పినిల్ వాళ్గిన్ఱ మజ్గైయుం పల్లాణ్డు,**
**వడివార్ శోది వలత్తుఱైయు ఇశ్చుడరాళియుం పల్లాణ్డు,**
**పడైపోర్ పుక్కు ముళంగు మప్పాఞ్జశన్నియముం పల్లాణ్డే!**

**టీక:** అడియోమ్ + ఓడుమ్ = (దాసభూతులమగు) మా తోడను, నిన్నోడుమ్ = సర్వశేషియగు మీతోడను, (మాకును మీకును అనుట), పిటివు + ఇన్ని = ఎడబాటు లేకుండ, ఆయిరమ్ పల్ + ఆణ్డు = వేలకొలది సంవత్సరములు (నిత్యముగా నుండుగాక), వడివాయ్ = (దేవరకు) ఆభరణప్రాయమై, నిన్ = మీ, వలమార్ పినిల్ = కుడివక్షమున, వాళ్కిన్ఱ = నివసించు, మఙ్గైయుమ్ = (నిత్యయౌవనవతి) శ్రీమహాలక్ష్మియును, పల్లాణ్డు = పెక్కువేల సంవత్సరములు (వర్ధిల్లుగాక), వడివు + ఆర్ = సౌందర్యముచే సమృద్ధమై, శోది = జ్యోతి (కిరాశి)యై, వరైత్తు = దేవరకుడి (చేతి) లో, ఉఱైయుమ్ = (నిత్య) నివాసము చేయుచు, శుడర్ = (శత్రువులను) భస్మము చేయు, ఆళియుమ్ = (సుదర్శన) చక్రము సైతము, పల్లాణ్డు = కాలతత్త్వ పర్యంతము విజయము చేయుగాక, పడై = (శత్రు) సేనలందు, పోర్ = యుద్ధమున, పుక్కు = (చొచ్చుకొని) పోయి, ముళంగుమ్ = మెఱయు (ఘోషించునట్టి), అప్పాఇచ్చశన్నియముమ్ = ఆ పాంచజన్య (శంఖ) ము గూడ, పల్లాణ్డే = నిత్యముగా నుండుగాక!

**వివ:** ఓ స్వామీ! మన మిద్దఱమును వియోగములేక కాలతత్త్వమున్నంత వరకు నిత్యముగా నుండవలెను. నీ వక్షఃస్థలమున కుడివైపున నవనవోన్మేషశాలినియై నిత్యయౌవనశ్రీతో విరాజిల్లు శ్రీమహాలక్ష్మిగూడ సదా వర్ధిల్లుగాక! స్ఫురత్సహస్రారశిఖాతితీవ్రమై నీ కుడిచేత వెలుగు లీను సుదర్శన చక్రాయుధమునకు జయము! దానవులతోడి యుద్ధమున అరాతిసేనల నడుమ ప్రవేశించి దిక్కులు పిక్కటిల్లగా వారి గుండెలు వ్రయ్యలగునట్లు ఘోషించెడు పాంచజన్యమునకుగూడ జయము జయము!

ఇందు "నిన్నోడుమ్" అనుటచే అకారవాచ్యుడగు సర్వేశ్వరుని, "అడియో మోడుమ్" అనుటచే మకారవాచ్యులగు జీవులను, "మంగైయుమ్" అనుటచే ఉకారవాచ్యమై పురుషకారభూతయైన లక్ష్మీదేవిని సూచించుటచే ప్రణవార్థము ధ్వనితమై నిర్దేశింపబడినది.

ఈ విధముగా నీ మొదటి రెండు పాశురములచేతను సర్వేశ్వరుని దివ్యమంగళవిగ్రహమునకును, విభూతిగుణయోగమునకును ఈ కవిసత్తములు పల్లాండు పాడి (మంగళాశాసనము చేసి) న వారైరి.

**3. వాళాళ్‌పట్టు నిన్ఱీ రుళ్ళీరేల్ వన్దు మణ్ణుం మణముం కొణ్‌మిన్,**
**కూళాళ్‌పట్టు నిన్ఱీర్‌గళై యెజ్గళ్ కుళువినిల్ పుగుద లొట్టోం,**
**ఏళాట్కాలుమ్ పళిప్పిలోమ్ నాజ్గళ్ ఇరాక్కదర్‌వాళ్ – ఇలజ్గై,**
**పాళాళాగ ప్పడై పొరుదానుక్కు ప్పల్లాణ్డు కూఱుదుమే!**

**టీక:** వాళ్ = (భగవత్కైంకర్యమను) సుఖముయొక్క, ఆళ్ = వృత్తిని, పట్టు = పొంది, నిన్ఱీర్ = (అధ్యవసాయముతో) దృఢముగా, ఉళ్ళీర్ + ఏల్ = ఉన్నచో, వన్దు = వచ్చి, మణుమ్ = (అంకురార్పణమునకు పుట్ట) మన్ను (తెచ్చు కైంకర్యమునను), మణముమ్ = (స్వామివారి) కల్యాణమునను, కొణ్మిన్ = పాల్గొనుడు, కూళ్ = (పొట్ట) కూటికై, ఆళ్ పట్టు = (ఒకనికి) ఊడిగము చేయుచు, నిన్ఱీర్‌గళై = (దోసిలి యొగ్గి) నిలిచినవారిని, ఎజ్గళ్ = (మంగళాశాసనపరులమగు) మా యొక్క, కుళువినిల్ = గోష్ఠిలో, పుకుతల్ = ప్రవేశించుటకు, ఒట్టోమ్ = ఒప్పుకొనము, ఏళ్ + ఆల్‌కాలమ్ = ఏడు తరములుగా, పళిప్పు = (ప్రయోజనాంతర సాధనాంతరములను) దోషములు, ఇలోమ్ = కలవారము కాము, నాజ్గళ్ =మేము, ఇరాక్కతర్ = రాక్షసులు, వాళ్ = నివసించునట్టు, ఇలజ్గై = లంకను, ఆళ్ = (దుష్ట) జనులు, పాళ్ + ఆక = పాడగు (నశించు) నట్లు, పడై = యుద్ధమున, పొరుతానుక్కు =

పోరిన శ్రీరామచంద్రునకు, పల్లాణ్డు = రక్ష, కూఱుదుమే = కూర్చు (చెప్పు) చున్నాము.

**వివ:** ఓ జనులారా! మీరు భగవత్కైంకర్య సంపదచే నభివృద్ధినందు కోరికగలవారై మా మార్గమున చేరదలచినచో పరమానందముతో మి మ్మాహ్వానించు చున్నాము. విచ్చేయుడు. భగవంతుని కల్యాణోత్సవము ప్రారంభమగుచున్నది. అంకురార్పణకై పుట్టమట్టి కొనివత్తము రండు. ఆ యుత్సవ నిర్వహణలో మీరును మాతో పాల్గొనుడు. కాని ఒక్కటిమాత్రము గుర్తుంచుకొనుడు. ఏడు తరములలో మాకు ప్రయోజనాంతరము లేదు. ప్రయోజనాంతరపరులకు సాధనాంతరపరులకు మాత్రము మా యీ గోష్ఠిలో స్థానము లేదు. అట్టి కళంకము మా కింతవర కంటలేదు. రక్కసులు వర్ధిల్లెడు లంకాపట్టణమును సమూలముగ మట్టుపెట్టిన శ్రీరామచంద్రునికి మంగళాశాసనము చేయ మాతో నన్వయింపుడు.

**శ్లో॥ చతుర్విధా భజంతే మాం జనాస్సుకృతినోఽర్జున,**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ!**

"ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని– నా భక్తులు నాల్గు తెఱగులుగా నుందురు" అని శ్రీగీతాచార్యు డర్జునునితో పల్కెను గదా! అట్టి నాల్గు తెగలవారిని ఈ పాశురమున తమ కైంకర్యమున పాల్గొని భగవంతునకు పల్లాండు పాడరమ్మని ఆళ్వారు లాహ్వానించుచున్నారు.

**4. ఏడునిలత్తి లిడువదన్ మున్నంవన్ దెజ్గళ్కుళాం పుగున్దు ।**
**కూడుమన ముడై యీర్గళ్ వరం బొళి వన్ దొల్లై క్కూడుమినో।**
**నాడు నగరముం నన్గరియ నమో నారాయణాయ వెన్ఱు ।**
**పాడుమన ముడై ప్పుత్తరుళ్ళీర్ వన్దు పల్లాణ్డు కూఱుమినే,**

**టీక:** ఏడు = (భగవద్దర్శనగుణానుభవహీన మైనందున) దుష్టమైన, నిలత్తిల్ = కైవల్య ప్రదేశమున, ఇడువతన్ మున్నమ్ = (మిమ్ముల చేర్చుటకు మునుపు)

వన్దు = వచ్చి, ఎజ్గళ్ = (అనన్య ప్రయోజనులమగు) మా యొక్క, కుళామ్ = గోష్ఠిలో, పుగున్దు = ప్రవేశించి, కూడుమ్ = కలసికొనుటకు. మనమ్ = మనస్సు, ఉడైయీర్‌గళ్ = కలవారై, వరమ్బు = (ఆత్మానుభవరూపమాత్రమైన) అవధిని, ఒళి = వదలి, ఒల్లై = వెంటనే, వన్దు = అరుదెంచి, కూడుమిన్ = చేరుడీ, నాడుమ్ = నాడును (దేశవాసులును) నగరముమ్ = నగరమును (నగరవాసులును) నన్గు = చక్కగా, అఱియ = ఎరుగునట్లు, నమః + నారాయణాయ = నారాయణునకు నమస్కారము, ఎన్రు = అని, పాడుమ్ = పాడుటకు, ఉడై = తగిన, పత్తర్ = భక్తి, ఉళ్ళీర్ = కలిగినవారైనచో, వన్దు = ఏతెంచి, పల్లాణ్డు = మంగళము (అని) కూఱుమినే = పలుకుడు.

**వివ:** ఓ కైవల్యార్థులారా! మీ చికీర్షితార్థమును పొందకమునుపే – ఈ దేహము వదలిపెట్టకముందే – గట్టిగా నాలోచించి నిర్ణయించుకొనుడు. మా గోష్ఠిలో చేర మనసుగలదేని త్వరపడుడు, రండు. మీ స్వానుభవమును వదలి అందరకును చక్కగ తెలియునట్లు వచ్చి మా కూటమిలో కలసిపొండు. నారాయణమంత్రము నుచ్చరింప మీ మనస్సంగీకరించుచో వేగిరమే విచ్చేయుడు. మాతో కలసి స్వామికి మంగళము పాడి ధన్యులు కండు.

కైవల్యానుభవమం దాసపడి యుపాసన చేయు నాత్మప్రాప్తికాముల నిందాహ్వానించుచున్నా రాళ్వారులు. అవాప్త సమస్త కాముడగు నా శ్రియః పతినామ మాశ్రితులపాలిటి చింతామణి యని యీ శ్లోక మెలుగెత్తి చాటుచున్నది గదా! ---

**శ్లో॥ ఐహ లౌకికమైశ్వర్యం స్వర్గాద్యం పారలౌకికమ్,**
**కైవల్యం భగవంతం చ మంత్రోఽయం సాధయిష్యతి.**

ఈ నారాయణ మంత్రము ఐహలౌకికమగు సమస్తైశ్వర్యములను, స్వర్గాదికమగు పారలౌకికైశ్వర్యములను, అర్థులకు సంపాదించి పెట్టును. కైవల్యార్థులకుగూడ నీ మంత్రమే కొంగుబంగారమై వారి కోర్కెలు తీర్చును. పెక్కుమాటలేల – సాక్షాత్తుగ భగవంతునే యీ మంత్రము భక్తిగుణబద్ధునిచేసి తన యెదుటకు తెచ్చును. కాన నో నరులారా! ఈ నారాయణమంత్రమొక్కటి యుచ్చరించిన చాలును. మన కష్టములు తీరి కోరిన యనుభవములు ఐశ్వర్యములు కరతలామలక మగును.

ఈ గ్రంథమంతయు నారాయణాష్టాక్షరీ మంత్రమహిమనే విశదీక రించున్నది గదా!

**5. అణ్డక్కులత్తు క్కదిపతి యాగి యశుర రిరాక్కదరై,**
**యిణ్డక్కులత్తై యెడుత్తు క్కళైన్ద విరుడీ కేశన్తనక్కు,**
**త్తొణ్డక్కుల త్తి లుళ్ళీర్ వన్దడితొళు దాయిరనామ శ్శొల్లి,**
**పృణ్డైక్కులత్తై త్తవిర్న్దు పల్లాణ్డు పల్లాయిరత్తా ణ్డెన్మినే.**

**టీక:** అణ్డమ్ + కులత్తుక్కు = అండసమూహమునకు (బ్రహ్మాండమునకు), అదిపతియాగి = అధిపతియై, అశురర్ + ఇరాక్కతరై = (రావణుడను) అసురుడు (హిరణ్యకశిపుడను) రాక్షసుడు (మొదలగువారియొక్క), ఇణ్డమ్ + కులత్తై = సమీపించిన సమూహమును, ఎడుత్తు = ఎత్తి, కళైన్ద = నిర్మూలించిన, ఇరుడీకేశన్ దనక్కు = సర్వేన్ద్రియాధిపతి సర్వేశ్వరునికి, తొణ్డర్ + కులత్తిల్ = దాసులకులమున, ఉళ్ళీర్ = ఉన్న మీరు, వన్దు = (సర్వము వదలి) వచ్చి, అడి = (శ్రియఃపతి) పాదములను, తొళుదు = (పరమప్రయోజనముగ నాశ్రయించి), ఆయిరనామమ్ = వేయి (అసంఖ్యాక) నామములను, శొల్లి = చెప్పి, పణ్డక్కులత్తై = మునుపటి జాతిని, తవిర్న్దు = వదలి, పల్ + ఆణ్డు = అనేక (వత్సరములు) మంగళము, పల్ఆయిరమ్

+ ఆణ్డు = అనేక (వేల వత్సరముల) మంగళము (కలుగవలెను), ఎన్మిన్ = అని పాడుడు.

**వివ:** శ్రీమదఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడైన సర్వేశ్వరుడు రావణాది రాక్షసులను నిర్మూలించినవాడుగదా; అట్టివాని కవ్యాహతముగ సర్వదేశ సర్వకాల సర్వావస్థలందును నిత్యకైంకర్యము చేయు కులమందు చేరిన యో జనులారా! మీరుగూడ మాతో జేరి యా భగవానునిపై మనసుంచి వాని నామములు నోరార కీర్తింపుడు. భగవద్విముఖులై నేను, నాది యని లోగడ తలచుచుండిన మీ రిపుడు "నారాయణునకే సర్వకైంకర్యములు చేయగలము" అని దృఢమైన యధ్యవసాయము బూని మాతో కలసి యా దేవాధిదేవుని చరణపద్మముల సందర్శింపుడు. అంతేగాదు, అనేక కోటి కల్పములు వర్ధిల్లుము స్వామీ! అని మా స్వామికి మంగళాశాసనము చేయుడు.

ఈ పాశురమున కవి ఐశ్వర్యార్థులగు సామాన్యులను తనతో కలసి భగవంతునకు మంగళము పాడ నాహ్వానించుచున్నారు. శ్రీ మహావిష్ణువును శుచియై భక్తితో సహస్రనామములతో కీర్తించినవానికి కీర్తితోపాటు సర్వసంపదలు సకలశ్రేయములు లభించునని యీ శ్లోకములు చాటుచున్నవి గదా.

**శ్లో॥ భక్తిమాన్ యస్సదోత్థాయ శుచిస్తద్గతమానసః,**
**సహస్రం వాసుదేవస్య నామ్నామేతత్ ప్రకీర్తయేత్**

**శ్లో॥ యశః ప్రాప్నోతి విపులం యాతి ప్రాధాన్యమేవ చ,**
**అచలాం శ్రియమాప్నోతి శ్రేయః ప్రాప్నోత్యనుత్తమమ్."**

**6. ఎన్దైతన్దైదన్దై తన్దైతమ్మూత్తప్ప నేళ్‌పడికాల్ తొడజ్గి,**
**వన్దు వళివళి యాట్చెయ్‌గిన్హోమ్ తిరువోణత్తిరువిళవిల్,**

**అన్దియమ్బోది లరియురు వాగి యరియై యళిత్తవనై,**
**పన్దనై తీర ప్పల్లాణ్ణు పల్లాయిరత్తాణ్డెన్ఱు పాడుదుమే.**

**టీక:** ఎన్దై = నేనును, నా తండ్రియును, తన్దై = వారి తండ్రియును, తన్దై = వారితండ్రియును, తన్దై = వారి తండ్రియును, తన్ + మూత్తప్పన్ = వారి తండ్రియు తాతయు నగు, ఏళ్ పడికాల్ తొడజ్ఞి = ఏడు తరములు మొదలుకొని, వన్దు = (ప్రయోజనాంతర రహితులమై) వచ్చి, వళివళి = పరంపరగా, ఆళ్ + శెయ్‌గిన్ఱోమ్ = దాస్యము చేయుచున్నాము. తిరువోణమ్ + తిరువిళవిల్ = శ్రవణ తిరునక్షత్రమహోత్సవమున, అందియమ్ + పోదిల్ = అంత్య (సూర్యాస్త) సమయమున, అరి + ఉరువు + ఆగి = నరహరిరూపము గలవాడై, అరియై = శ్రతువును (హిరణ్యకశిపుని), అళిత్తవనై = సంహరించినవానిని, పన్దనై = బడలిక, తీర = తీరునట్లు, పల్లాణ్డు= అనేక వత్సరములు, పల్లాయిరమ్ + ఆణ్డు = అనేకవేల సంవత్సరములు (మంగళము), ఎన్ఱు = అని, పాడుదుమే = పాడుదము గాక!

**వివ:** మా తండ్రి మొదలుకొని తాతముత్తాతలుగా ఏడు తరములనుండి వంశపరంపరగా మేము శ్రీమన్నారాయణుని దాస్యమును ప్రయోజ నాంతరరహితులమై చేయుచు వచ్చుచున్నాము. శ్రవణతిరునక్షత్రమున ప్రళయభీకర నరసింహరూపమున సాయంసంధ్యా సమయమున నావిర్భవించి తన శత్రువగు హిరణ్యకశిపుని క్రూరముగా వధించినవాడు గదా యా దేవాదిదేవుడు. బడలిక తీరగా మన మా స్వామికి అనేకవేల సంవత్సరములు సుఖముగా వర్ధిల్లుగాక యని మంగళము పాడుదము రండు.

ఈ పాశురమున ఆళ్వారులు ప్రయోజనాంతరరహితు లగు భక్తులను తమతో శ్రీహరికి పల్లాండు పాడరమ్మని పిలచుచున్నారు.

నృసింహమూర్తి ఘనత యీ పద్యమున నిట్లు వర్ణితము ---

**మ॥ కలఁడెచ్చో హరి యన్న పిన్న నుడువుల్ ఖండించి యిచ్చోటనుం**
**గలఁడా! యంచును గంబమున్ విఱువ నక్కంబంబునంబుట్టి ని**
**స్తులరోషాప్తి హిరణ్యుఁ జక్కడచెఁద్రోద్రో మా నృసింహుండు ద**
**ద్బల మాహాత్మ్యము లౌను కాదనుచు వాదా? యెంత హాస్యంబగున్?**

**7. తీయి ల్పొలిగిన్ద శెఙ్జడ రాళి తిగళ్ తిరుచ్చక్కరత్తిన్,**
**కోయి ల్పొరియాలే యొత్తుణ్డు నిన్టు కుడికుడి యాద్చెయ్‌గిన్టోమ్,**
**మాయప్పొరుపడై వాణనై యాయిరన్తోళుమ్ పొళికురుది,**
**పాయ, చ్చుళత్తియ వాళి వల్లానుక్కు పల్లాణ్డు కూఱుదుమే.**

**టీక:** తీయిల్ = అగ్ని మొదలగువానికంటెగూడ, పొలిగిన్ద = మిక్కిలి ప్రకాశించుచున్నదై, శెమ్ = ఎఱ్ఱని, శుడర్ = కాంతిగలదై, ఆళి = మండలాకారముగ, తికళ్ = ప్రకాశించుచున్న, తిరు + శక్కరత్తిన్ కోయిల్ = సుదర్శనచక్రము వేంచేసియున్నస్థానముయొక్క, పొఱియాలే = చిహ్నముచేత, ఒత్తుణ్డు = (భుజమూలమందు) అంకితమై, నిన్టు = స్థిరముగనుండి, కుడికుడి = తరతరములుగా, ఆళ్ + చెయ్‌కిన్టోమ్ = దాస్యము చేయుచున్నాము. (అదేమనగా), మాయమ్ = కృత్రిమముగా, పొరు = పోరుచున్న, పడై = సైన్యముగల, వాణనై = బాణాసురునియొక్క, ఆయిరమ్ తోళుమ్ = వేయిభుజములనుండియు, పొళి = కురియుచున్న, కురుతి = రక్త (ప్రవాహ) ము, పాయ = (భూమియంతట) వ్యాపించునట్లు, శుళత్తియ = త్రిప్పబడుచున్న, ఆళివల్లానుక్కు = సుదర్శనచక్రముగల సమర్థునికి, పల్లాణ్డు = మంగళాశాసనము, కూరుదుమే = చేసెదము.

**వివ:** సూర్యచంద్రాగ్నులను తిరస్కరించిన యెఱ్ఱని కాంతితో ప్రకాశించునట్టి సుదర్శనచక్రముయొక్క వర్తులాకార చిహ్నము భుజమున ధరించుకొని మా వంశమువార మందరము శ్రీమన్నారాయణుని దాస్యము చేయుచు వచ్చుచున్నాము. కృత్రిమయుద్ధముచేయు బాణాసురుని వేయి భుజములను

నెత్తు రోడునట్లుగా తన చక్రాయుధముచే ఛేదించిన సర్వసమర్థుడగు స్వామినిగూర్చి పల్లాండు పాడుచుందుము.

శ్రీవైష్ణవులకు భుజయుగమున అగ్నితప్తమైన శంఖచక్రములను ధరించుట యత్యంతావశ్యక మనుట కీ యొక్క శ్లోకము చాలును---

**శ్లో॥ భుజయుగమపి చిహ్నైరంకితం యస్య విష్ణోః**
**పరమపురుషనామ్నాం కీర్తనం యస్య వాచి।**
**సురుచిరమపి పుండ్రం మస్తకే యస్య కంఠే**
**సరసిజమణిమాలా యస్య తస్యాస్మి దాసః॥**

భుజద్వయమున విష్ణువుయొక్క తప్తశంఖచక్రములను ధరించి, ఆ పరమపురుషుని నామములను వాక్కుతో పలుకుచు, నుదుట నూర్ధ్వపుండ్ర ములను, కంఠమున తులసీమాలలను దాల్చిన విష్ణుభక్తులకు నేను దాసానుదాసుడను. వారి జోలికి మీరు పోవల దని యముడు భటుల కానతిచ్చె నట!

**8. నెయ్యిడై నల్ల దోర్ శోఋమ్ నియతము మత్తాణి చ్చేవగముమ్,**
**కైయడైక్కాయుమ్ కళుత్తుక్కు ప్పూణొడు కాదుక్కు క్కుణ్డలముమ్,**
**మెయ్యిడ నల్ల తోర్‌శాన్దము న్దన్దెన్నై వెళ్ళుయి రాక్కవల్ల,**
**పైయుడై నాగప్పగై క్కొడియానుక్కు ప్పల్లాణ్డు కూఋవనే.**

**టీక:** నెయ్ + ఇడై = నేతితో సరియైన (తూకముగల), నల్లదు + ఓర్ + శోరుమ్ = శ్రేష్ఠమై విలక్షణమైన ప్రసాదమును, నియతముమ్ = నిత్యమును, అత్తాణి = ఎడబాటులేని, శేవకముమ్ = సేవయును, కై = చేతులలో (నిచ్చిన), డై + కాయుమ్ = ఆకువక్కలును (తాంబూలము), కళుత్తుక్కు = కంఠమున, పూణోడు = హారమును, కాదుక్కు = చెవులకు, కుణ్డలముమ్ = మకర కుణ్డలములును, మెయ్ + ఇడ = శరీరమున నలదిన, నల్లదు +

ఓర్ + శాన్దముమ్ = మంచి విలక్షణమైనచందనమును, తన్దు = ఇచ్చి, ఎన్నై = నన్ను, వెళ్ + ఉయిర్ = విశుద్ధస్వభావునిగ, ఆక్కవల్ల = చేయవలది యగు, పై + ఉడై = (విశాల) ఫణములుగల, నాగమ్ + పగై = నాగములకు శత్రువు (గరుత్మంతుడు), కొడియానుక్కు = ధ్వజముగాగల విష్ణువునకు, పల్లాణ్డు = మంగళము, కూఱువనే = పల్కుదును.

**వివ:** సరికిసరి తూకముగా నేయి వేసికొని భుజింపదగినట్లు ప్రసాదమును, నిత్యకైంకర్యమును, చర్వణమునకు తాంబూలమును, కంఠమునకు హారాద్యలంకారములును, చెవులకు మకరకుండలములును, శరీరమునకు చందనచర్చయు – ననుగ్రహించి యల్పుడగు నన్ను సర్వసుఖములను అనుభవించుటకు తగిన ఐశ్వర్యవంతునిగా చేసినాడు గదా గరుడధ్వజుడగు శ్రీ మహావిష్ణువు! అట్టివానికి నిండుహృదయముతో మంగళాసనముచేయుట తక్క నే నాతనికి ప్రతి యేమి సేయగలను:

కాని మనము ప్రతిగా సేయదగినది యొక్కటిమాత్రమే యని నమ్మాళ్వారులు తమ శ్రీముఖసూక్తి (తిరువాయ్మొళి) లో నిట్లానతిచ్చి యున్నారు.

**మ॥ "ఇఁక మారెయ్యది వాని సత్కృతికి లేదే యాత్మనా? చిత్తగిం**
**చి కనంగా నిపుడాత్మయున్ మిగుల కా శ్రీదేవు సొత్తయ్యె, స్వీ**
**య కృపాబోధక సాధుమంజుల కవిత్వారంభుఁ గావించు సా**
**మికి సేయం బ్రతి వేరొకించుకయు భూమిన్నింగినిన్ గల్గునే!"**

**9. ఉడుత్తుక్కళైన్ద నిన్పీతగవాడై యుడుత్తుక్కలత్త దుణ్డు,**
**తొడుత్తతుళాయ్మలర్ శూడిక్కళైన్దన శూడు మిత్తొణ్డర్గళోమ్,**
**విడుత్తదిశై క్కరుమ న్దిరుత్తి త్తిరువోణ త్తిరువిళవిల్,**
**పడుత్తపైన్నాగణై ప్పళ్ళికొణ్డానుక్కు ప్పల్లాణ్డు కూఱుదుమే.**

**టీక:** ఉడుత్తు = (కటిని) ధరించి, కళైన్ద = విడచి (వేసి) న, నిన్ = నీ యొక్క, పీదకవాడై = పీతాంబరమును, ఉడుత్తు = ధరించియు, కళత్తదు = (ఆరగింపగా) మిగిలినది, ఉణ్డు = భుజించియు, తొడుత్త = మాల కట్ట, శూడి + కళైన్దన = ధరించి విడచిన, తుళాయ్‌మలర్ = తులసీపుష్పములను, శూడుమ్ = ధరించునట్టి, ఇత్తొణ్డర్‌గళోమ్ = దాసులము గదా మేము!, విడుత్త = ఆజ్ఞాపించిన, దిశై = నల్దిక్కులందలి, కరుమమ్ = కర్మ (కైంకర్యము) లను, తిరుత్తి = తీర్చి (దిద్ది), తిరువోణమ్ + తిరువిళవిల్ = శ్రవణతిరునక్షత్ర మహోత్సవమున, పడుత్త = (విష్ణువునకు) పడక (శయ్య) యై, పై = (విస్తృత) ఫణములుగల, నాకు + అణై = నాగము అను శయనమున, పళ్ళికొణ్డానుక్కు = పవ్వళించినవానికి, పల్లాణ్డు = మంగళాశాసనము, కూఱుదుమే = చేసెదము.

**వివ:** మా స్వామి కట్టివదలిన పీతాంబరము మాత్రమే మేము ధరింతుము. తద్భుక్తశేషమునే భుజింతుము. ఆయన ముడిచి విడచిన తులసీదామములనే మేము కైసేసికొందుము. స్వామి యానతిచ్చిన కైంకర్యము చేయుటయే తదీయదాసులమగు మా యనుష్ఠానము. శ్రవణనక్షత్రోత్సవ సందర్భమున పడగలు విప్పిన యాదిశేషునిపై చక్కగా పరుండియున్న శ్రియఃపతికి దృష్టి తగులకుండ మంగళాశాసనము పాడుటకు మించిన కర్తవ్యము మా కేమి కలదు!

ఆ యాదిశేషుడెట్టి కైంకర్యము చేయునో ఆళవందారని సార్థక బిరుదము దాల్చిన యామునాచార్యుల యీ శ్లోకము విశదపఱచును గదా–

**శ్లో॥ నివాసశయ్యాసన పాదుకాంశుకో**
**పధాన వర్షాతప వారణాదిభిః,**
**శరీరభేదై స్తవ శేషతాం గతై**
**ర్యథోచితం శేష ఇతీర్యతే జనైః**

ఆదిశేషుడు తనస్వామి నివసింపనివాసగృహమగును, శయనించుటకు శయ్యయగును, ఆయన ఆసీనుడు కాదలచిన యాసనమగును. నడచిపోవలసినచో పాదుకలగును. దూరమేగుచో వల్లెవాటగును. విశ్రాంతి సమయమున నుపధానమగును. వర్షాతపముల నుండి తన స్వామిని కాపాడుట కాతని ఫణములు ఛత్రవితతి గూడ నగును. వివిధరీతులలో తన దేహముచే విష్ణువుకు శేషత్వమును (కైంకర్యమును) చక్కగా నిర్వహించు వాడగుటచేతనే గదా శేషుఁడను సార్థకనామునైనా డా యనంతుడు!

**10. ఎన్నా ళెమ్బెరుమా నున్దన క్కడియో మె న్ఱెళుత్తుప్పట్ట,**
**వన్నాళే, యడియోఙ్గ ళడిక్కుడిల్ వీడుపె త్తుయ్న్దతుకాణ్**
**శెన్నాళ్తోత్తి త్తిరుమదురై యుట్చిలైగుని త్తైన్దలైయ,**
**పైన్నాగత్తలై ప్పాయ్న్దవనే యున్నై ప్పల్లాణ్డు కూఱుదుమే.**

**టీక:** ఎమ్ + పెరుమాళ్ = మా స్వామీ! ఉన్దనక్కు = దేవరవారికి, అడియోమ్ = దాసులము, ఎన్ఱు = అను, ఎళుత్తు = వ్రాత (మాట), పట్ట = పుట్టినది, ఎన్నాళ్ = ఏ దినమో, అన్నాళే = ఆ దినమునుండియే, అడియోమ్గళ్ = దాసులమగు మేము, అడి + కుడిల్ = దాసుని సంతతివారమును, వీడు = (అహంకారమమకారములు) వీడుటను, పెత్తు = లభించి, ఉయ్న్దతుకాణ్ = ఉజ్జీవించితిమి సుమా, శెమ్ + నాళ్ = మంచి దినమున (రోహిణీ నక్షత్రమున), తిరుమదురైయుళ్ = ఉత్తరమధురలో, తోత్తి = అవతరించి, శిలై = ధనస్సుతో, కునిత్తు = (కంసాదులను) వధించి, ఐమ్ + తలైయ = ఐదుతలలుగల, పైనాగమ్ + తలై = కాళీయుని శిరస్సున, పాయ్న్దవనే = దుమికిన మా స్వామీ! ఉన్నై = నిన్నుపల్లాణ్డు = మంగళాశాసనము, కూఱుదుమే = చేయుచున్నాము.

**వివ:** మా స్వామీ! "సర్వశేషి యాన నారాయణనుక్కే ఎల్లా అడిమైకళుమ్ శెయ్య ప్పెఱవే నాక వేణుమ్." "సర్వశేషియును, నారాయణుడవును అగు నీకే సర్వకైంకర్యములు చేయవలెను." అని మీకు మేము ఒడంబడిక పత్రము

వ్రాసి యిచ్చితిమి గదా! ఆ నాటినుండి మేము మా పుత్రపౌత్రాదులముగూడ నేను నాది యనుట వదలివేసినాము. రోహిణీ నక్షత్రమున ఉత్తర మథురానగరిలో జన్మించినవాడవు నీవు. కంసనరకాది రాక్షసుల నాకర్ణాంతము ధనుస్సు లాగి సంహరించిన ధర్మాచార్యుడవు! పంచశీర్ష ఫణారత్నశోభితుడగు కాళియాహిశిరస్సున దివ్య నాట్యమాడిన సర్వజగన్నాథా! దేవరకు నిత్యమంగళమగు గాక।

**11. *అల్వాళ క్కొన్లు మిల్లా వణికోట్టియర్కో నభిమానతుజన్,**
**శెల్వనై ప్పోల త్తిరుమాలే నాను మునక్కు ప్పళవడియేన్,**
**నల్వగైయాల్ నమో నారాయణా వెన్లు నామమ్ పల పరవి,**
**పల్వగైయాలుమ్ పవిత్తిరనే యున్నై ప్పల్లాణ్డు కూఱువనే.**

**టీక:** తిరుమాలే = లక్ష్మీదేవిపై వ్యామోహముగల ఓ దేవా! అల్వళక్కు = (దేహమే ఆత్మయను) దుర్వివాదములు, ఒన్లుమ్ = ఒగటిగూడ, ఇల్లా = లేనివారలై, అణి = (ప్రపంచమునకు) ఆభరణమైన, కోట్టియర్కోన్ = గోష్ఠినిర్వాహలకు అధిపతియును, అభిమానతుఙ్గన్ = (శ్రీవైష్ణవత్వమను) అభిమానముచే నున్నతుడును, శెల్వనై = శెల్వనంబియను భక్తునివలె, ఉనక్కు = (శేషియైన) నీకు, పళవడియేన్ = పురాతన (దాసుడనైన), నానుమ్ = (శేషభూతుడనగు) నేనును, నల్ = మంచి, వగైయాల్ = (ఈశ్వరుడే ఉపాయమును ఉపేయమును అను) ప్రకారముచే, నమో నారాయణా + ఎన్లు = నమోనారాయణాయ యని (అష్టాక్షరీమంత్ర ముచ్చరించి), పల్ + వగైయాలుమ్ = పలు ప్రకారములుగా, పవిత్తిరనే = పవిత్రుడా, నామమ్ + పల = పలునామములు, పరవి = పలికి, ఉన్నై = నిన్నుగుఱించి, పల్లాణ్డు = మంగళాశాసనము, కూఱువనే = చేయుచున్నాను.

**వివ:** ఓ శ్రీపతీ! దేహాత్మబుద్ధ్యాది వివాదములలో పాల్గొనని వారి గోష్ఠిని నిర్వహించిన శెల్వనంబియను భక్తునివలెనే ఈ దాసుడును నీ కనాదికాలము

నుండియు శేషభూతుడే. స్త్రీల నాకర్షించుటమాత్రమేగాక పురుషుల దృష్టిచిత్తాపహారముసైతము చేయు త్రిభువన మోహనమూర్తియగు నీవు నాకుగల యహంకారాదిదోషములు భేదింప సమర్థుడవు. అష్టాక్షర్యాది మంత్రరాజములతో విలక్షణముగా నీకు మంగళము పాడ నుపక్రమింపదగిన వాక్శక్తియుక్తులు నా కనుగ్రహింపుమా.

నామమహిమను చెప్పిన శ్రీ కులశేఖరులవారి యీ శ్లోకరాజ మెంత, దొడ్డది–

**శ్లో॥ హే మర్త్యాః, పరమం హితం శ్రుణుత వో**
**వక్ష్యామి సంక్షేపతః**
**సంసారార్ణవ మాపదూర్మిబహుళం**
**సమ్యక్ ప్రవిశ్య స్థితాః,**
**నానాజ్ఞానమపాస్య చేతసి నమో**
**నారాయణాయేత్యముం**
**మంత్రం సప్రణవం ప్రణామసహితం**
**ప్రావర్తయధ్వం ముహుః.**

ఓ జనులారా! అయ్యో! సంసారసముద్రమున మునిగి మీరు తెన్నుగానక యున్నారుగదా! విపదావర్తభీకరమగు ఈ సాగరము తరింప నిచ్చగించినచో నా మాట వినుడు. చింతలన్నియు కట్టిపెట్టి ప్రణవమను చుక్కానిగల నారాయణమంత్ర మను తెప్ప నారోహింపుడు. దానిని నమ్ముకొని యెడతెగక జపించువారి నదియే యద్దరి జేర్పగలదు సుడీ!

**12. *పల్లాణ్డెన్ఱు పవిత్తిరనై ప్పరమేట్టియై, చ్చార్ఙ్గ మెన్నుమ్,**
**విల్లాణ్డాన్ఱన్నై విల్లిపుత్తూర్ విట్టుశిత్తన్ విరుమ్బియ శొల్,**
**నల్లాణ్డెన్ఱు నవి న్ఱురైప్పార్ నమో నారాయణాయ వెన్ఱు,**
**పల్లాణ్డుమ్ పరమాత్మనై చ్చూళ్ న్దిరు న్దేత్తువర్ పల్లాణ్డే**

**టీక:** పవిత్తిరనై = (పరమ) పవిత్రుని, పరమేట్టియై = పరమపద నివాసుని, శార్జమ్ + ఎన్నుమ్ = శార్జము అను, విల్ = విల్లును, ఆణ్డాన్‌దన్నై = కలవానిని, విల్లిపుత్తూర్ = విల్లిపుత్తూరునందలి, విట్టుశిత్తన్ = విష్ణుచిత్తుడనుకవి, పల్లాణ్డు + ఎన్ఱు = మంగళము (కలుగవలెను) అని, విరుమ్బియ = ఆశాసించిన, శొల్ = కవితను, నల్ + ఆణ్డు + ఎన్ఱు = (పాడుటకిది) మంచిసమయము అని, నవిన్ఱు = సదా, ఉఱైప్పార్ = పలుకువారు, నమోనారాయణాయ + ఎన్ఱు = నారాయణునకు నమస్కారము అని, పల్లాణ్డుమ్ = బహుకాలము, పరమాత్మనై = (ఆ) పరమాత్ముని, శూళ్‌న్దు = చుట్టి (కొని), ఇరున్దు = ఉండి, పల్లాణ్డు = మంగళము, ఏత్తువర్ = పాడగలుగుదురు.

**వివ:**

**శ్లో॥ "పవిత్రాణాం పవిత్రం యో మఙ్గళానాం చ మఙ్గళమ్,**
**దైవతం దేవతానాం చ భూతానాం యోఽవ్యయః పితా"**

పవిత్రమైనవానిలో భగవానుడు పవిత్రుడు, మంగళములకెల్లమంగళ మాయనయే! దేవతలకందరకు దైవత మా స్వామియే! భూతజాలమున కవ్యయపిత యాతడే." యని వ్యాసమహర్షి పల్కినట్లు నారాయణమూర్తి పవిత్రములకెల్ల పవిత్రము గదా! శార్జధన్వుడగు నా పరమపద వాసునకు సర్వమంగళములు కలుగవలెనని శ్రీ విల్లిపుత్తూర బుట్టిన విష్ణుచిత్తులు చెప్పిన ద్రావిడవేద నిగూఢార్థము గదా యీ తిరుప్పల్లాణ్డు! ఈ పాశురముల ననుసంధించుటయే మంచికాలమునకు చిహ్నమని తలచి సదా వీనిని గానము చేయువారు నారాయణుని సమీపించి యాతనికి నిత్య మంగళము పాడుకొను భాగ్యము తప్పక పొందగలరు.

(పెరియాళ్వార్ శ్రీపాదములే శరణము)

---ం---

## తిరునక్షత్ర తనియన్

**శ్లో॥ "మిథునే స్వాతిజం విష్ణు రథాంశం ధన్వినః పురే**
**ప్రపద్యే శ్వశురం విష్ణో ర్విష్ణుచిత్తం పురశ్శిఖమ్"** **1**

గరుత్మంతుని యవతారమైన పెరియాళ్వారనబడు విష్ణుచిత్తులు మిథునమాసమున స్వాతీనక్షత్రమున శ్రీ విల్లిపుత్తూర నవతరించిరి. ఆ యాళ్వారులు శ్రీరంగనాథునకు తన కుమార్తె గోదాదేవి నిచ్చి మామయైనారు గదా!

**శ్లో॥ గురుముఖమనధీత్య ప్రాహ వేదానశేషాన్**
**నరపతిపరిక్లుప్తం శుల్క మాదాతుకామః,**
**శ్వశుర మమరవన్ద్యం రఙ్గనాథస్య సాక్షాత్**
**ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి.** **2**

దీని వ్యాఖ్య యీ గ్రంథారంభమున కలదు.

## వాళిత్తిరునామమ్

**నల్లత్తిరుప్పల్లాణ్డు నాన్మ్కాన్తోన్ వాళియే**
**నానూత్తఋపత్తొన్ను నమక్కురైత్తాన్ వాళియే**
**శొల్లతియ వానిదనిఱ్ శోదివన్దాన్ వాళియే**
**తొడై శూడి క్కొడుత్తాళై తొఋతన్దై వాళియే**
**శెల్వనమ్బి తనైప్పోల శిఱప్పుత్తాన్ వాళియే**
**శెన్ఱు కిళియఋత్తు మాల్ తెయ్వ మెన్ఱాన్ వాళియే**
**విల్లిపుత్తూర్ నగరత్తై విళఙ్గవైత్తాన్ వాళియే**
**వేదియర్కోన్ పట్టర్పిరాన్ మేదినియిల్ వాళియే**

మంచి తిరుప్పల్లాండను పాటలు కట్టి పాడిన కవికి మంగళము! నాల్గువందల అరువదియొక్క పాశురములు చెప్పిన వారికి మంగళము! మిథునమాసమున స్వాతీ నక్షత్రమున నవతరించిన ఘనులకు మంగళము ఆముక్తమాల్యదాదేవిచే వందితుడగు జనకమహర్షికి మంగళము లావణ్య సంపద్భరితుడగు శ్రీమహావిష్ణువులెనే పూజలు గొనుచుండువారికి మంగళము! విష్ణుపరత్వము స్థాపించి పరతత్త్వశుల్కము త్రెంచి తెచ్చుకొన్న వారికి మంగళము! శ్రీ విల్లిపుత్తూరును తన జ్ఞానప్రదీపముచే నాలోకితము చేసిన సుధీమణికి మంగళము! వేదవేత్తల కగ్రణి యగు పెరియాళ్వారులకు మంగళము!!

* * * * *

# తిరుప్పళ్ళియెళుచ్చి

## తనియన్లు

*కర్త:- తిరుమాలై యాండాన్*

**1. త మేవ మత్వా పరవాసుదేవం రఙ్గేశయం రాజవదర్హణీయమ్।**
**ప్రాబోధకీం యోఽకృత సూక్తిమాలాం భక్తాఙ్ఘ్రిరేణుం భగవన్తమీడే॥**

**టీక:** రాజవత్ + అర్హ ణీయం = మహారాజువలె పూజ్యుడైన, రఙ్గేశయం = శ్రీరంగనాథుని, తం = ఆ, పరవాసుదేవం ఏవ = పరమపదనాథునిగనే, మత్వా = తలచి, ప్రాబోధకీం = (స్వామిని ప్రబోధించు) తిరుప్పళ్ళియెళుచ్చి యను, సూక్తిమాలాం = వాఙ్మాలను, యః= ఏ కవి, అకృత = చేసెనో, తం = ఆ, భగవన్తం = జ్ఞానసంపదగల, భక్తాఙ్ఘ్రిరేణుం = తొండరడిప్పొడి యాళ్వారును, ఈడే = స్తుతించుచున్నాను.

**వివ:** శ్రీరంగనాథుని సామాన్యమగు నర్చావతారముగా నెంచక సాక్షాత్ పరమపదనాథుడగు శ్రీమన్నారాయణునిగనే తలచి ఆ స్వామిని మేల్కొలుపుటకు తిరుప్పళ్ళియెళుచ్చి యను దివ్యప్రబంధమును ప్రపన్నుల నిత్యోపయోగార్థ మనుగ్రహించిన తొండరడిప్పొడి యాళ్వారులను నామాంతరముగల విప్రనారాయణునికి త్రికరణ శుద్ధిగాప్రణమిల్లుచున్నాను.

* * * * *

**కర్త:-** తిరువరంగ ప్పెరుమా ళరయర్

**మణ్డఙ్గుడి యెన్బర్ మామఱైయోర్ మన్నియశీన్,**
**త్తొణ్డరడిప్పొడి తొన్నగరమ్, వణ్డు**
**తిణర్తవయల్ తెన్నరఙ్గత్తమ్మానై, ప్పళ్ళి**
**యుణర్తుమ్బిరా నుదిత్తవూర్.** 2

**టీక:** వణ్డు = తుమ్మెదలచేత, తిణర్త = చుట్టబడిన, వయల్ = వరిచేలు గల, తెన్ = దక్షిణదిక్కున నుండు, అరఙ్గమ్ = శ్రీరంగమునకు, అమ్మానై = నాథుడగు రంగనాథుని, పళ్ళి = పడకనుండి, ఉణర్తుమ్ = మేల్కొల్పిన, పిరాన్ = (మిగుల) ఉపకారకులైన, తొణ్డర్ + అడి + పొడి = భక్తాంఘ్రిరేణువు, ఉదిత్త = ఉదయించిన, ఊర్ = ఊరు (దివ్య స్థలము), తొల్ + నగరమ్ = ప్రాచీననగరమైన, మణ్డఙ్గుడి = మండంగుడి, ఎన్బర్ = అని యందురు.

**వివ:** శ్రీరంగధామము తుమ్మెదలు నిరంతర ఝంకారము చేయు వరిమళ్ళచే సదా పరివేష్టితమై యలరారుచుండును. అచట విరాజిల్లుచుండు శ్రీరంగనాథుని తాను కూర్చిన తిరుప్పళ్ళి యెళుచ్చి యనుద్రావిడ దివ్యప్రబంధముచేత మేల్కొలిపిన శ్రీ తొండరడిప్పొడియాళ్వారు లవతరించిన దివ్యదేశమును మండంగుడి యని వచింతురు.

* * * * *

**1.** ***కదిరవన్ గుణదిశైచ్చిగరమ్వ న్దణైన్దాన్**
**కనై యిరుళగన్ఱదు కాలై యమ్బొళుదాయ్,**
**మదు విరి న్దొళుగిన మామల రెల్లామ్**
**వానవ రరశర్గళ్ వన్దువ న్దీణ్డి,**

**ఎదిర్దిశై నిఱైన్దన రివరొడు మ్బుగున్ద**
**విరుఙ్గళి త్తీట్టముమ్ పిడియొడు మురశుమ్,**
**అదిర్తలి లలైకడల్ పోన్ఱుళ దెఙ్గుమ్**
**అరఙ్గత్తమ్మా పళ్ళి యెళు న్దరుళాయే**

**టీక:** కదిరవన్ = సూర్యుడు, కుణమ్ + దిశై + శిగరమ్ = తూర్పు దిక్కున (ఉదయగిరి) శిఖరమునకు, వన్దు = వచ్చి, అణైన్దాన్ = చేరినాడు,

కనమ్ + ఇరుళ్ = ఘనమైన చీకటి, అగన్ఱదు = పూర్తిగా నశించినది, అమ్ + కాలై + పొళుదు + ఆయ్ = అందమైన ప్రభాతకాలము అయినందున, మామలర్ + ఎల్లామ్ = మంచి పుష్పములన్నియు, విరిన్దు = వికసించి (వానినుండి), మదు = మధువు, ఒళుగిన = స్రవించుచున్నది, వానవర్ = దేవతలును, అరశర్గళ్ = రాజులును, వన్దువన్దు = గుంపులు గుంపులుగా వచ్చి, ఈణ్డి = సమూహముగా, ఎదిర్దిశై = ఎదుటి దిక్కున, నిఱైన్దనర్ = నిలచియున్నారు, ఇవర్ + ఒడుమ్ = వీరితో కలసి, పుగున్ద = వచ్చి చేరిన, ఇరుమ్ + కళిర్ + ఈట్టముమ్ = గొప్ప మగయేనుగుల గుంపులును, పిడి+ ఒడు = ఆడయేనుగుల గుంపులును, మురశుమ్ = మురజములు (మద్దెలలు)ను, అలైకడల్ పోన్ఱు = (పెద్ద) అలలుగల (మహా) సముద్రమువలె, అదిర్తలిల్ = ధ్వనిచేయుచు, ఎఙ్గుమ్ = అంతటను, ఉళదు = వ్యాపించి యున్నవి, (కాన) అరఙ్గత్తమ్మా = ఓ రంగనాథుడా! పళ్ళి = (ఫణిపతి) శయనమునుండి, ఎళున్దు = లేచి, అరుళాయే = (మమ్ము) అనుగ్రహింపుమా!

**వివ:** జగన్నాథుడవగు నో శ్రీరంగనాథా! తూర్పున లోకబాంధవు డుదయించినాడు. చీకటియంతయు విరిసిపోయినది. భగవదారాధన కుపయోగించు నీ సుప్రభాతము సర్వసుప్రసన్నముగా నున్నది. పువ్వులు పూచి వాని మకరందము నేలపై జాలువారుచున్నది. అష్టదిక్పాలాదు లగు దేవతాగణమును వివిధదేశాధీశులగు భూమీశులును మీ సేవార్థులై యాస్థానిలో నిలబడియున్నారు. వారివారి వాహనములగు గజాశ్వాదుల యొక్క ఘంటాదిరవములు సముద్రఘోషము ననుకరించి మిన్ను ముట్టుచున్నవి. కాన దేవర నిద్ర మేల్కొని వీరికి మీ సేవాభాగ్యము ననుగ్రహించి వీరి కైంకర్యము స్వీకరింపుడీ!

**2. కొళుజ్గొడి ముల్లైయిన్ కొళుమల రణవి**
**క్కూర్న్దదు కుణదిశై మారుద మిదువో,**
**ఎళున్దన మలరణై ప్పళ్ళికొణ్డన్నమ్**
**ఈన్బని ననైన్ద దమిరు ఞ్జిర గుదతి,**
**విళుజ్గియ ముదలైయిన్ పిలమ్బురై పేళ్వాయ్**
**వెళ్ళెయిఱుఱ వదన్ విడత్తినుక్కనుజ్గి,**
**అళుజ్గియ వానైయి నరున్దుయర్ కెడుత్త**
**అరజ్గత్తమ్మా పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** కుణదిశై = తూర్పుదిక్కునందలి, మారుతమ్ = మలయమారుతము, కొళుమ్ = (చక్కగా) పెరిగిన, కొడి = తీగెలు గల, ముల్లైయిన్ = మొల్లలయొక్క, కొళు = పుష్పించిన, మలర్ = పరిమళమును, అణవి = కైకొని, కూర్న్దదు = వీచుచున్నది, మలర్ + అణై = పద్మ శయ్యయందు, పళ్ళికొళ్ = నిద్రించు, అన్నమ్ = హంస మిథునములు, ఈన్ = (వానవలె) కురియు, పని = మంచులో, ననైన్ద = తడిసిన, తమ్ = తమ, ఇరుమ్ = చక్కని, శిఱగు = తెక్కలను, ఉదతి = విదలించుకొని, ఎళున్దన = (నిద్ర) లేచినవి, విళుజ్గియ = మేల్కొనిన, ముదలయిన్ = మొసలియొక్క, పిలంబురై = బిలద్వారమునకు తగిన, వేళ్ = పెద్ద, వాయ్ = నోరుగల, వెళ్ళయిఱుఱ = తెల్లని విషపుకోఱలతో నొక్కిన, అదన్ = ఆ మొసలియొక్క, విడత్తినుక్కు = పంటివిషమునకు, అనుజ్గి అళుజ్గియ = మిక్కిలి బాధచెందిన, ఆనైయిన్ = గజేంద్రునియొక్క, అరుమ్ + తుయర్ = గొప్ప దుఃఖమును, కెడుత్త = పోగొట్టిన, అరజ్గమ్ + అమ్మా = శ్రీరంగనిర్వాహకుడా! పళ్ళి యెళున్దరుళాయే = నిదురలేవయ్యా!

**వివ:** మొల్లల దివ్యసౌరభముతో మిళితమైన ఉదయపుగాలి వీతెంచుచు ఒడలికి గిలిగింతలు పెట్టుచున్నది. అరవిందములందు నిద్రించు హంసల

జంటలు తెక్కలపై పడిన మంచు నందముగ విదలించు కొనుచు మెల్లగా మేల్కొన్నవి. క్రూరమైన నక్రముయొక్క దంష్ట్రలందు చిక్కుకొన్న యా గజేంద్రుని మహార్తిని పోగొట్టిన స్వామీ! ఇంకను నిద్రపోదగునా? మా యందు దయయుంచి లేచి కాలకృత్యములు తీర్చుకొని యప్సరోభామ లందించు సపర్యల నందుకొన సిద్ధము కమ్మా.

**3. శుదరొళి పరన్దన శూళ్తిశై యెల్లామ్**
**తున్ని యతారగై మిన్నొళి శురుఙ్గి**
**పదరొళి పశుత్తనన్ పనిమది యివనో**
**పాయిరు ళగన్దదు పైమ్పొళి ఱ్కముగిన్,**
**మదలిడై క్కీఱి వణ్బాళైగళ్ నాఱ**
**వైగఱై కూర్న్దదు మారుద మిదువో**
**అడ లొళి తిగళ్దర్ తిగిరి యన్దడక్కై**
**అరఙ్గత్తమ్మా! పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** శూళ్తిశై + ఎల్లామ్ = చుట్టునున్న దిశలందు, శుదర్ + ఒళి = సూర్యకిరణములు, పరన్దన = వ్యాపించినవి, తున్నియ = (ఆకసమున) దట్టమైన, తారకై = నక్షత్రములయొక్క, మిన్ + ఒళి = గొప్ప కాంతి, శురుఙ్గి = తగ్గినది, పదర్ + ఒళి = గొప్ప ప్రకాశముగల, పని మది = చల్లని చంద్రుడును, పశుత్తనన్ = వెల వెల బాఱెను, పా = అలముకొన్న, ఇరుళ్ = చీకటి, అకన్దదు = వీడిపోయినది, పై = పచ్చని, పొళిల్ = తోపులందున్న, కముకిన్ = క్రముక వృక్షముల (పోకచెట్ల) యొక్క, మదల్ + ఇడై + కీఱి = మట్టలు విరిసి వికసించుటచే, వణ్ = చక్కని, పాళైగళ్ = పాళెలు, నాఱ = పరిమళింపగా, (దాని సువాసనగొని), వైకఱై మారుదమ్ = ఉదయవాయువు, కూర్న్దదు = వీచెను, ఇదువో = ఇదుగో (చూడుమా!) అడల్ = ఒలముగల, ఒళి = తేజస్సుతో, తిగళ్తరు = ప్రజ్వలించునట్టి,

తిగిరి = చక్రాయుధమును (ధరింపదగిన), అమ్ = అందమై, తడమ్ = విశాలమగు, కై = చేతులుగల, అరజ్గత్తమ్మా = శ్రీరంగనాయకా! పళ్ళి యెళు న్దరుళాయే = నిద్ర లెమ్మా!

**వివ:** సూర్యుని వెలుతు రెల్లెడల వ్యాపించినది. తెల్లవారినది. చుక్కల వెలుతురు క్షీణించినది. చందమామగూడ వెలవెల పోవుచున్నాడు. ఉద్యానవనములోని పోకచెట్లయందలి మొగ్గలు వికసింపగా నా వాసన దోచుకొని యుదయపుగాలి తోతెంచుచున్నది. తన దీధితులతో దిగ్దిగంత ములను చకచ్చకితము చేయునట్టి సుదర్శనచక్రము ధరింపగలిగిన విశాలభుజములతో నొప్పారు స్వామీ! ఇకనైన మేల్కొను మిందిరేశ!

**4. మేట్టిళ మేదిగళ్ తళైవిడు మాయర్గళ్**
**వేయ్జ్గుళ లోశైయుమ్ విడైమణి క్కురలుమ్,**
**ఈట్టియ విశైదిశై పరన్దన వయలుళ్**
**ఇరిన్దన శురుమ్బిన మిలజ్గైయర్ కులత్తై,**
**వాట్టియ వరిశిలై వానవరేఱే**
**మామునివేళ్వియై క్కాత్తు, అవపిరదమ్**
**ఆట్టియ వడుతిఱ లయోత్తి యెమ్మరశే**
**అరజ్గత్తమ్మా పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** మేడు = పొడవై, ఇళమ్ = లేతవైన, మేదిగళ్ = గేదెలను, తళైవిడుమ్ = మేయ విడుచునట్టి, ఆయర్గళ్ = ఆల మేపరులు (గొల్లలు), వేయమ్కుళల్ + ఓశైయుమ్ = వెదురుపిల్లనగ్రోవి ధ్వనియును, విడై = (ఎద్దుల) కంఠములందలి, మణి + కురళుమ్ = గంటలధ్వనియును, ఈట్టియ = ఈ రెండును కలసిన, ఇశై = ధ్వని, దిశై = అన్ని దిక్కులను, పరన్దన = వ్యాపించెను, వయలుళ్ = వరిమళ్ళలోనుండు, శురుమ్బినమ్ =

తుమ్మెదలు, ఇరిన్దన = చెదరిపోయినవి, ఇలజ్గైయర్‌కులత్తై = లంకాధిపతి కులమును, వాట్టియ = (నిశ్శేషముగ) హతమార్చిన, వరి = చూడదగిన, శిలై = శార్ఙ్గ మనుధనస్సుకలవాడై, వానవర్ + ఏఱే = (బ్రహ్మాది) దేవతలకు నియామకుడై, మామునివేళ్వియై = (విశ్వామిత్ర) మహాముని యాగమును. కాత్తు = కాపాడి, అవపిరతమ్ + ఆట్టియ =అవభృథ స్నానము చేయించినవాడై, అడు + తిరల్ = (శత్రు) నాశమందు బలముగల, అయోత్తి + ఎమ్ + అరశే = అయోధ్యనేలు మా రక్షకుడా! అరజ్గత్తమ్మా = శ్రీరంగశయానుడా! పళ్ళియెళున్దు = పడక విడచి లేచి, అరుళాయే = కటాక్షింపుమా!

**వివ:** మిక్కిలి యున్నతములైన గేదెదూడలను మేతకై విడచునట్టి గొల్లపిల్లవాంద్ర వేణునాదమును, ఎద్దుల కంఠములందలి ఘంటల ధ్వనియును దశదిశలందును ప్రతిధ్వనించుచున్నవి. పుష్పములందలి మధురమకరందము పానముచేయునట్టి తుమ్మెదలు ఈ ధ్వని విని బెదరి చెదరిపోయినవి. బ్రహ్మాదులనుగూడ కనుసన్నల నాడింపగలవాడవు గదా నీవు! శ్రీరామచంద్రుడవై అవతరించి బాల్యముననే విశ్వామిత్రునియాగము రక్షించి యా మహర్షి నవబృథస్నానము చేయించితివిగదా! చండవైరి వీరభుజదండ ఖండనోద్దండ చణమైన ప్రతాప ప్రభావముగల ఓ అయోధ్యాధిపతీ! శ్రీరంగనాయకా! నిదుర లెమ్మా!

**5. పులమ్బిన పుట్కళుమ్ పూమ్బొళిల్‌గ ళిన్వాయ్**
**పోయిత్తు క్కజ్గుల్ పుగున్దదు పులరి**
**కలన్దదు కుణదిశై క్కనై కడ లరవమ్**
**కళివణ్డు మిళత్తియ కలమ్బగ మ్పునైన్ద,**
**అలజ్గల న్తొడైయల్ కొణ్డడియిణై పణివాన్**
**అమరర్‌గళ్ పుగున్దన రాదలిలమ్మా,**

**ఇలఙ్గైయర్కోన్ వళిపాడుశెయ్ కోయిల్**
**ఎమ్బెరుమాన్ పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** పూ = పూచిన, పొళిల్కళిన్వాయ్ = తోటలోనుండు, పుళ్కళ్ = పక్షులు, పులమ్బిన = (మేల్కొని) కిచకిచలాడుచున్నవి; కఙ్గుల్ = రాత్రి, పోయిత్తు = (గడచి) పోయినది, పులరి = (భగవదారాధనయోగ్యమైన) ఉషఃకాలము, పుగున్దదు = ప్రవేశించినది, కుణదిశై = తూర్పుదిక్కున, కనై = ఘోషించు, కడల్ + అరవమ్ = సముద్రధ్వని, కలన్దదు = వ్యాపించినది, కళి = (మధుపానముచే) మదించిన, వణ్డు = తుమ్మెదలు, మిళత్తియ = ఝుంకారము చేయుచున్నవి, కలమ్బగన్ = వివిధపుష్పములతో, పునైన్ద = చేర్చబడిన, అమ్ = అందమగు, అలఙ్గల్ = కదలుచున్న, తొడైయల్ = మాలికలు, కొణ్డు = చేకొని, అమరర్గళ్ = అమరులు, అడియిణై = మీ పాదముల జంటయందు, పణివాన్ = ఉంచుటకు, పుగున్దనర్ = వచ్చి నిలచియున్నారు, ఆదలిల్ = కనుక, అమ్మా = ఓ సర్వస్వామీ! ఇలఙ్గైయర్కోన్ = లంకావాసులకు ప్రభువు (విభీషణుడు), వళిపాడుశెయ్ = దాసవృత్తిచేయు, కోయిల్ = (శ్రీరంగ) మందిరముననుండు, ఎమ్ + పెరుమాన్ = నన్నేలుస్వామీ! పళ్ళి యెళు న్దరుళాయే = ప్రక్కవీడి కటాక్షింపుమా.

**వివ:** శ్రీ విభీషణునిచే సర్వకైంకర్యములు గొనుచుండు మా సర్వస్వామీ! మీ యుపవనమందలి పక్షులు మేల్కొని కిచకిచలాడుచున్నవి. రాత్రి గడచినది. మీ తిరువారాధన వేళ యయినది. సాగరఘోష యలముకొన్నది. తుమ్మెదల యనవరత ఝుంకారము కర్ణపేయముగా నున్నది. వివిధవర్ణ పరిమళ విరాజిత కుసుమ మాలికలను మీ పాదారవిందములందు సమర్పించుటకు స్వర్గమునుండి దిగి యమరులు వచ్చియున్నారు. కాన కరుణించి నిద్ర లెమ్ము.

**6. ఇరవియర్ మణినెడు న్దేరొడు మివరో**
**ఇఱైయవర్ పదినోరు విడైయరు మివరో,**
**మరువియ మయిలిన నఱుముగ నివనో**
**మరుదరుమ్ వశుక్కళుమ్ వన్దువ న్దీణ్డి,**
**పురవియో డాడలుమ్ పాడలుమ్ తేరుమ్**
**కుమరతణ్డమ్ పుగు న్దీణ్డియవెళ్ళమ్,**
**అరువరై యనైయ నిన్ కోయిల్ మున్నివరో**
**అరఙ్గత్తమ్మా! పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** మణి = మణులు చెక్కిన, నెడుమ్ = గొప్ప, తేర్ + ఒడు = రథములుగల, ఇరవియర్ = (రవి) ద్వాదశాదిత్యులును, ఇవరో = ఇరుగో, ఇఱైయవర్ = నిర్వాహకులగు, పదినొరువిడైయరుమ్ = ఏకాదశరుద్రులును, ఇవరో = ఇరుగో, మరువియ = (ఎప్పుడును) అధిష్ఠించు, మయిలినన్ = మయూరవాహనుడగు, అఱుముగన్ = ఆరుముఖములుగల కుమారస్వామియును, ఇవనో = ఇరుగో, మరుదరుమ్ = నలుబది తొమ్మండుగురు మరుత్తులును, వశుక్కళుమ్ = అష్టవసువులును, వన్దు వన్దు = (నేను ముందు నేను ముందని) వచ్చి, ఈణ్డి = దట్టముగ, పురవియోడు = (వీరి వాహనములగు) గుఱ్ఱములతోను, తేరుమ్ =రథములతోను, పాడలుమ్ = (అప్సరసల) పాటలును, ఆడలుమ్ = ఆటలునై, కుమరతణ్డమ్ = కుమారస్వామితో, ఈణ్డియ = దట్టమైన, వెళ్ళమ్ = (సేనా) సమూహము, అరువరై = గొప్ప మేరుపర్వతముతో, అణైయ = సమానమైన, కోయిల్ = నీ కోవెలలో, నిన్మున్ = మీ ముందు, పుగున్దు = ప్రవేశించినది (కాన), ఇవర్ = వీరిని (కటాక్షించుటకు), అరఙ్గత్తమ్మా = శ్రీరంగాధిపతీ! పళ్ళి యెళు న్దరుళాయే = నిద్రలెమ్మా!

**వివ:** గొప్ప గొప్ప రథములెక్కి ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు నీ దర్శనార్థులై నీ వాకిట నిలబడియున్నారు. మరుద్గణములు, వసువులు,

తమ తమ రథతురగాది వాహనములతో నీ సేవార్థులై యరుదెంచి చేతులు కట్టుకొని బరాబరులు సేయుచున్నవారు. అప్సరస్త్రీగణములు నాట్యమాడుచు సంగీతము పాడుచు నీ సేవకై నిరీక్షించుచున్నారు. కుమారస్వామి సేనలు మహామేరుపర్వతమువలె ధగద్ధగాయమానముగా నున్న నీ కోవెలముందు చేరినవి. ఇకనైన లెమ్మా శ్రీరంగనాథా!

**7. అన్దరత్తమరర్గళ్ కూట్టఙ్గ ళివైయో**
**అరున్దవమునివరుమ్ మరుదరు మివరో,**
**ఇన్దిరనానైయుమ్ తానుమ్ వన్దివనో**
**ఎమ్బ్బరుమా నునకోయిలిన్ వాశల్**
**శున్దరర్ నెరుక్క విచ్చాదరర్ నూక్క**
**ఇయక్కరుమ్ మయఙ్గినర్ తిరువడిత్తొళువాన్,**
**అన్దరమ్ పా రిడ మిల్లై మత్తిదువో**
**అరఙ్గత్తమ్మా! పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** ఎమ్బెరుమాన్ = మా స్వామియగు, ఉన్‌కోయిలిన్‌వాశల్ = మీ యాలయద్వారమున, ఇన్దిరన్ తానున్ = దేవేంద్రుడును, ఆనైయుమ్ = (ఆతని వాహనము) ఏనుగు (ఐరావతమును), వన్దు = వచ్చి (యుండుటయేగాక), అన్దరమ్ + అమరర్గళ్ = అణ్డములందలి దేవతలును, కూట్టఙ్గళ్ = (వీరి) పరివారములును, అరుమ్ = అశక్యమయిన, తవమ్ = తపస్సుగల, మునివరుమ్ = సనకాది మహర్షులును, మరుదరుమ్ = మరుత్తులును, శున్దరర్ = సుందరులగు (గంధర్వులు), నెరుక్క = క్రిక్కిరిసి యుండగా, విచ్చాదరర్ = విద్యాధరులు, నూక్క = త్రోయగా, ఇయక్కరుమ్ = యక్షులును, తిరువడి + తొళువాన్ = నీ శ్రీపాదసేవకు, మయఙ్గినర్ = వ్యామోహపడియున్నారు, మత్తు = మరియును, ఇదువో = ఇదిగో, అన్దరమ్ = అమ్బరమునకు, పార్ = భూమికి, ఇడమ్ = స్థలము (భేదము), ఇల్లై =

లేదు, అరఙ్గత్తమ్మా = శ్రీరంగధామా, పళ్ళి యెళు న్దరుళాయే = నిద్ర లెమ్మా.

**వివ:** దేవర యాలయ ద్వారమున ఐరావతమెక్కి దేవేంద్రుడును, సకలదేవతలును, సనకసనందనాది మహర్షులును, మరుద్గణములును, గంధర్వులును, యక్షవిద్యాధరులును క్రిక్కిరిసియుండి త్రోసికొనుచున్నారు. నీ పాదారవింద సందర్శనేచ్ఛయే వీరి నిట్లు చేయుచున్నది. భూమ్యాకాశములు గుర్తింప వీలులేక నిలచియున్న వీరి సమ్మర్దము నీవు నిద్ర లేచిననేగాని శమింపదు సుమా!

**8. వమ్బువిళ్ వానవర్ వాయుఱై వళఙ్గ**
**మానిదికపిలై యొణ్ కణ్ణాడిముదలా,**
**ఎమ్బెరుమాన్ పడిమైక్కలమ్ కాణ్డఱ్కు**
**ఏఱ్పనవాయిన కొణ్డు నల్మునివర్,**
**తుమ్బురునారదర్ పుగున్దన రివరో**
**తోన్డ్రిన నిరవియుమ్ తులఙ్గొళి పరప్పి,**
**అమ్బరతలత్తుని న్డగల్గిన్డ దిరుళ్పోయ్**
**అరఙ్గత్తమ్మా! పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** వళఙ్గ = (మీకు) అర్పించుటకు, వమ్బువిళ్ = సువాసనగల, వాయుఱై = గరికలును, మా = శ్లాఘ్యమైన, నిది = (ధన) నిధులు (చేతనుంచుకొని), వానవర్ = దేవతలును, కపిలై = కపిల ధేనువును, ఒణ్ = ప్రకాశించు, కణ్ణాడిముదలా = నిలువుటద్దము మొదలయినవి, ఎమ్బెరుమాన్ = సర్వస్వామియగు మీకు, పడిమైక్కలమ్ = ఉపకరణములన్నియు, కొణ్డు = తెచ్చి, నల్ = మంచి, మునివర్ = ఋషులును, తుంబురునారదర్ = తుంబురునారదులును (దేవగాయకులును), పుగున్దనర్ = వచ్చియున్నారు,

ఇవరో = ఇరుగో (వీరుగాక), ఇరవి = సూర్యుడు, తులజ్గ + ఒళి = గొప్ప తేజస్సును, పరప్పి = పఱపి, తోన్ఱినన్ = తోచు (కానుపించు) చున్నాడు, ఇరుళ్ = చీకటి, అమ్బరతలత్తినిన్ఱుమ్ = అంబరతలమునుండి, పోయ్అకల్ కిన్ఱతు = నిశ్శేషముగా పోయినది (కాన), అరజ్గత్తమ్మా = ఓ శ్రీరంగేశా!, పళ్ళి యెళు న్దరుళాయే = నిద్ర లెమ్మా!

**వివ:** శ్రీరంగనాథా! మీకు సమర్పించుటకు సువాసనగల గరికయును, మేలైన శంఖాదినిధులతో దేవతలును, కపిలధేనువు, అద్దము మొదలగు సాధనములును సిద్ధపఱచుకొని మహర్షులును, నీకు మంగళ గీతములు పాడుటకు తుంబురునారదాదులును–వచ్చి నీ వాకిట కాచుకొని యున్నారు. వాడిమయూఖములు దాల్చిన వేవెలుగులదొర తూర్పున పొడిచి చూపఱ కన్నులు పొడుచుచున్నాడు. అంధకార మాకసమున పటాపంచలయినది. దేవరవారు మా యజ్ఞానాంధకారము ధ్వంసము చేయ నిదుర మేల్కొనుడు స్వామీ!

**9. *ఏదమిల్ తణ్ణుమై యెక్కమ్ మత్తళి**
**యాళ్కుళల్ ముళవ మోడిశై తిశై కెళుమి,**
**కీదజ్గళ్ పాడినర్ కిన్నరర్ కెరుడర్ గళ్**
**కన్ద రువరవర్ కఙ్గులు ళెల్లామ్,**
**మాదవర్ వానవర్ శారణ రియక్కర్**
**శిత్తరుమ్ మయజ్గినర్ తిరువడి త్తొళువాన్**
**ఆదలిలవర్క్కు నాళోలక్క మరుళ**
**అరజ్గత్తమ్మా! పళ్ళి యెళు న్దరుళాయే.**

**టీక:** ఏదమ్ + ఇల్ = దోషము లేని, తణ్ణుమై = మృదంగమును, ఎక్కమ్ = ఏకతంత్రీ వాద్యమును, మత్తళి = మర్దళమును, యాళ్ = వీణయును,

కుళల్ = (పిల్లన) గ్రోవియును, ముళవమ్ + ఓడు = (వీని) ధ్వనితో, ఇశై కెళుమి = స్వరముతో పాడదగిన, కిన్నరర్ = కిన్నరులును, కరుడర్‌గళ్ = గరుడులును, కన్దరువర్ = గంధర్వులును, ఇవర్ = (తక్కిన) వీరలు (వారలు)ను, కఙ్గులుళ్ + ఎల్లామ్ = రాత్రియంతయును, మాదవర్ = గొప్ప తపస్వులును, వానవర్ = దేవతలును, శారణర్ = చారణులును, ఇయక్కర్ = యక్షులును, శిత్తరుమ్ = సిద్ధులును, తిరువడి + తొళువాన్ = మీ శ్రీపాదారవిందసేవకై, మయఙ్గినర్ = త్వరతోనున్నారు, ఆదలిల్ = అందుచే, అవర్కు = వారికి, నాళ్ = ఈనాడు, ఓలక్కమ్ = ఓలగము (విశ్వరూపసేవ), అరుళ = సాయించుటకు, అరఙ్గత్తమ్మా = రంగరాజా! పళ్ళి యెళున్దరుళాయే = నిద్ర మేలుకొనుమా!

**వివ:** ఓ రంగా! మంచి మృదంగము, తాళములు, మద్దెల, వీణ, వేణువు మొదలగు వాద్యనాదముల కనుగుణముగ గానముచేయ సమర్థులైన యక్ష, కిన్నర, గరుడ, గంధర్వ, చారణ, సిద్ధాదులగు దేవతలును, తపోనిష్ఠులగు మహర్షివర్యులును దేవర పాదసేవకై నెట్టుకొనుచు నెట్టెట్టో నిలబడియున్నారు. కాన వారికి విశ్వరూపదర్శన మనుగ్రహింప త్వరలో జాగృతులు కందు.

**10. *కడిమల ర్కమలఙ్గళ్ మలర్న్దన వివైయో**
**కదిరవన్ కనైకడల్ ముళైత్తన నివనో,**
**తుడియిడైయార్ శురికుళల్ పిళిన్దుదఱి**
**త్తుగిలుడుత్తేఱినర్ శూళ్పున లరఙ్గా!**
**తొడైయొత్త తుళపము ఙ్గూడైయు మ్బొలిన్దు**
**తోన్ఱియతోళ్ తొణ్డరడిప్పొడి యెన్ను**
**మడియనై, యళియ నెన్ఱ రుళి యున్నడియా**
**ర్కాట్పడుత్తాయ్ పళ్ళి యెళున్దరుళాయే!**

**టీక:** పునల్ = కావేరిచే, శూళ్ = చుట్టబడియున్న, అరఙ్గా = శ్రీరంగమున (నివసించువాడా) కడి = పరిమళముగల, కమలమ్ మలర్ గళ్ = తామరపూవులు, మలర్న్దన = వికసించుచున్నవి, ఇవైయో = ఇదిగో, కదిరవన్ = (వాని మిత్రుడగు) సూర్యుడు, కనై = ఘోషించు (స్వభావముగల), కడల్ = సముద్రమున, ముళైత్తనన్ = ఉదయించెను, ఇవనో = ఇడుగో, తుడి = డమరుకమువలె నుండు, ఇడైయార్ = నడుముగల (స్త్రీలు), శురై = చుట్టుకొనియుండు (కురులు గల), కుళల్ = కొప్పులను, ఉడుత్తు = ధరించి, ఏఱినర్ = (గట్టు) ఎక్కినారు, ఒత్త = (మీరు ధరింప) దగిన, తుళపమ్ + తొడై = తిరుత్తుళాయి (తులసి) మాలికను, కూడైయువే = (గూడ) బుట్టను, తోళ్ = భుజములందు, పొలిన్దు = ఎత్తుకొని, తోన్ఱిన = తోటన (వచ్చిన), తొణ్డర్ + అడి + పొడి = భక్తుల పాదధూళి అను (పేరుగల) అడియనై = (మీపాద) దాసుని, అళియన్ + ఎన్ఱు = మిత్రుడని, అరుళి = కృపచేసి, ఉన్ + అడియార్క్కు = దేవరదాసభూతులకు, ఆళ్పడుత్తాయ్ = దాస్యము చేయించుకొనుటకు, పళ్ళి యెళున్దరుళాయే = పక్కనుండి లేచి కటాక్షింపుమా!

**వివ:** ఉభయకావేరీమధ్యమున శేషశాయివై శయనించుచున్న శ్రీరంగనాథా! పద్మములు వికసించినవి. ప్రొద్దుపొడిచినది. కృశమధ్యలగు నబలలు స్నానమాడి చీరలు పిండుకొనుచు తీర మారోహించు చున్నారు. దేవర ధరింపదగిన తులసిమాలలగూడను (గంప) భుజమున దాల్చి మీ సన్నిధికి వచ్చియున్నా డీతొండరడిప్పొడి యను దాసుడు. వీనియందు మిత్రభావముంచి దేవరదాసవర్గమునకు దాసునిగా చేయుటకు ప్రక్కనుండి లేచి కటాక్షింపుడీ!

**శ్లో॥ "మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన,**
**దోషో యద్యపి తస్య స్యాత్ సతామేతదగర్హితమ్."**

"నా స్నేహము కోరి నన్ను చేరినవారినెన్ని కష్టములు ఎదురయినను వదలిపెట్టను. వానికి లక్ష దోషములున్నను లెక్కపెట్టను."

– అని యభయమిచ్చినాడు గదా శ్రీరాముడు.

తొండరడిప్పొడి యాళ్వార్ తిరువడిగళే శరణమ్.

(తొండరడిప్పొడి యాళ్వారుల శ్రీపాదములే శరణము.)

– – – ⊙ – – –

## తిరునక్షత్ర తనియన్

**శ్లో॥ కోదణ్డే జ్యేష్ఠనక్షత్రే మండంగుడిపురోద్భవమ్,**
**చోళోర్వ్యాం వనమాలాంశం భక్తపద్రేణుమాశ్రయే.**

ధనుర్మాసమున జ్యేష్ఠానక్షత్రమున చోళదేశమున మండంగుడిలో వనమాలాంశమున జన్మించిన భక్తాంఘ్రిరేణుల నాశ్రయింతును.

## వాళిత్తిరునామమ్

**మణ్డఙ్గుడియతనై వాళ్‌విత్తాన్ వాళియే**
**మార్కళియి క్కేట్టైయతనిల్ వన్దువిత్తాన్ వాళియే**
**తెణ్డిరై శూళరఙ్గరైయే తెయ్‌వమెన్హాన్ వాళియే**
**తిరుమాలై యొన్బతఙ్జుమ్ శెప్పినాన్ వాళియే**
**పణ్డు తిరుప్పళ్ళి యెళుచ్చి పత్తురైత్తాన్ వాళియే**
**పావైయర్కళ్ కలవితనై పళిత్తశెల్వన్ వాళియే**
**తొణ్డుశెయ్‌దు తుళపత్తాల్ తులఙ్గినాన్ వాళియే**
**తొణ్డరడిప్పొడి యాళ్వార్ తుణైప్పదఙ్గళ్ వాళియే**

తన జన్మముచే మండంగుడిని వెలుగుతో నింపి సుఖింపజేసినవారికి మంగళము. మార్గశిరమాసమున జ్యేష్ఠానక్షత్రమున నవతరించినవారికి మంగళము. రంగనాథుడే దైవమన్నవారికి మంగళము. తిరుమాల కావ్యమును తొంబదియైదు పద్యములతో పల్కినవారికి మంగళము. తిరుప్పళ్ళి యెళుచ్చి పది పాశురములు పాడినవారికి మంగళము. స్త్రీలు మోహింపదగిన రూపసంపద గలవారికి మంగళము. అనన్యభక్తి చూపి భగవంతు నాకర్షించినవారికి మంగళము. తొండరడిప్పొడి యాళ్వారుల శ్రీపాదములకు మంగళము.

* * * * * * *

# తిరుప్పావు

## తనియన్లు

***కర్త:- శ్రీ పరాశరభట్టరు**

**1. శ్లో॥ నీళాతుఙ్గస్తనగిరితటీ సుప్తముద్బోధ్య కృష్ణమ్,
పారార్థ్యం స్వం శ్రుతిశతశిరస్సిద్ధమధ్యాపయన్తీ,
స్వోచ్ఛిష్టాయాం స్రజి నిగళితం యా బలాత్కృత్య భుఙ్క్తే,
గోదా తస్యై నమ ఇదమిదం భూయ ఏవాస్తు భూయః॥**

**టీక:** నీళా = నప్పిన్నైపిరాట్టియొక్క, తుఙ్గ = ఉన్నతములగు, స్తన = వక్షోజములనెడు, గిరి = పర్వతములయొక్క, తటీ = ప్రదేశమందు, సుప్తం = నిద్రించుచున్న, కృష్ణం = శ్రీకృష్ణుని, ఉద్బోధ్య = ప్రబోధించి (మేల్కొలిపి), శ్రుతిశతశిరస్సిద్ధం = ఉపనిషత్తులందు ప్రతిపాదింపబడిన, స్వ = తనయొక్క పారార్థ్యం = పారతంత్ర్యమును, అధ్యాపయంతీ = బోధించుచున్నదై, స్వ + ఉచ్ఛిష్టాయాం = తాను ముడిచి విడిచిన, స్రజి = పుష్పమాలికయందు, నిగళితం = కట్టబడిన ఆ శ్రియఃపతిని, బలాత్కృత్య = బలాత్కరించి, యా = ఏ గోదాదేవి, భుఙ్క్తే = అనుభవించు చున్నదో, తస్యై = ఆ మనతల్లికి, ఇదం + ఇదం = ఈ ఈ,నమః = నమస్కారములు, అస్తు = అగుగాక!, భూయ ఏవ = మఱియు, అస్తు = అగుగాక!!, భూయః = వెండియు, అస్తు = అగుగాక!!!

**వివ:** నందుడను గోపకుని పుత్రిక నీళాదేవి. ఈమెయే నప్పిన్న పిరాట్టి. ఆమె వక్షోజములు పర్వతములవలె రమ్యోన్నతములు. బహుకుటుంబికు

---

*ఈ కవి పరాశరభట్టార్యులు వారు. వీరు శ్రీ గుణరత్నకోశాది బహుగ్రంథకర్త. భగవద్రామానుజులవారి యంతేవాసి యగు కూరత్తాళ్వానుల పుత్రరత్నము వీరు.

డగువాడు పర్వతప్రాంతమును చేరి దానియందను సుఖజీవనము చేయునట్లు జగత్కుటుంబియగు సర్వేశ్వరుడు ఆ నీళాదేవి కుచగిరిసీమ నాక్రమించుకొని సుఖనిద్ర గూరియుండెను. ఆశ్రితరక్షణ చింతచే యోగనిద్రాముద్రితు డయి యున్న ఆ శ్రీకృష్ణుని చేరినారు మార్గశీర్ష ధనుర్మాసమున ఆండాళ్–గోదాదేవి! వివిధోపనిషత్ప్రతిపాదితమగు శేషత్వ పారతంత్ర్యములను ఈ తిరుప్పావు దివ్యప్రబంధముద్వారా విన్నవించుకొన్న దామె జగత్పతికి.

తాము ముడుచుకొని విడిచినట్టి పుష్పమాలికలతో ఆమె దామోదరుని బంధించినది. నిద్రావ్యాజమున నేత్రనిమీలనము చేసికొనియున్న యా పరమాత్ముని ప్రబోధించినది.

తన భర్తయొక్క కల్యాణగుణసంపదను స్వభుక్తసుగంధికుసుమ దామములతో ఆకర్షించి తాననుభవించుటమాత్రమేగాక తాను గూర్చిన ముప్పది పాశురముల (చక్కగ పాడదగిన పద్యముల) యీ సువర్ణమాలికను సుగంధమూలికగా చేసి తమ సర్వస్వమును ఆ గోవిందునకే సమర్పించుకొన్నది. ఈ పద్యమాలిక యాకారమున చిన్నదయ్యు వివిధ విశేషార్థసంపత్ప్రకారమున బహు దొడ్డది.

శ్రీకృష్ణముఖోద్గత మగు గీతాగంగకంటెగూడ శ్రీదేవి యపరావతారమైన శ్రీ గోదాముఖవినిస్సృత మగు నీ గ్రంథకావేరీప్రాశస్త్య మవాఙ్మానసగోచరము.

అవ్యాజకృపచే చేతనోద్ధరణకై యామె వదనకమలమునుండి వెలువడిన యీ కావ్యరత్నము మృదుమధురపదార్థగంభీరము; సహజశిల్పరమణీయము. నవపుష్పమాలికలతోపాటు నిత్యనూతన రసవిభాసి పద్యపుష్పమాలికలతో గూడ ఆ భక్తపరాధీనుని స్వాధీనము చేసికొన్న ఆముక్తమాల్యదాదేవి కివే మా నమస్సుమనోఽఞ్జలిమాలికలు!

* * * * * * *

### *కర్త:- శ్రీ ఉయ్యక్కొణ్డారు

**2. అన్న వయల్ పుదువై యాణ్డా ళరఙ్గఱ్కు,**
**పన్ను తిరుప్పావై ప్పల్‌పదియం- ఇన్నిశైయాల్,**
**పాడిక్కొదుత్తాళ్ నఱ్పామాలై పూమాలై,**
**శూడి క్కొదుత్తాళై చ్చొల్లు.**

**టీక:** అన్నమ్ = హంసలు (సంచరించు), వయల్ = చేలుగల, పుదువై = శ్రీ విల్లిపుత్తూరునందలి, ఆండాళ్ = గోదాదేవి, అరఙ్గఱ్కు = శ్రీరంగనాథుని విషయముగ, పన్ను = పరిశోధించి సాయించిన, పల్‌పదియం = అనేక పద్యములను (పాశురములను), ఇన్ = శ్రావ్యమైన, ఇశైయాల్ = రాగముతో, తిరుప్పావై = తిరుప్పావు అను దివ్య ప్రబంధమును కట్టి; నల్ + పామాలై-నల్ = విలక్షణమైన, పామాలై = పద్యమాలికగా, పాడి = గానము చేసి, కొదుత్తాళ్ = ప్రసాదించినట్టిదియును, పూమాలై = పూలమాలను, శూడి = తాను (ముందు) ధరించుకొని, కొడుత్తాళై = (పిదప వటపత్రశాయికి) సమర్పించినవారును అగు గోదాదేవిని, శొల్ = (నా మనమా భక్తితో) అనుసంధింపుమా.

**వివ:** ఈమె పల్కిన యీ దివ్యప్రబంధమున ఈ తల్లి తిరునామమే అనుసంధేయము. చిత్తమును వశపరచుకొన్న తర్వాతనే గదా ప్రపంచమున మన మే పనినైన సాధింపగలుగుట! కాన నీ కవిశేఖరులు తమ మనస్సునే సంబోధించి యిట్లు పలుకుచున్నారు:-

చిత్తమా! విల్లిపుత్తూరులో పద్మాకరము లసంఖ్యాకములు. వానిలో నీరక్షీరవివేకము గల హంసలు సదా సంచరించుచుండును. ఆ నగరమున

---

*ఈక్రింది పాశురములు రెండును ఈ మహాభక్త కవయిత్రిని గురించి ఉయ్యక్కొణ్డార్ (వాక్య గురపరంపరలోని పుండరీకాక్షులు) అనుభాగవత చూడామణి యానతిచ్చినవి.

నవతరించిన వారాండాళ్ తల్లి. “పాఠ్యే గేయే చ మధురం” (చదువుటకు, పాడుటకు గూడ గదు నింపైనది.) అనునట్లు ఇంపైన రాగతాళములతో కూర్చిన వాఙ్మాలిక గదా యీ తిరుప్పావు! ఇట్టి దీనిని శ్రావ్యముగా గానము చేసిన గోదాదేవిని గానము చేయుమా!

మనసా! ఈమె యెవ రనుకొన్నావు? తాను సిగలో దాల్చిన పుష్పదామమును శ్రీరంగని కర్పించి యా జగన్నాథుని యనుగ్రహసర్వస్వ మును దోచుకొన నోచుకొన్న ధన్య గదా యీ బాలిక!

ఈ పాశురమున హంసలు అను పదముచే చిదచిదీశ్వర వివేకవంతు లగు పరమహంసల కా పట్టణ మాటపట్టను ధ్వని గమ్యము. అట్టి పరమహంసియే గదా యీ కవయిత్రీ శిరోమణి!

ఈ తల్లికి గోదాదేవి; ఆముక్తమాల్యద; విష్ణుచిత్తాత్మజ – అని సంస్కృత నామములు. ఆండాళ్; చూడిక్కొడుత్తాళ్; కోదై – అని అరవమున పేర్లు.

తాను ధరించిన పుష్పమాలికలు రంగనాథునకు సమర్పించినందున యీమెను చూడిక్కొడుత్తాళ్ – ధరించిన పుష్పమాలికలు రంగనాథునకు సమర్పించినది – అనుపేరు రూఢమయినది. కాని యీ తల్లి పాడిక్కొడుత్తాళ్ – తాను కట్టిన పాటలు పాడి సమర్పించినది.

– కావుననే ప్రపన్నహృదయ పద్మములచే సర్వదా పూజలు గొనుచుండును. ఈమె భగవద్విషయకముగా గానము చేసిన ఈ శ్రీ గీతిమాలిక మనకు సర్వసమయములందును సదా శిరోధార్యము; నిత్యానుసంధేయము; ఉత్తారకము. కాన ఈ మాతను చూడిక్కొడుత్తాళ్‌గా మాత్రమేగాక పాడిక్కొడుత్తాళ్‌గా గూడ భాగవతోత్తములు సదా మననము చేసికొని ముక్తికాంతాకరగ్రహణ భాగ్యమందుదురు గాక!

* * * * * * *

**3. శూడి క్కొడుత్త శుడర్కొడియే తొల్పావై,**
**పాడి యరుళవల్ల పల్వళైయాయ్, నాడి నీ**
**"వేఙ్గడవ ఱ్ఱెన్నై విది" యెన్ఱ విమ్మాత్తమ్,**
**నా ఙ్గడవా వణ్ణమే నల్గు.**

**టీక:** శూడి = (పుష్పములు) దాల్చి, కొడుత్త = (రంగనాథునకు) సమర్పించిన, శుడర్ = ప్రకాశించు, కొడియే = (బంగారపు) తీగెను బోలిన గోదాదేవీ, తొల్ = ప్రాచీనమైన, పావై = తిరుప్పావు అను ప్రబంధమును, పాడి = గానము చేసి, అరుళవల్ల = కృపచేయదగినదానవై, పల్ = వివిధవర్ణ ములైన, వళై యాయ్ = కరభూషణములు దాల్చిన ఓ తల్లీ! నీ = నీవు, నాడి = (కామదేవుని) వినుతించి, నీ = (ఓ కామదేవా) నీవు, వేఙ్గడవర్కు = వేంకటాద్రీశ్వరునకు, ఎన్నై = నన్ను, విది = (భార్యగా) ఏర్పఱపుము, ఎన్న = అనిన, ఇమ్మాత్తమ్ = ఈ విధానమును, నామ్ = మాబోటివారము, కడవా = అతిక్రమించకుండు, వణ్ణవే = పద్ధతిని, నల్గు = అనుగ్రహింపుమా!

**వివ:** పాటలు కట్టి రంగనాథునకిచ్చిన ఓ మాతల్లీ! నీ సువర్ణ తనూలతను దర్శింపగనే మూర్ఖులమగు మా వాణికూడ సువర్ణవర్షమునే కురియును. నీ కరకంకణ సందర్శనముచే మా యజ్ఞానాంధకారము దూరమయి మాకు భగవదభిమానమును భాగవత కైంకర్యత్వరయు లభించును. ఇందు సందియమే లేదు.

సిగను దాల్చిన పూలమాలలు శ్రీరంగనాథున కర్పించిన సువర్ణ లతాంగీ, అనాదికాలముగా నార్తప్రపన్నులచే ననుష్ఠింపబడుచున్న యర్థ సంపదగల యీ తిరుప్పావును నీవు గానము చేసి మా కనుగ్రహించినావు. మేము నిన్నెంతని పొగడగలము; ఏమని భూషింపగలము! నీవు దాల్చిన కరకంకణదీప్తిచే మా యజ్ఞానాంధకారము దూరమయి తీరును. నీవు

"నాచ్చియార్ తిరుమొళి" లో కామదేవు నుద్దేశించి – "నన్ను వేంకటనాథున కర్ధాంగలక్ష్మిగా కూర్చి పుణ్యము కట్టుకొమ్మ" ని ప్రార్థించినావు గదా! నీ వనుష్ఠించిన అదే వ్రతము మేమిపుడు ప్రారంభించినాము. దానిని సాంగోపాంగముగా నెరవేర్ప ననుగ్రహించి మాబోటి సంసారపంకమగ్న చేతనుల నుద్ధరిం పుమా కొమ్మా!

* * * * * * *

**1. *మార్గళిత్తింగళ్ మది నిఱైన్ద నన్నాళాల్,**
**నీరాడ ప్పోదువీర్ పోదుమినో నేరిళైయీర్,**
**శీర్ మల్గు మాయ్ప్పాడి శెల్వచ్చిఱుమీర్గాళ్,**
**కూర్వే ల్కొడు న్దొళిలన్ నన్దగోపన్ కుమరన్,**
**ఏరార్ న్దకణ్ణి యశోదై యిళఞ్చిజ్గమ్,**
**కార్మేని చ్చెజ్గణ్ కదిర్ మదియమ్బోల్ ముగత్తాన్ ,**
**నారాయణనే నమక్కే పఱై తరువాన్,**
**పారోర్ పుగళ ప్పడి న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** మార్గళి = మార్గశిరమనునట్టి, తిజ్గళ్ = మాసమందు, మది = చంద్రుడు, నిఱైన్ద = వ్యాపించిన, నల్ + నాళ్ + ఆల్ = మంచి దినములందు, నేర్ = విలక్షణ (అంద) మైన, ఇళైయీర్ = ఆ భూషణములు దాల్చినవారై, శీర్ = ఐశ్వర్యముచే, మల్గుమ్ = సమృద్ధమైన, ఆయ్ప్పాడి = నందగోకులమందు, శెల్వమ్ + శిఱుమీఋగాళ్ = సంపదగల బాలికలారా! కూర్ = పదునైన, వేల్ = ఈ టెతో, కొడుమ్ + తొళిలన్ – కొడుమ్ = (శ్రీకృష్ణునకు కీడుచేయ వచ్చిన ప్రాణులతో) క్రూరముగా, తొళిలన్ = వ్యవహరించు వాడైన, నన్దగోపన్ = నందగోపాలునికి, కుమరన్ = కుమారుడై (యవతరించి) న వాడును, ఏర్ + ఆర్న్ద – ఏర్ = అందము, ఆర్న్ద =

చిందునట్టి, కణ్ణి = నేత్రసౌందర్యము గలదగు, అశోదై = యశోదాదేవికి, ఇళమ్ శింగమ్ = శింహకిశోరమైనవాడును, కార్ + మేని = నీలవర్ణుడును. శెమ్ + కణ్ = కెందామరలనుబోలు కన్నులు గలవాడును, కదిర్ + పోల్ = (ప్రతాప ప్రకాశములతో) సూర్యుని బోలినదియును, మదియమ్ + పోల్ = చంద్రునివలె (ఆహ్లాదకరమగునదియు నగు) ముగత్తాన్ = తిరుముఖమండలమును గల్గిన, నారాయణనే = సర్వేశ్వరుడగు శ్రీమన్నారాయణుడే, నమక్కే = (వాడే సర్వశరణ్యుడని నమ్మియుండు) మనకే, పఱై = మనము కోరిన ఫలమును (వ్రతాంగమగు తప్పెటను), తరువాన్ = (తప్పక) అనుగ్రహింపగలడు (కాన), పారోర్ = చూచువారు (లోకులు), పుగళ = పొగడునట్లు, పడిన్దు = ఈ వ్రతమున పాల్గొని, నీరాడ = స్నానమాడుటకు, పోదువీర్ = పోదలచినవారు; పోదుమినో = పోవుదము, ఏల్ = (నా బోధలోని మంచిచెడుగులను బాగుగ) యోచించుకొనుడు, ఓర్ (ఇది) సమ్మతమైనచో, ఎమ్ = మా యొక్క, పావాయ్ = నోమున (పాల్గొనుడు)

**<u>భగవదభిరుచి</u>** యను లఘువ్యాఖ్య :-

శ్రీ విల్లిపుత్తూరు పాండ్యనగరోర్వీ రత్నసీమంతము. అచట తులసీ వనమున నవతరించి జనకరాజర్షికి సీతాదేవివలెనే మహర్షి యగు తమ తండ్రికి పేదకు పెన్నిధి దొరికినట్లును, ఆడబోయిన తీర్థ మెదురై నట్లును ఆండాళమ్మ లభించినది. శ్రీ విష్ణుచిత్తకుల నందనకల్పవల్లి యగు నా తల్లి శుక్లపక్షచంద్రరేఖవలె నెదిగి పదునాఱవ వసంతమున పాదమూనినది. శ్రీ విల్లిపుత్తూరును గోకులముగను, వటపత్రశాయిని శ్రీకృష్ణునిగను, తన చెలికత్తెలను గోపకన్యలుగను భావించి తాను గోపికా తాదాత్మ్య మందినది. శ్రీకృష్ణ సంశ్లేషానందము (సమాగమ సుఖము) కోరి "మాసానాం మార్గశీర్షోఽహమ్" (మాసములలో మార్గశిరమాసము నేను) అని

గీతాకారుడు పేర్కొనిన సుప్రసిద్ధమైన ధనుర్మాసమున వ్రతమారంభించినది. "ఏకః స్వాదు న భుఞ్జీత" (రుచిగల పదార్థము నొంటరిగా ననుభవింపరాదు) అను నభియుక్తోక్తి ప్రకారము సమవయస్కలగు చెలిమికత్తెలను సంబోధించి ఆమె యిట్లు పలుకుచున్నది;–

"సకల సంపత్సమృద్ధ మగు నీ గోకులమున నిత్యనివాసము చేయువిలక్షణాభూషణాంచిత లగు నో బాలికలారా! గోపకులాగ్రణి యగు నందుడు తన ముద్దుబిడ్డయగు కన్నయ్య కెపుడేమి కీడు మూడునో యని తలచి యల్పప్రాణులను దండించుటకు గూడ చిన్నపామును పెద్దకఱ్ఱతో కొట్టుమన్నట్లు వాడియైన యీటెను ధరించి యుండును. అట్టివాని మురి పెంపు బాలుడు సుమీ శ్రీకృష్ణుడు. చెంపకు చేరెడేసి కన్నులతో చూపరుల మనస్సుల నాకర్షించు సౌందర్యముగల యశోదాదేవి కీత డఢ్డాల బిడ్డ. ఈ బాలుని లోచనద్వయము ప్రతాపప్రకాశములందు సూర్యుని, ఆహ్లాదమున చంద్రుని బోలునట్టిది. నీలఘనాభమూర్తియగు నీ స్వామి భక్తాభీష్ట వరప్రదుడు. నాడు కంసాది దుష్టరాక్షసుల రూపుమాపి యిలాభారము దూరము చేయ నవతరించిన శ్రీమన్నారాయణుడే, ప్రయోజనాంతర విముఖులమై తననే నమ్మి కొలుచుచున్న మనకు ఈప్సితార్థసిద్ధి కల్పింప సమర్థుడు. కాన నశేషభూజనాళియును కీర్తించునట్లు మా యీ మార్గళి వ్రతమున మీరందరును పాల్గొన రండు. మీ మీ సంసార తాపత్రయము చల్లారునట్లు చంద్రికాద్యుతులు వెల్లివిరియు నీ ధనుర్మాసమున – మీలో నిట్టి శుభదినములందు తీర్థమాడ నభిలాష గలవా రందరును మా యీ నోములో చేరి నిరతిశయబ్రహ్మానంద మనుభవింప రండు. త్వరపడుడు"

తమతో కలసి స్నానమాడ రమ్మని గోదాదేవి తోడి గోపికన్యలను పిలచుట సామాన్యమగు వాచ్యార్థము. కాని యిట వ్యంగ్యార్థము గూడ

గలదు. వియోగతాప మారునట్లు కృష్ణునితో తామనుభవింపబోవు సంయోగ సుఖమునే వీరు స్నాన మనుచున్నారు.

"ఏష బ్రహ్మ ప్రవిష్టోఽస్మి గ్రీష్మే శీత మివ హ్రదమ్" (మండు వేసవిని చల్లని మడుగున మునిగినట్లు ఇదిగో బ్రహ్మపదార్థమగ్నుడనైనాను. నేనెంత ధన్యాత్ముడను!) అను వాక్య మిందుకు ప్రమాణము. 'కార్మేని' నీలశరీరుడు అను పదములో నీ క్రింది యంతరార్థము మనసుకు తట్టును:-

**ఉ॥ "శ్రీయను మించుమిం చొలయ సేవకచాతక లోకమోద సం**
**ధాయకుఁడై యుదారకరుణారసవృష్టి దురాపతాపముల్**
**వాయఁగ జేయుచున్ సకల వాంఛిత సస్యము లుల్లసిల్లఁగాఁ**
**జేయుచు వేంకటాద్రి నివసించు ఘనుండిడు మాకు భద్రముల్.**

– చిన్నయసూరి

నిజమే. నీలమేఘవ్యాప్తి చేతనేగదా రసనిష్యందమును, తద్వారా సస్యాది ఫలప్రాప్తియును.

ఈ కావ్యరత్నఖని యందు త్రవ్వినకొలది యిట్టి విశేషార్థము లసంఖ్యాకములై ఘనముగా గోచరించి భాగవతోత్తములకు నిరతిశయా నందసంధాయకము లగుచుండును. కాని యీ లఘువ్యాఖ్య యధికారాను గుణముగ భగవద్విషయమం దభిరుచి కల్గించుటకుమాత్రమే యుద్దిష్టము. విశిష్టాద్వైత సిద్ధాంతముతో పరిచయము కల్గించుకొనదలచినవారికి మాత్రమిది యుపకరించును. తత్సంప్రదాయ పరిజ్ఞాన మితోధికముగా వాంఛించువారు మువ్వాయిరప్పడి మొదలగు ద్రావిడ (అరవ) వ్యాఖ్యలను ఇతర సంస్కృతాంధ్ర వ్యాఖ్యలను కాలక్షేపమునకై యుపయోగించుకొని సంసారార్ణవము తరింప యత్నింప నగును. ఈ వ్యాఖ్యలో నెన్నిన భగవద్గుణవిశేషము లన్నియు భగవద్భాగవతాచార్య వాగుచ్ఛిష్టములయి

నందున శిష్టరుచి పరిగృహీతములు. వాచ్యార్థము వివరించి కొన్ని వ్యంగ్యార్థములు మాత్రమటనట నిందు స్పృశించి వదలుట బుద్ధిమంతులకు దృగ్గోచరమగును.

**2. వైయత్తువాళ్వీర్గాళ్ నాముమ్ నమ్పావైక్కు,**
**చ్చెయ్యుమ్ కిరిశైగళ్ కేళీరో, పాఱ్కడలుళ్**
**పైయ త్తుయిన్ఱ పరమనడి పాడి,**
**నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్ నాట్కాలే నీరాడి,**
**మైయి ట్టెళుదోమ్ మలరిట్టు నామ్ ముడియోమ్,**
**శెయ్యాదన శెయ్యోమ్ తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్,**
**ఐయముమ్ పిచ్చైయు మాన్దనై యుమ్కైకాట్టి,**
**ఉయ్యుమా ఱెణ్ణి యుగ న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** వైయత్తు = లోకమందు, వాళ్వీర్గాళ్ = ఉజ్జీవింపగోరు గోపకన్యలారా, నాముమ్ = మేము, ఉయ్యుమ్ = ఉజ్జీవించు, ఆఱు = విధానము, ఎణ్ణి = గుర్తించి, నమ్ + పావైక్కు = మా వ్రత పరిపూర్తికై, శెయ్యుమ్ = (అంగముగా) ఆచరించు, కిరిశైగళ్ = పనులు, ఉగన్దు = సంతోషముతో, కేళీరో = (శ్రద్ధగ) నాలకింపుడీ, నాళ్ + కాలే = ప్రభాతమున, నీర్ + ఆడి = స్నానమాడి, పాల్ + కడల్ + ఉళ్ = పాలకడలిలో, పైయల్ = అవధానముతో, తుయిన్ఱ = యోగనిద్రపోవునట్టి, పరమన్ = పరమపురుషుని (శ్రీమన్నారాయణుని), అడి = శ్రీపాద (వైభవ) మును, పాడి = గానము చేసి, ఐయముమ్ = (పెద్దలకు చేయు) కైంకర్యమును, పిచ్చైయుమ్ = (బీదలకిడు) బిచ్చమును, ఆన్దనైయుమ్ = శక్తికొలది, కైకాట్టి = చేతులార సమర్పించుకొని, నెయ్ + ఉణ్ణోమ్ = నేతిని భుజింపము, పాల్ ఉణ్ణోమ్ = పాలు త్రాగము, మైయిట్టు = కాటుకతో, ఎళుదోమ్ = (కండ్లను)

అలంకరించుకొనము, మలర్ + ఇట్టు = కుసుమములను, నామ్ = మేము, ముడియోమ్ = (సిగలో) తురుముకొనము, శెయ్యోదన = (పెద్దలు) చేయని పనులను, శెయ్యోమ్ = చేయము, తీ + కుఱళై = అసత్యవార్తలను, శెన్టు = (ఇతరులవద్దకు) వెళ్ళి, ఓదోమ్ = వచింపము.

**వ్యాఖ్య:** పుడమిపై సుఖానుభవములు దోచుకొనుటకు జన్మించిన సౌభాగ్యవతులగు నో గోపకన్యలారా! ఈ వ్రతానుష్ఠాన సమయమున మా యాచరణమును చెవియొగ్గి యాలింపుడు. ఉషఃకాలమున లేచి మేమందరము కలసికొని గొంతెత్తి గోవిందనామస్మరణము చేసి కొనుచు పోయి స్నాన మాచరింతుము. పాలకడలిలో శేషతల్పమున యోగ నిద్రాముద్రితుడై సదా భక్తరక్షణ చింతానిమగ్నుడైయున్న పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుని శ్రీపాదయుగమును మాత్రమే తలచుకొందుము. భగవన్నామస్మరణతోనే మా కడుపులు నిండిపోవును. పాలు, నేయి, వెన్న మొదలగువానితో చేసిన మధుర పక్వాన్నములు సైతము మాకు వెగటగును. ఈ మాసమున మాకు కాటుకయు, పుష్పాలంకరణమును నిషిద్ధము. పెద్దలు చేయని పనులు చేయము. అసత్య భాషణములు దరి జేరనీయము. పెద్దలకు ఘనముగా కైంకర్యము చేయుటయు, యాచకులకు శక్తికొలది దానము చేయుటయు మా విధిగా భావింతుము. మనుష్యజన్మ మెత్తినందుకు పైన మేము చెప్పినట్లు నడచుకొనుటయే యందరకు నిహపరసాధనము సుడీ!

శ్రీకృష్ణుని సంశ్లేషమును మాత్రమే కోరి వ్రతము చేయుచున్న గోదాదేవి పాల్కడలిలో పరుండినవానిని కీర్తించుట యేమి? ఇది యెట్లు పొసగును అని శంక కలుగవచ్చును. ఇందు కీ శ్లోకము సమాధానము:-

**"శ్లో॥ ఏష నారాయణః శ్రీమాన్ క్షీరార్ణవనికేతనః,**
**నాగపర్యఙ్కముత్సృజ్య హ్యాగతో మధురాంపురీమ్."**

పరమపదమున నున్నచో తనకు బహుదూరమైనందున భూలోకవాసులగు భక్తుల మొఱలు వినబడవని తలచి స్వామి క్షీరసాగరమునకు తరలి వచ్చినాడు. అదిగూడ దూరమేయని ఆయనకు తోచి భూలోకమునకు నడిబొడ్డయిన మధురాపురిలో పీఠము పెట్టి కూర్చొనినాడు. ఈ శ్రీకృష్ణునే శ్రీమన్నారాయణునిగా భావించిన గోపికల దృఢాధ్యవసాయ మధురిమ స్పృహణీయము గదా!

తిరువాయ్ మొళిలో నమ్మాళ్వారులు నాయికయై మైమఱచి శ్రీకృష్ణునిగూర్చి పాడిన యీ పాటయొక్క భావము ఇప్పట్టున స్మృతిపథమున మెఱసి ఒడలు పులకరించి మన యెదలు జలదరింపక మానునే!

**"మ॥ తన సాపాటును మంచి తీర్థ మటుపై తాంబూలమున్ కృష్ణుఁడే**
**యనుచున్ గన్గవ నీరుగార్చు చిలలో నా దేవు శీలంబు నా**
**తని చెల్వొప్పఁగ నూరి పేరడుగుచున్ దాఁజొచ్చెఁ దన్వంగి దూ**
**కొని యే దివ్యపురంబొ? యయ్యది తిరుక్కోళూరెయై తీరెడిన్!**

**3. ఓఙ్గి యులగళన్ద వుత్తమన్ పేర్పాడి,**
**నాఙ్గళ్ నమ్బావైక్కు చ్చాత్తినీరాడినాల్**
**తీఙ్గిన్ఱి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారి పెయ్దు,**
**ఓఙ్గు పెరు శ్చెన్నె లూడుకయ లుగళ,**
**ప్పూఙ్గువళై ప్పోదిల్ పొఱివణ్డు కణ్బడుప్ప,**
**తేఙ్గాదే పుక్కిరున్దు శీర్తములై పత్తి**
**వాఙ్గ, క్కుడమ్ నిఱైక్కుమ్ వళ్ళల్ పెరుమ్బశుక్కళ్,**
**నీఙ్గాద శెల్వమ్ నిఱై న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** ఓఙ్గి = ఊర్ధ్వలోక పర్యంతము పెరిగి, ఉలగు = లోకమును, అళన్ద = కొలిచిన, ఉత్తమన్ = పురుషోత్తమునియొక్క, పేర్ = తిరునామములను,

నాజ్ఞళ్ = (ఆ స్వామిపేర్లు పల్కనిచో నుండలేని) మేము, పాడి = గానము చేసి, నమ్పావైక్కు = మా యొక్కనోమునకు, శాత్తి = ఏకమై, నీర్ + ఆడినాల్ = స్నానము చేసినచో, నాడు + ఎల్లామ్ = దేశమంతటను, తీజ్గు = (వ్యాధి దుర్భిక్షాదులగు) చెడుగులు, ఇన్ఱి = లేక, తిజ్గళ్ = ప్రతిమాసమునను, ముమ్మారి = మూడుమార్లు, పెయ్దు = వర్షించి (అందుచేత), ఓజ్గు = (పైకి) పెరిగి, పెరుమ్ + శెమ్ + నెల్= అత్యున్నతములగు, ఎఱ్ఱని, సస్యములయొక్క, ఊడు = నడుమ, కయల్ = కయల్ అను మత్స్యములు, ఉకళ = త్రుళ్ళిపడుచుండగా, పూమ్ + కువళై + పోదిల్ = చక్కని కలువపూవులందు, పొఱివణ్డు = మదించిన తుమ్మెదలు, కణ్పడుప్ప = నిద్రింపగా, పుక్కు = (పశువులసాలలో) ప్రవేశించి, తేజ్గాదే = చలింపక, ఇరున్దు = (కుదురుగ) నుండి, శీర్త్త = (ఆవుల) బలసిన, ములై = పొదుగులను, వత్తి = (రెండు చేతులతో) పట్టి, వాజ్గ = పిండగా, వళ్ళల్ = ఔదార్యముతో, పెరుమ్ = పెంపొందిన, పశుక్కళ్ = గోవులు, నీజ్గాత = ఎడతెగని, శెల్వమ్ = సంపద, నిఱైన్దు = పూర్ణమగునట్లు, కుడమ్ = (పాలతో) కుండలను, నిఱైక్కుమ్ = నింపును.

**వ్యాఖ్య:** సత్యసంధుడు, మహాదాతయునైన ఒలిచక్రవర్తి వామనుని కోర్కె తీర్చుటకు మూడడుగుల పుడమిని దానము చేసి కపటవటువు హస్తమున నీరు వదలినాడు. వెంటనే విజృంభించి త్రివిక్రమావతారము దాల్చి జగములను కొల్చినా డా పురుషోత్తముడు. అతని తిరునామములు పాడుకొనుచు వ్రతమను వ్యాజముతో మనము జలకమాడినచో దేశమునకు పట్టిన క్షామము వదలి నెల మూడువానలు నిండుగా గురిసి లోకక్షేమము కలుగును. మిన్నందునట్లు పెరిగిన వరిపైరులనడుమ పెద్దచేప లెగిరెగిరి పడుచుండును. వికసించిన కలువపూవులందు తుమ్మెదలు నిద్రించు చుండును. క్షీరసమృద్ధిగల పెద్ద పెద్ద గోవులయొక్క బలసియుండు పొదుగులను పట్టి పిండగా పాలతో భాండములు నిండిపోవు చుండును.

ఉషఃకాలమున ఈ త్రివిక్రమావతారమును పేర్కొన్న మాత్రముననే దేశము సుభిక్షమై యిట్టి సిరిసంపదలతో నిత్యకల్యాణము పచ్చతోరణముగా వర్ధిల్లును.

భగవంతు డెన్ని యవతారము లెత్తియు కుక్కతోకవలె వంకరయగు మానవులబుద్ధిని చక్కదిద్ద జాలడయ్యెను. ఇక లాభములేదని ఆయన యాచార్యావతారము దాల్చెను.

**"శ్లో॥ ఆచార్య స్స హరిః సాక్షాత్ చరరూపీ న సంశయః,**
**మగ్నానుద్ధరతే జంతూన్ కారుణ్యాత్ శాస్త్రపాణినా."**

అర్చావతార మెత్తిన హరి యచరరూపి. ఈ ఆచార్యుడు చరరూపి. ఈతడు సాక్షాత్తుగ హరియే. కాననే యీ నరహరి శిష్యుల పాపములను హరించి నిర్హేతుక దయకు వశీభూతుడై శాస్త్రమను పాణితో సంసార పంకమున చిక్కుకొన్న బద్ధచేతనుల నుద్ధరించును.

"స్వయం తీర్ణః పరాం స్తారయతి" అను నాభాణక మాచార్యున కొక్కనికిమాత్రమే యన్వయించును. సత్కర్మానుష్ఠానముచే తాను తరించి యితరుల తరింపచేయువాడు గదా సదాచార్యుడు! తా నచ్యుతుని స్వరూపమేయయ్యు నాచార్యుడు తన చరణములను గాక సహస్రమూర్తి యును, సహస్రపాదాక్షి శిరోరుబాహుడును, సహస్రనాముడును, శాశ్వతుడును నగు నా యనంతు నొక్కనినే కొల్చి తరింపుడని లోకమున కుపదేశించును.

**శ్లో॥ నమోఽ స్త్వనంతాయ సహస్రమూర్తయే**
**సహస్రపాదాక్షి శిరోరుబాహవే,**
**సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే**
**సహస్రకోటీయుగధారిణే నమః**

– అన్నారు గదా!

ఈ శ్లోకమున చెప్పబడిన శ్రీమహావిష్ణువువలెనే ఆచార్యుడును విష్ణుపదము వరకును విష్ణుపదమువలెనే పెరిగి ఆ పురుషోత్తముని గుణగానము చేయుచు తన్మహిమలతోపాటు వ్యంగ్యముగా తన మహిమలు గూడ ప్రకటించుచుండును.

**"పా॥ పొలిగ పొలిగ పొలిగ పోయిత్తు వల్లుయిర్ చాపమ్**
**నలియుమ్ నరకముం నైన్దు నమను క్కిఙ్గు యాదొన్ను మిల్లై,**
**కలియుం కెడుం కణ్డు కొణ్మిన్ కడల్వణ్ణన్ పూదఙ్గళ్ మణ్మేల్**
**మలియప్పుగున్దిశై పాడి యాడి యుళితర క్కణ్డోమ్."**

ఆహాహా! ఏమి సమృద్ధి, ఏమి సమృద్ధి, ఏమి సమృద్ధి! ఈ లోకమున మహాపాపములన్నియు నిర్మూలమయినవి. ఇక యముని కీ లోకమున పనియే లేదు. కలికాలము పూర్తిగ రూపు మాసినది. శ్రీ మహావిష్ణువుయొక్క ఆంతరంగికభక్తు లీ విశాలోర్వీమీద విచ్చలవిడిగ సంచరించుచుండుట కన్నులార గాంచిన మేమెంత ధన్యాత్ములము!

అను ఈపాశురార్థ మాచార్యవైభవప్రకాశన ప్రయోజనమే యనుటలో సందియము లేదు. కృష్ణతృష్ణాతత్త్వమే మూర్తీభవించి యుదయించిన వకుళభూషణ భాస్కరునివలెనే యాచార్యుడైన నరహరి గూడ సద్గ్రంథ రచనచేసి బోధగురువై శిష్యుల యజ్ఞానాంధకారము పటాపంచలు చేయును.

**"ఓఙ్గి యుల గళన్ద ఉత్తమన్ పేర్ పాడి"**

అను వాక్యార్థమున నిమిడియున్న మహార్థము వివరింపవలెనన్న ప్రత్యేకముగా నొక గ్రంథమే యగును. కాని పరిమితావకాశములుగల మన కిప్పట్టున నది యసాధ్యము గదా!

ఈ పాశురమున త్రివిక్రమునితో పాటు శ్రీ శఠకోపమహర్షియు ప్రకృతాచార్యుడును తలపునకు రాకమానరు!

**"శ్లో॥ లక్ష్మీనాథసమారమ్భాం నాథయామునమధ్యమామ్,**
**అస్మదాచార్యపర్యన్తాం వన్దే గురుపరంపరామ్"**

శ్రియఃపతితో ప్రారంభమై నాథయామునరామానుజ త్రయీమణిని నడుమగల్గి యస్మదాచార్యపర్యంతమైన గురుపరంపరకు సాష్టాంగముగ నమస్కరించి – పాఠక భాగవతోత్తములారా, ఇక ముందుకు సాగుదమా మఱి! "*Time is precious of all things*" (కాలమన్ని వస్తువుల కంటె నమూల్య మయినది గదా మఱి!)

ఆహా! ఇట్టి భక్తశిరోమణుల కవతారభూమియగు నీ దక్షిణదేశమున జన్మించిన మనమెంత ధన్యాత్ములము!! కాని జన్మించుటతో గాక వారి బోధలు మనసున పట్టించుకొని యాచరణలోనికి తెచ్చినపుడు మాత్రమే మనము మానవశబ్దవాచ్యులము కాగలుగుట సుడీ!!!

**4. ఆళిమళైక్కణ్ణా వొన్ఱు నీ కైకరవేల్,**
**ఆళియు ట్పుక్కు ముగన్దు కొడార్త్తేఱి,**
**ఊళిముదల్వ నురువమ్పోల్ మెయ్ కఱుత్తు,**
**ప్పాళి యన్దోళుడై ప్పఱ్పనాబన్ కైయిల్,**
**ఆళిపోల్ మిన్ని వలమ్బురిపోల్ నిన్ఱదిర్న్దు,**
**తాళాదేశార్ఙ్గ ముదైత్త శరమళై పోల్,**
**వాళ వులగినిల్ ప్పెయ్దిడాయ్ నాఙ్గళుమ్,**
**మార్గళి నీరాడ మగిళ్ న్దేలో రెమ్పావాయ్.**

**టీక:** ఆళి = గంభీరమైన, మళైక్కణ్ణా = వర్షనిర్వాహకుడవగు మేఘుడా! నీ = నీవు, ఒన్ఱుమ్ = ఒకటియును (కొంచెముకూడ), కైకరవేల్ = చేతిలో మిగిల్చికొనకుండ (ఉదారబుద్ధితో) ఆళియుళ్ = సముద్రమధ్యమున, పుక్కు = ప్రవేశించి, ముగన్దుకొడు = నీటిని త్రావి, ఆర్త్తు = శబ్దించి, ఏఱి =

(ఆకసమున) నెక్కి, ఊళి = సర్వపదార్థములకును, ముదల్వన్ = మూలకారణు (డైన సర్వేశ్వరు) ని యొక్క, ఉరువమ్‌పోల్ = రూపమువలె, మెయ్ = శరీరమును, కఱుత్తు = శ్యామ (సుందర) ముగా చేసికొని, పాళి = బలిష్ఠమై, అమ్ = సుందరమైన, తోళ్‌ఉడై = భుజములుగల, పఱ్బనాబన్ = పద్మనాభుని, కైయిల్ = శ్రీహస్తమునందు, ఆళిపోల్ = సుదర్శనచక్రమువలె, మిన్ని = మెఱసి, వలమ్‌పురిపోల్ = (దక్షిణావర్తజాతికి చెందిన) వలమురి (పాంచజన్యశంఖము) వలె, నిన్ఱు = పెద్ద ధ్వనితో, ఉదిర్‌న్దు = మ్రోగి, శార్ఙమ్ = శార్ఙమను కోదండమునుండి, ఉదైత్త = కురిసిన, శరమళైపోల్ = శరవర్షమువలె, ఉలకినిల్ = లోకములోనివారు, వాళ = సుఖించునట్లును, నాజ్గళుమ్ = (కృష్ణ సంశ్లేమునకై స్నానమాడు) మేము, మగిళ్‌న్దు = సంతోషించి, మార్గళి = ఈ ధనుర్మాసమున (వ్రతాంగముగ), నీరాడ = స్నానమాడుటకును, తాళాదే = ఆలసింపక, పెయ్ దిడాయ్ = వర్షింపుమా!

**వ్యాఖ్య:** లోకుల సుఖజీవనమున కుపకరించు నో మేఘదేవుడా! "జలదంబు నీట సస్యములకు తృప్తిఁజేసి యవి సమ్మతి గోరకయున్న మాడ్కి" అను సామెత సుప్రసిద్ధము గదా! విశ్వ విశ్రుతమగు నిట్టి ఔదార్యమునకు అధినాథుడవగు నీవు మా యీ వ్రతమున కనుకూలించునట్లు కుంభవృష్టితో, వాపీకూప తటాకాదులను నింపి సర్వ ప్రాణికోటికిని జీవనదానము చేయుమా! నీవు సముద్రము జొచ్చి జలము గ్రహించి, భూనభోంతరాళములు బ్రద్దలగునట్లు గర్జించి ఆకసమున కెగసి కాలాది సకల చేతనాచేతన పదార్థములకును మూలమైన శ్యామసుందరుని దేహమువలెనే నీ దేహమునుగూడ నీలవర్ణమును చేసికొనుము. పద్మనాభుడైన ఆ సుందరబాహుస్వామి యొక్క కుడిచేతిలోని పాంచజన్యశంఖము వలెనే మిన్నున మెఱయుము. తర్వాత ధనుర్మాసవ్రతమున మేము సంతోషముతో పాల్గొని స్నానమాడుటకు వీలుగ ఆ దేవుని శ్రీహస్తమందలి

శార్ఙ్గవిముక్తశరముల వలెనే నీవుగూడ పుడమిపై శరవర్షము కురియుము”
అని గోదాదేవి తన చెలికత్తెలతో కలసి పర్జన్యదేవుని ప్రార్థించుచున్నది.

ఈ కావ్యమాలలోని పద్యరత్నములను పాశురము లందురని ముందే పేర్కొంటిమి గదా! ఇవి శ్రవణ సుభగస్వరముతో గానము చేయదగి యుండును. ఈ ముప్పది పద్యములు ముప్పది పాటలే. ఈ పద్యము వానపాట. ఇది భగవదనుగ్రహమును రస (స్నాన) రూపమున ననుభ వించుటకు చూడిక్కొడుతమ్మ సఖులతో గలసి వర్షాధిపతియగు వరుణ దేవునిగూర్చి పాడిన పాట. ఇది బాహ్యార్థము. భగవదనుగ్రహమును ఆచార్యద్వారమున ననుగ్రహింపుమని ఆ శ్రీకృష్ణుని గోపికలు వేడుటే అంతరార్థము. అ తల్లి లోకజీవనార్థము సామాన్య రస (జల) మును – భగవదేకశరణ్యలగు తమబోటి కన్యకాలోకోజ్జీవనార్థము విశేషరసమును (భగవద్భక్తిని) – సహజోదారబుద్ధితో ననుగ్రహింపు మని ప్రార్థించుచున్నారు.

ఆ భగవత్కృపామృత వర్షము సదాచార్య పరంపరాద్వారముననే తప్ప వేరొకరీతిగా మనకు లభింపదు. పరమపద విరాజమానుడగు ఆ పరమపురుషుని దర్శించుటకు గురుపరంపర సోపానపరంపరవంటిది గదా!

శ్రీకృష్ణుని కరుణారస మాచార్యనాళిక (తూము) గుండ దిగివచ్చి తమను తప్పక యుజ్జీవింపజేయగల దను నీ ముగ్ధగోపికల మహావిశ్వాస మీ పాటలో మనకు ప్రతిధ్వనించుట లేదా?

ఆచార్యపరంపరను మధురముగా నిర్దేశించిన ఈ పద్యము మనకు సదా మననీయము గదా!

**“సీ. శ్రీసఖిజలధి సుస్థిరకృపాసలిలంబు**
**గ్రోలి శతారాతి కాలఘనము**

నాథమునీంద్రుడ న్నగముపై వర్షింప
  నది రామపుండరీకాక్షు లనెడు
ఝరముల యామునాచార్యమహానదిం
  బూరించి పొరలి యిభ్భువి యతీంద్ర
పద్మాకరేంద్రంబుఁ బరిపూర్ణమొనరింప,
  దేశికాభ్రమములు దిశలయందుఁ

ప్రాణి సస్యంబులన్నియుఁ బసిమి మీఱ
జాలఁ బ్రవహించుచున్నవి సరసులార!
నమ్మయాళ్వారి నెమ్మది నమ్ముఁ డనుచు
వాదిభీకరగురుఁడనె మోదమలర"

5. మాయనై మన్ను వడమదురై మైన్దనై,
తూయ పెరునీర్ యమునైత్తుఱైవనై,
ఆయర్ కులత్తినిల్ తోన్ఱుమ్ మణివిళక్కై
త్తాయై క్కుడల్ విళక్కఞ్జెయ్దదామోదరనై
త్తూయో మాయ్ వన్దు నామ్ తూమలర్ తూవిత్తొళుదు,
వాయినా ల్పాడి మనత్తినా ల్చిన్దిక్క,
పోయ పిళైయుమ్ పుగుదరువా నిన్ఱనవుమ్,
తీయినిల్ తూశాగుమ్ శెప్పే లోరెమ్బావాయ్.

**టీక:** మాయనై = ఆశ్చర్యగుణచేష్టలు గలిగినవాడును, మన్ను = భగవత్సంబంధము వదలని, వడమదురై = ఉత్తరమధురానగరికి, మైన్దనై = ప్రభువయినవాడును, తూయ = పరిశుద్ధమై, పెరు = పెద్ద లోతయిన, నీర్ = జలసమృద్ధిగల, యమునై + తుఱైవనై = యమునాతీరవాసియును, ఆయర్కులత్తినిల్ = గోపకులమునకు, తోన్ఱుమ్ = ప్రకాశించెదు, మణివిళక్కై

= మంగళదీపమును బోలినవాడును, తాయై + కుడల్ = తల్లి (యశోద) యొక్క కడుపును, విళక్కమ్ + శెయ్‌ద = ప్రకాశింపజేసిన, దామోదరనై = ముళ్ళుగల కన్నెత్రాటిచే కట్టబడిన పొట్ట గలవాడును అగు కృష్ణుని, నామ్ = మనము, తూయోమ్ + ఆయ్ = పరిశుద్ధులమై, వన్దు = ఆతని సమీపించి, తూ = నిర్మలమయిన, మలర్ = పుష్పములను, తూవి = క్రమముతప్పియైనను సమర్పించి, తొళుదు = అంజలిచేసి, వాయినాల్ = నోరార, పాడి = గానముచేసి, మనత్తినాల్ = మనస్ఫూర్తిగా, శిన్దిక్క = చింతింపగా, పోయ = పూర్వము (చేసిన), పిళైయుమ్ = పాప పటలియును, పుగుదరువా నిన్ఱనవుమ్ = భవిష్యత్తున పైబడబోవు పాతకములును, తీయినిల్ = నిప్పులోపడిన, తూశు = దూదివలెనే, ఆగుమ్ = అగును, (కాన) ఏల్ = ఓ చెలులారా! ఓర్ = విమర్శించి, శెప్పు = (సర్వేశ్వరుని తిరునామములు) చెప్పుడు. (అనుసంధింపుడు.)

**వ్యాఖ్య:** శ్రీమన్నారాయణుడే గోకులమున శ్రీకృష్ణుడుగా నవతరించె ననుట పిష్టపేషణము గదా! ఆతడాశ్చర్య గుణచేష్టితుడు, అనాదిగా భగవత్సంబంధము గల్గియుండు నుత్తరమధుర కాతడు ప్రభువు. పరిశుద్ధ మధురజలములకు నెలవగు యమునానదీ తీరవాసి యా యయ్య. గోపకులమునకు రత్నదీప మా మాయాకిశోరుడు. ఆతని దుడుకు చేష్టలకు పడలేక కోపముతో ఆ పసిబాలుని బంధింపదలచిన దా యమాయిక యశోద. వెంటనే ముడులుగల త్రాటిచే కట్టబడినవాడాయె నా మాతృవత్సలుడు. ఆ త్రాటి యొరపిడికి పొట్ట యొరసికొనిపోయి గాయమై కొంతకాలమునకు అచ్చట మచ్చ పడినది. కౌస్తుభమువలెనే యదిగూడ నా బుడుతనికి లాంఛనమే యయినది.

సుగంధి సుమములతో క్రమము తప్పి పూజించినను. ఆ భక్తాభీష్ట వరప్రదుడు కించపడడు. శిరసున నంజలి యిడి నోరార నాతని వివిధ

నామములతో పాడి మనఃపూర్వకముగా ధ్యానించినచో మన సంచితాగామి కర్మలన్నియును అగ్నిజ్వాలలలో పడిన దూదిపింజెల వలెనే భస్మమయితీరును. కనుక నో బాలికలారా! రండి, మనమందరమేకమై భగవన్నామసహస్రమును గొంతెత్తి కీర్తించి జన్మసార్థక్యము చేసుకొందము.

వాచామగోచరమైనది గదా యా యుత్తర మథురాధినాథుని విభవాతిశయము! అట్టిదానిని తమ స్వభావశిల్పరమణీయమును ముగ్ధ మధురమునునగు భాషతో నిబద్ధముచేసిన కీర్తి యెవరికి దక్కినదో యెఱుగుదురా! ఆ ఘనత భగవదనుభవ పరీవాహరూప మయిద్రావిడవేద సాగరోద్భూత మహారత్నమని పేరుగన్న సహస్రగీతి (తిరువాయ్ మొళి) నిర్మించిన మహర్షి శఠకోపయోగిది!

వడమదురైమైన్దనై ఉత్తరమథురానాథుని అనుదానిని వారెట్లు వివరించిరో తిలకించి యానంద పులకితుల మగుదము రండు ---

**మ॥ హరికంటెన్ బరమై శరణ్యమిఁక లేదంచున్ నిరూపింప భూ**
**భరమున్ మాన్పఁగ నుత్తరంపు మథురన్ బ్రాపించి తాఁబుట్టె మీ**
**సిరి-కృష్ణార్పణమస్త టంచుఁగని యుజ్జీవింపుఁడీ సందియం**
**బొరయన్ బోకుఁడి వాని యర్థములె కావో యన్ని? లేవన్యముల్.**

కప్పవలె బెకబెకలాడినను మోక్షము తప్పదని పరమ భాగవతోత్తముడై భద్రాచలరామదాసని బిరుదము నందిన కంచెర్ల గోపనార్యుడు పలికిన యీ పద్యమెంత హృద్యము -

**ఉ॥ రామహరే, కకుత్థ్సకులరామహరే! రఘురామరామ శ్రీ**
**రామ, హరే, యటంచు మది రంజిల భేకగళంబు లీల నీ**
**నామము సంస్మరించిన జనంబు భవం బెడబాసి త్వత్పరం**
**ధామనివాసు లౌదురట! దాశరథీ! కరుణాపయోనిధీ!!**

వాయినాల్ పాడి (నోటితోపాడి) అనుటకిది యుపష్టంభకము గదా!

**6. పుళ్ళుమ్ శిలుమ్బినగాణ్ పుళ్ళరైయన్ కోయిల్**
**వెళ్ళై విళి శఙ్గిన్ పేరరవ ఙ్కేట్టిలైయో!**
**పిళ్ళా యెళున్దిరాయ్ పేయ్ములై నఞ్జుణ్డు**
**కళ్ళ చ్చగడమ్ కల క్కళియ క్కాలోచ్చి**
**వెళ్ళత్తరవిల్ తుయి లమర్న్ద విత్తినై,**
**ఉళ్ళత్తుక్కొణ్డు మునివర్గళుమ్ యోగిగళుమ్,**
**మెళ్ళ వెళు న్దరి యెన్ద పేరరవమ్,**
**ఉళ్ళ మ్బు గున్దు కుళిర్ న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** పుళ్ళుమ్ = పక్షులుగూడ, శిలమ్బినవాణ్ = (అవిగో) కూయుచున్నవి (చూడుము), పుళ్ + అరయన్ + కో + ఇల్ = పక్షులకు, రాజు అగు (గరుత్మంతునకు) ప్రభువు (ఐన విష్ణువుయొక్క) ఆలయమున, వెళ్ళై = తెల్లని, విళి = (అందరను కోవెలకు రమ్మని) పిలచుచున్న, శఙ్గిన్ = (పాంచజన్య) శంఖముయొక్క, పేర్ = గొప్ప, అరవమ్ = రవమును (ధ్వనిని), కేట్టిలైయో = వినలేదా, పిళ్ళాయ్ = ఓ పిల్లా, ఎళున్దిరాయ్ = (ఇకనైన) లెమ్మా, పేయ్ = రాక్షసి (పూతన) యొక్క, ములై = చన్నులలోని, నఞ్జు = విషమును, ఉణ్డు = (దాని ప్రాణములతోగూడ) భుజించి, కళ్ళమ్ = వంచనాశీలముగల, శగడమ్ = శకటాసురుని, కలమ్ + కళియ = సంధిబంధములు సడలునట్లు, కాల్ + ఓచ్చి = కాలితో విఱుగదన్ని, వెళ్ళత్తు = (మిక్కిలి) తెల్లని, అరవిల్ = ఆదిశేషునిపై, తుయిల్ = (యోగ) నిద్రను, అమర్న్ద = చెందియున్న, విత్తినై = (జగత్తుకు) విత్తనమగువానిని (సర్వేశ్వరుని), ఉళ్ళత్తుకొణ్డు = హృదయమున నుంచుకొని, మునివర్గళుమ్ = మునులును, యోగిగళుమ్ = యోగులును, మెళ్ళ = నెమ్మదిగ, ఎళున్దు

= (నిద్ర) లేచి, అరి = హరి (హరీ), ఎన్ఱ = అని పలుకుచున్న, పేర్ + అరవమ్ = పెద్ద ధ్వని, ఉళ్ళమ్ = (మా) మనస్సులను, పుగున్దు = ప్రవేశించి, కుళిర్న్దు = చల్లపరచినది.

**వ్యాఖ్య:** ఆండాళమ్మ కొంతమంది చెలికత్తెలతో కలసి వెళ్ళి నిద్రపోవునట్టి గోపికలను కొందరిని రాబోవు పది పాశురములలో మేల్కొలుపుచున్నది. ఒక గోపికనుగూర్చిన మేలుకొలు పీ పద్యము –

ఓ పిల్లా! పక్షుల రొద ఆకసమందంతటను వ్యాపించినను నీ వింకను నిద్ర పోవుచునే యున్నావా? ఏమి మొద్దునిద్దురే నీది! గరుత్మంతునికి ప్రభు వయిన సర్వేశ్వరుని సన్నిధియందలి పాంచజన్య ధ్వని యింకను నీ చెవి సోకలేదా? కంసుని పనుపున తనను వధింప నేతెంచిన పూతన చనుబాల విషము నారగించి దానిని కూల్చినవాడు సుమా మన మనోనాథుడు! శకటరూపము దాల్చి తన కపకారము చేయవచ్చిన రాక్షసుని సంధిబంధముల నొక్క కాలితాపున సడలించినవాడు గదా యీ చిన్నవాడు. క్షీరాబ్ధిలో జగదవనచింతతో శేషశయ్యపై యోగనిద్ర గూరియున్న జగత్కారణ భూతుడగు నా శ్రీనివాసుని మహర్షులును, యోగులును హృదయ పేటికలో దాచుకొని యుందురు. అట్టివారు తెల్లవారుజామున మెల్లగా నిదురలేచి హరిహరీ! హరిహరీ! యని పల్కు మంద్రధ్వని మా హృదయములను ప్రవేశించి మమ్మానందతరంగములందు ముంచి తేల్చుచున్నది. కాన నిక మాతోపా టీ పరమానంద మనుభవించుటకు నిదుర లెమ్మా!

తిరుప్పావులో వాచ్యార్థము ప్రధానము కాదని–సరస్వతివలె అంతర్వాహినిగ నున్న పారమార్థిక విషయమే ముఖ్యమని – ముందే మనవి చేసితిమి గదా! దానినే యిట వివరించుచున్నాము.

పిళ్ళాయ్ పిల్లా! అను తాళపుచెవితో ఈ పాశురమను తాళమును తెఱచినచో నీ క్రింది యంతరార్థములు స్పష్టమగును. భగవద్విషయమున

అభిరుచి కల్గింపదలచి శిష్యుని "పిల్లవాడా!" అని సంబోధించి ఆచార్యుడు ఒక సామాన్యవ్యక్తికి పరమార్థము ప్రబోధించుచున్నాడు.

## మునివర్గళుమ్ యోగిగళుమ్

భగవద్విషయము మననము చేసికొనువారు మునులు. భగవత్కైంకర్య లక్ష్మీసంపన్నులు యోగులు అని పెద్దల వ్యాఖ్యసారము. శ్రీరామసోదరులలో భరతుడు ముని. లక్ష్మణుడు యోగి.

పుళ్ళరయన్ అను పదముచే పక్షిరాజగు గరుత్మంతుని యంశమైన విష్ణుచిత్తులవారు ప్రబోధింపబడుచున్నారు.

**7. కీశుకీశె న్టెఙ్గు మానైచ్చాత్త ఙ్గలన్దు,**
**పేశిన పేచ్చరవ జ్కేట్టిలైయో పేయ్ప్పెణ్ణే,**
**కాశుమ్ పిఱప్పుమ్ కలగలప్ప క్కై పేర్తు,**
**వాశ నఱు ఙ్కుళ లాయ్చ్చియర్, మత్తినా**
**నాయగప్పెణ్బిళ్ళాయ్ నారాయణన్ మూర్తి,**
**కేశవనై ప్పాడవుమ్ నీ కేట్టే కిడత్తియో,**
**తేశ ముడైయాయ్ తిఱ వేలో రెమ్బావాయ్.**

**టీక:** పేయ్ప్పెణ్ణే = ఓ పిచ్చిదానా!, కీశు + కీశు + ఎన్టు = కీచుకీచుమని, ఎఙ్గుమ్ = అంతటను, ఆనైచ్చాత్తమ్ = భరద్వాజపక్షులు, కలన్దు = ఇతర పక్షులతో కలసి, పేశిన = కూయచున్న, పేచ్చు = కూజితముల యొక్క అరవమ్ = ధ్వనిని, కేట్టిలైయో = వినలేదా? కాశుమ్ = (మెడలోని), కాసులును, పిఱప్పుమ్ =పుస్తెలును, కలకలప్ప = గల్లుగల్లుమని మ్రోగునట్లు, కైపేర్తు = చేతులనెత్తి, వాశమ్ + నఱుమ్ + కుళల్ = దివ్య పరిమళము, గుబాళించు, కుటిలకుంతలులగు (గోపికలు) మత్తినాల్ = కవ్వముచేత, ఓ

శైపడుత్త = శబ్దింపచేయుచు, తయిర్ = (చిలుకుచున్న) పెరుగుయొక్క అరవమ్ = ధ్వనిని, కేట్టిలై యో = వినలేదా? నాయకమ్ + పెణ్పిళ్ళాయ్ = బాలికలకు నిర్వాహకురాలా, నారాయణన్ = సర్వజీవులందు నివసించు శ్రియఃపతియొక్క, మూర్తి = అవతారమైన, కేశవనై = బ్రహ్మరుద్రులకు మూలమగువానిని, పాడవుమ్ = (మేము) పాడుచున్నను, నీ = నీవు, కేట్టే = (దానిని) వినుచునే, కిడత్తియో = (ఇంకను) నిద్రించుచున్నావా? తేశమ్ + ఉడైయాయ్ = తేజముగలదానా, (దేశమును గుప్పిటపెట్టుకొన్న ఓయమ్మా) తిఱ = (తలుపు) తెఱవుమా!

**వ్యాఖ్య:** గోపీభావమున భజించి యీ స్నానవ్రతము చేయుచున్న గోదాదేవి మరికొందరు గోపికలను వెంటబెట్టికొనిపోయి తెల్లవారిపోవుచున్నను ముసుగు దన్నుకొని నిద్రించుచున్న యొక గోపికయింటికేగి యిట్లు సంబోధించుచున్నది.

ఏమమ్మా! నీకేమైన వెఱ్ఱి యెత్తినదా? తెల్లవారుచున్నను నిద్ర యేమిటమ్మా! భరద్వాజపక్షులు తమ ఆడు పక్షులతో కలసి దశదిశలకును ఎగిరి కీచుకీచుమని అరచెడు ధ్వని నీ చెవుల బడుటలేదా? పరిమళము గుబాళించుచున్న కురుల భాగ్యముగల సౌభాగ్యవతులగు గోపీమహిళా మణులు మెడలోని కాసులు, పుస్తెలు మొదలగు ఆభరణములు గల్లుగల్లుమని మ్రోగుచుండగా కవ్వముతో పెరుగు చిలుకుచున్న పెద్దరొద ఇంకను నీకు వినరాలేదా? బ్రహ్మరుద్రులకు మూలమగుటచే కేశవుడను తిరు నామము సార్థకము చేసికొన్న శ్రీకృష్ణుని కల్యాణగుణసంపదను అనంతముగా మేము పెద్దపెట్టున పాడుచుండగా నీ వింకను గుఱుపెట్టి నిద్రపోవుచున్నావేమమ్మా! భగవన్నామ సంకీర్తన యన్న చెవి కోసికొను నీ కిదితగునటమ్మా, ఓ తేజోనిధీ! మా మాట కభిమానము తెచ్చుకొనియైన లేచి తలుపు తీసి మా యీ పవిత్ర కార్యక్రమమున నన్వయింపుమా!

నిద్రపోవుచున్నదని గోదాదేవి పలుకుచున్న యీ గోపిక నిజమునకు నిద్రించుట లేదు. కృష్ణనామస్మరణమాత్రముచేతనే యీమె యొడలు మరచినది. పెక్కు రీతులుగా తన నూరించుచున్న యా నీలమేఘనిభాంగుని కనులు మూసికొని తన హృదయపంజరమందే బంధింప మార్గ మరయుచున్నది.

ఇట భరద్వాజపక్షులన ఆచార్యుడని ఆంతర్యము. నాల్గు దిక్కులందును భాగవతోత్తములు నిద్రలేచి కాలకృత్యములు నిర్వర్తించుకొని నిత్యకర్మా నుష్ఠానము లాచరించుకొనుచుండగా నీ కింత అజ్ఞతయా అని ధ్వని!

## కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్ప

అనుచో తిరుమంత్రము ద్వయమంత్రము పరస్పరము కలసి ధ్వని చేయుచుండగా అని అంతరార్థము.

తయిర్ అరవమ్ అనుటచే కర్ణగోచర మగుచున్న దివ్య ప్రబంధాను సంధాన ధ్వానము సూచితము.

పైకి దధిమంథన ఘోషమాత్రమే మన కీ పాశురములలో వినబడుచున్నది. కాని సరస్వతివలె వీరి కంఠములలో శ్రీకృష్ణ సంకీర్తన మధుర మంగళముగా సాగుచునే యున్నది. చిత్తము శ్రీకృష్ణునకే సమర్పించిన వీరు తన్నామస్మరణ మెట్లు వీడగలరు!

అనుభవింపు డీ శ్లోకార్థమును –

**"శ్లో॥ విక్రేతుకామా కిల గోపకన్యా**
**మురారిపాదార్పిత చిత్తవృత్తిః,**
**దధ్యాదికం మోహవశా దవోచత్**
**గోవిన్ద దామోదర మాధవేతి."**

మధురానగరిని పెరుగమ్మబోయిన యొక గోపికామణి కృష్ణగుణ బద్ధచేతస్కయై యొడలు మరచి పెరుగో పెరుగు అనుటకు బదులు గోవిందా! గోవింద!! దామోదరా! దామోదర!! అని కేకలు వేయుచు వీథులలో సాగినదట. అహో! స్మరణీయము గదా వారి యాత్మ విస్మృతి! ధన్యాతి ధన్యములు గదా వారి చిత్రమైన జీవితచరిత్రలు!

**8. కీళ్ వానమ్ వెళ్ళె న్డెరుమై శిఱువీడు**
**మేయ్‌వాన్ పరన్దనగాణ్ మిక్కుళ్ళ పిళ్ళైగళుమ్,**
**పోవాన్ పోగాన్గారై ప్పోగామ ల్కాత్తు, ఉన్నై**
**క్కూవువాన్ వన్దు నిన్ఱోమ్, కోదుకులముడైయ,**
**పావా యెళున్దిరాయ్ పాడి ప్పఱైకొణ్డు,**
**మావాయ్ పిళందానై మల్లరై మాట్టియ,**
**తేవాదిదేవనై చ్చెన్ఱునామ్ శేవిత్తాల్,**
**ఆవావె న్ఱారాయ్ న్దరు ళేలో రెమ్బావాయ్**

**టీక:** కీళ్ = (క్రింద) తూర్పున, వానమ్ = ఆకాశము. వెళ్ళెన్ఱు = తెల్ల పడినది, ఎరుమై = గేదెలు, శిఱువీడు = మంచుకుఱిసిన పచ్చికను, మేయ్‌వాన్ = మేయుటకు, పరన్దనకాణ్ = అంతటను తిరుగుచున్నవి, పోవాన్ = (కృష్ణునివద్దకు) పోవుటయే (ప్రయోజనమని తలచి), పోగిన్గారై = పోవుచున్న, మిక్కుళ్ళ = మిగిలిన, పిళ్ళైకళుమ్ = పడుచులను, పోగామల్ = పోకుండునట్లు, కాత్తు = నిలిపి, ఉన్నై = నిన్ను, కూవువాన్ = పిలచుటకై, వన్దు = వచ్చి, నిన్ఱోమ్ = నిలచియున్నాము, కోదుకలమ్ = కుతూహలము, ఉడైయ = కలిగియున్న, పావాయ్ = బాలికా, ఎళున్దిరాయ్ = లెమ్మా, మావాయ్ = (అశ్వరూపుడగు కేశిరాక్షసుని) నోటిని, పిళన్దానై = చీల్చిన, మల్లరై = (చాణూర ముష్టికులను) మల్లురను, మాట్టియ = మట్టుపెట్టిన, దేవాదిదేవనై = దేవదేవు (డగు శ్రీకృష్ణు) ని, శెన్ఱు = సమీపించి, నామ్ =

మనము, పాడి = ఆతని తిరునామములు కీర్తించి, పఱై = పురుషార్థము (తప్పెట)ను, కొణ్డు = పూని, శేవిత్తాల్ = సేవించినచో, ఆరాయ్న్దు = మన పరిస్థితి విమర్శించి (ఆ ప్రభువు), ఆ + ఆ + ఎన్ఱు = అయ్యో పాపమని, అరుళ్ = (తప్పక మనయెడ) కృప (చూపును).

**వ్యాఖ్య:** ఆమె మరొక గోపిక నిట్లు లేపుచున్నది. అదిగో తూర్పు తెల్లవారినది. మంచులోతడిసిన పచ్చగడ్డి మేయుటకు గేదెలు ఇండ్లు వదలిపోవుచున్నవి. స్నానమాడబోవుచున్న మిగిలిన పిల్లలనుగూడ పోనీకుండ ఆపి మాతో నిన్ను కలుపుకొని పోవుటకు మేమందరము నీ వద్దకిట్లు వచ్చినాము. కృష్ణరసాయనసేవన కుతూహలవతీ, కన్యామణీ! అశ్వరూపముదాల్చిన కేశిరాక్షసుని నోటిని రెండుగా చీల్చినవాడును, కంసుని పంపున తన్ను హతమార్పవచ్చిన చాణూరముష్టికులను మల్లురను మట్టుపెట్టినవాడును నగు నా దేవాదిదేవుని మనము తప్పెట వాయించు కొనుచు పోయి సేవించినచో నాయన మన కరుణాజనకస్థితిని తలచి కఱగి నీరై మనయెడ తప్పక దయ చూపగలడు. కాన త్వరగా నిద్ర లెమ్ము. పోదము రమ్ము.

**9. తూ మణిమాడత్తు చ్చుత్తుమ్ విళక్కెరియ,**
**తూప జ్ఞమళ త్తుయి లణైమేల్ కణ్వళరుమ్,**
**మామాన్ మగళే, మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్,**
**మామీ రవళై యెళుప్పీరో, వున్మగళ్ దాన్**
**ఊమైయో వన్ఱి చ్చెవిడో వనన్దలో?**
**ఏమ ప్పెరున్దుయిల్ మన్దిరప్పట్టాళో?**
**మామాయన్ మాదవన్ వైగున్ద నెన్ఱెన్ఱు,**
**నామమ్ పలవుమ్ నవి న్ఱేలో రెమ్బావాయ్,**

**టీక:** తూ = నిర్మలమైన, మణి = రత్నములు చెక్కిన, మాడత్తు = భవనమున, శుత్తుమ్ = చుట్టును, విళక్కు = దీపములు, ఎరియ = ప్రకాశించుచుండగా,

తూపమ్ = అగరు ధూపములు, కమళ = పరిమళింపగ, తుయల్ = మృదువయిన, అణై మేల్ = పాన్పుపై, కణ్వళరుమ్ = నిద్రించియున్న, మామాన్మగళే = మేనమామకూతురా, మణిక్కతవమ్తాళ్ = రత్నకవాటపు గడియను, తిణవాయ్ = తెరువుమా, మామీర్ = అత్తా, అవళై = మీ పుత్రికను, ఎళుప్పిరో = నిద్రలేపండి, ఉన్మగళ్దాన్ = మీ కొమరిత, ఊమైయో = మూగదియా, అన్ఱి = లేక, శెవిడో = చెవిటిదా?, అనన్దలో = అలసిపోయినదా? ఏమమ్ + పట్టాళో = కావలియుంచబడినదా?, పెరుమ్ + తుయిల్ = పెద్దనిద్దురచే, మన్దిరమ్ + పట్టాలో = మంత్రింపబడినదా?, మామాయన్ = మహామాయావీ, మాదవన్ = శ్రియఃపతీ, వైకున్దన్ = వైకుంఠా, ఎన్ఱు + ఎన్ఱు = ఇట్లని, నామమ్ = (ఆతని) నామములు, పలవుమ్ = అనేకము, నవిన్ఱు = అతనికి చెప్పితిమి. (కాన), మామీర్ అవళై ఎళుప్పీరో = అత్తా ఆమెను లేపండి, అని అన్వయము

**వ్యాఖ్య:** నిర్మలమణిఖచిత మైనందున ధగధగ మెఱయుచున్న దివ్య భవనమున దీపములు ప్రకాశించుచుండెను. అక్కడకు పోయి గోదాదేవి అందు నిద్రించుచున్న యొక పడతిని నిద్ర లేపగా ఆమె లేవలేదు. అపుడామె – "ఏమమ్మా మేనమామకూతురా! అగరు ధూప పరిమళమునకు నీ యొడలు పరవశమైపోయెనా ఏమిది! ఎంత లేపినను లేవకున్నావు. లేచి రత్నాల గడియ తీయుమా" అని పిలచినది. ఎంత సేపయినను ఆమె లేచి వచ్చి తలుపు తెఱవకుండుటచే, మఱింత పెద్ద కంఠధ్వనితో ఆ పిల్ల తల్లిని సంబోధించి "అత్తా, చూడండి, మీ అమ్మాయి ఎంత పిలచినను లేచుటలేదు. మీ పిల్ల మూగదా? చెవిటిదా? లేక మిగుల నలసిపోయినదా? పెద్దనిద్దురపోవున ట్లెవరైన ఈమెను మంత్రించినారా?"– అని అరచినది. అపు డామెతల్లి – "మీరు శ్రీకృష్ణనామము నుచ్చరించినచో నా బిడ్డ చిటుక్కున లేచును." అని సమాధానమిచ్చెను. అంతట నా దేవి –

"శ్రీకృష్ణుడాశ్చర్య చేష్టాన్వితుడు, శ్రియఃపతి, వైకుంఠధాముడు" అని అనేకవిధములుగా స్తుతించి,– "సరియా, అత్తా, ఇపుడై నను ఆమెను లేపి మా వద్దకు పంపుడు" అని పలికినది.

ఇది ఆండాళమ్మ కవితాశిల్పము తళుక్కున మెఱుపుపలె మెఱసి మన కన్నుల మిఱుమిట్లు గొలుపు సన్నివేశము. మేము తెల్లవారిపోవునేమో యను భయముతో నిద్రయనున దెఱుగక యిల్లిల్లు తిరిగి మార్గళి స్నానార్థమై తోడి చెలికత్తెలను నిదురలేపి తీసికొని వచ్చుచుండ నీవు చల్లగా హంసతూలికా తల్పమున తూగుచున్నావా? ఎంత దానవు. "పిల్లికి చెరలాటము ఎలుకకు ప్రాణం పోకడ" అన నిదే సుమా అనుచున్న దీ పాశురమున నీ కవయిత్రి. వ్యంగ్యార్థములు స్త్రీలకు నోటిలో నానుచుండవా మరి!

నిజమునకు గృహస్వామిని సుఖముగా నిద్రించుటలే దిచట. లోకమంతయు నిద్రించుచు ప్రశాంతముగానున్న యీ సమయమును భగవ ద్గుణానుభవమున నామె సద్వినియోగపరచుకొనుచున్నది.

**శ్లో॥ యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః**

సర్వభూతములు నిద్రించు రాత్రివేళ మనసు నిశ్చలమైందున యోగీశ్వరుడు హృదయగుహాంతర్వర్తి యగు పరమాత్మ యందు రమించుచు మేల్కొనియుండును. అట్లే జనులు మేల్కొన్నపు డాతడు నిద్రించును. ఇది గదా యథార్థము!

## తుయిల్ అణై మేల్ కణ్ వళరుమ్

హంసతూలికాతల్పముపై నిద్రించుట అనగా భగవద్గుణానుభవా నందముతో కాలక్షేపము చేయుట అని పెద్దలు చెప్పిన సూక్ష్మార్థము!

**10. నోత్తు చ్చువర్కమ్ పుగుగిన్ఱ వమ్మనాయ్,**
**మాత్తము న్తారారో వాశల్ తిఱవాదార్,**
**నాత్తత్తుళాయ్ముడి నారాయణన్ నమ్మాల్,**
**పోత్తప్పఱై దరుమ్పుణ్ణియనాల్, పణ్డొరునాళ్**
**కూత్తత్తిన్ వాయ్ వీళ్న్ద కుమ్బకరణనుమ్,**
**తోత్తుమున క్కే పెరు న్దుయిల్ తాన్ తన్దానో,**
**ఆత్త వనన్దలుడైయా యరుఙ్గలమే,**
**తేత్తమాయ్ వన్దు తిఱ వేలో రెమ్బావాయ్.**

**టీక:** నోత్తు= వ్రత మనుష్ఠించి, శువర్కమ్ = స్వర్గ (సుఖము) ను, పుగుగిన్ఱ = పొందుచున్న, అమ్మనాయ్ = ఓ తల్లీ, వాశల్ = వాకిలి, తిఱవాదార్ = తెరువకపోయినను, మాత్తముమ్ = జవాబయినను, తారారో = ఇవ్వరాదా, నాత్త = పరిమళించుచున్న, తుళాయ్ = తులసితో పరిమళించు, ముడి = కిరీటము (జుట్టుముడి) గల, నారాయణన్ = సర్వేశ్వరుడును, నమ్మాల్ = మనచేత, పోత్త = స్తుతింపబడి, పఱై = పురుషార్థము, తరుమ్ = అనుగ్రహించునట్టి, పుణ్ణియనాల్ = పుణ్యాత్ముని (శ్రీరాముని) చేత, పణ్డు = పూర్వము, ఒరునాళ్ = ఒక సమయమున, కూత్తత్తిన్ = మృత్యువుయొక్క, వాయ్ = నోట, వీళ్న్ద = పడిన, కుంబకరణనుమ్ = కుంభకర్ణుడును, ఉనక్కుతోత్తు = నీకు ఓడిపోయి (దాసుడై) పెరుమ్ + తుయిల్ = (తన) పెద్ద నిద్రను, తాన్ = తానే, తన్దానో = ఇచ్చెనా యేమి? ఆత్త + అనన్దల్ = మితిమీఱిన నిద్ర, ఉడైయాయ్ = కలదానా, అరుమ్ = అపూర్వమైన, కలమే = (మా) చూడామణీ, తేత్తమ్ + ఆయ్ = నిదానముగా మేలుకొని, వన్దు = వచ్చి, తిఱ = తలుపు తెరువుమా!

**వ్యాఖ్య:** "నోము నోచి స్వర్గసుఖమును పొందదలచిన ఓ అమ్మా! తలుపు తీయకపోయినను సమాధాన మయినను చెప్పలేవా? పరిమళించు

తులసిమాల దాల్చిన సర్వేశ్వరుడు మంగళాశాసనము చేసినందుకు మనకు కోరిన ప్రతిఫలమునిచ్చి తీరును. అట్టి పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు మును పొకకాలమున కుంభకర్ణుని మృత్యుదేవత కొప్పగించినవాడు గదా! ఆ రాక్షసుడు తా నీ లోకము వదలి పోవునపుడు తన పెద్దనిద్ర నీకు ఇచ్చిపోయెనా యేమి? ఓ గాఢనిద్రముద్రితా! మా కులచూడామణీ! నీవు ఇప్పటికైన తెలివి తెచ్చుకొని తలుపు తెఱవుమా" యని యొక గోపికను ఆండాళ్‌గోపిక పిలచుచున్నది.

సువర్కమ్ స్వర్గసుఖమన నిచట కృష్ణ సంశ్లేషరూప మయిన మోక్షమే కాని వేఱు కాదు. నీవు మాతో ఒక్క పలుకయినను పలుక కుండ పడుకొనియున్నావే? అంత యేమి పాపము చేసినామమ్మా మేము? "పలుకే బంగారమాయెనా, గోపమ్మ తల్లీ"

నాత్తత్తుళాయ్‌ముడ నీవు కృష్ణునితో కలసి యేకాంతమున స్వర్గసుఖము దోచుకొనుచున్నావనుటకు శ్రీకృష్ణుడు తన కేశపాశమున తురుముకొన్న తులసీపరిమళమే సాక్ష్యము గదా! ఓ స్వార్థపరురాలా, ఆయనను నీ బాహుపంజరమున బంధించుకొనగల్గినావు గాని తన్మౌళి నిర్గత తులసీపరిమళము బంధింప నీ తరమగునా?" అని యిట స్వారస్యార్థము.

**శ్లో॥ యది సన్తి గుణాః పుంసాం వికసంత్యేవ తే స్వయమ్,**
**నహి కస్తూరికామోదః శపథేన నివార్యతే.**

అను నానుడి ప్రసిద్ధము గదా!

ఎవరిలోనైన మంచిగుణములున్నచో నవి లోకమున గుప్పుమనియే తీరును. కస్తూరికిగల సహజపరిమళమును పైకి రానీయకుండ చేయవలెనని ఎంత ప్రయత్నించినను ఆపలేము గదా!

పుణ్ణియనాల్ అనుటచే "కృష్ణం ధర్మం సనాతనం" కృష్ణు డొక్కడే సనాతన ధర్మము అనుటతోపాటు –

**శ్లో॥ మన్నిమిత్తకృతం పాపమపి పుణ్యాయ కల్పతే,**
**మామనాదృత్య యత్పుణ్యమపి పాపాయ కల్పతే.**

నా కొఱకు చేసిన పాపమయినను పుణ్యప్రదమే. నన్ను కాదని చేసిన పుణ్యమయినను పాపమే అను అర్థస్వారస్యముగూడ తోచుచున్నది.

**11. కత్తు క్కఱవై క్కణజ్గళ్ పల కఱన్దు,**
**శెత్తార్ తిఱ లళియ చ్చెన్టు శెరు చ్చెయ్యుమ్,**
**కుత్త మొన్టిల్లాద కోవలర్తమ్ పొఱ్కొడియే,**
**పుత్తర వల్గుల్ పునమయిలే పోదరాయ్,**
**శుత్తత్తుత్తోళిమా రెల్లామ్ వన్దు నిన్**
**ముత్త మ్పుగున్దు ముగిల్వణ్ణన్వేర్ పాడ,**
**చ్చిత్తాదే పేశాదే శెల్వప్పెణ్డాట్టి నీ,**
**ఎత్తుక్కుఱజ్గుమ్ పొరు ళేలో రెమ్బావాయ్**

**టీక:** కన్టు + కఱవై = లేత (వయన్సుగల) ఆవులయొక్క, పల = అనేకములగు, కణజ్గళ్ = సమూహములను, శెత్తార్ = శత్రువులయొక్క తిఱల్ = బలము, ఆళియ = నశించునట్లు, శెన్టు = వెళ్ళి, శెరు + చెయ్యుమ్ = యుద్ధము చేయువారును, ఒన్టు = ఒక, కుత్తమ్ = దోషమును, ఇల్లాత = లేనివారునైన, కోవలర్తమ్ = గోపాలురయొక్క, పొన్ + కొడియే = సువర్ణలతా! పుత్తు + అరవు + అల్గుల్ = పుట్టలోనున్న పాము (పడగ) వంటి, నితంబము = (పిఱుదులు) గలదానా, పునమ్ + మయిలే = వనమయూరమా, పోదరాయ్ = లేచిరావమ్మా, శుత్తమ్ + తోళిమార్ + ఎల్లారుమ్ = చుట్టములును, సకియలును, అందరును, వన్దు = వచ్చి, నిన్ముత్తమ్ = నీ వాకిలిని, పుగున్దు = ప్రవేశించి, ముగిల్వణ్ణన్పేర్ = మేఘవర్ణు (సర్వేశ్వరు) ని తిరునామములను, పాడ = పాడగా, శెల్వమ్ +

పెండాట్టి = కృష్ణగుణానుభవసంపద గల ఓ తల్లీ! నీ = నీవు, శిత్తాదే = కదలకుండ, పేశాదే = పలుకకుండ, ఎత్తుక్కుపొరుళ్ = ఏ ప్రయోజనము నుద్దేశించి, ఉఱజ్గుమ్ = (ఇంకను) నిద్రించుచున్నావు?

**వ్యాఖ్య:** "నందగోకులమందలి గోపాలురు లెక్కలేనంత పశుసంపద గలవారు. శత్రుసేనల మట్టుపెట్టునట్టి వృత్తశౌండీర్య గర్వము గలవారు. ఆ గోపకులమున సువర్ణ లతవలె వెలుగు నిచ్చుట కవతరించినదానవు నీవు. అట్టి నీ సౌందర్యలావణ్యము లద్వితీయములు గదా! నీ సర్వావయవములును సుపుష్టములు. తత్తత్ స్థానానురూపములు. నీ నితంబ సీమ పుట్టలోని పాముపడగలె శ్రియఃపతికి వ్యామోహోపాదకము. నీ నడక కడవినెమలిని మాత్రమే పోలికకు తీసికొని రాదగును.

ఇట్టి నీ చెలికత్తెలుగూడ నీ స్వరూపస్వభావములను పోలినవారే యైయుందు రనుటలో వింత యుండదు సుమీ! వారు నీకు రక్త బంధువులగుట గూడ కడుంగడు స్పృహణీయము గదా! వారందరును భవన ప్రాంగణమునకు వచ్చి మేఘవర్ణుని కల్యాణగుణగణములను గానము చేయుచుండగా నీవిట్లింకను కదలక మెదలక ప్రక్కపై పరుండియుండుట కేమి కారణము తల్లీ! మా ప్రాణము తీయక యికనైనను మాతో స్నానమాడ లేచి రావమ్మా" అని గోదాదేవి తోడిబాలికలతోగలసి యొక ముగుదను నిదుర లేపుచున్నది.

కణఙ్గళ్‌పల (అనేక గణములు) శ్రీ నందగోపునికి గల గోవులను వేఱువేఱుగ లెక్కించుట మాత్రమే గాక గుంపులు గుంపులుగా లెక్కించుట గూడ నసాధ్యమే. కణములు లెక్కించుట యెంత కష్టమో యీ గోగణములు లెక్కించుటసైత మంతే కష్టమయిన పని! కణములు అని అనుకొన్నచో నిచట నీ యర్థము తోచును.

పుత్తరవల్ కుల్ (పుట్టలోనున్న సర్పముపడగ వంటి నితంబము గలది) అని ఒక స్త్రీ సౌందర్యము, స్త్రీయైన యీ కవయిత్రి వర్ణించుట యేమి? యని శంక. "పుంసాం దృష్టి చిత్తాప హరిణమ్." పురుషుల దృష్టిని చిత్తమునుగూడ నాకర్షించినవాడు సుమా శ్రీరామచంద్రుడు అను పలుకును-

**శ్లో॥ పాఞ్చాల్యాః పద్మపత్రాక్ష్యాః**
**స్నాయాన్త్యా జఘనం ఘనం,**
**యాః స్త్రియో దృష్టవత్యస్తాః**
**పుంభావం మనసా యయుః**

ద్రౌపది స్నాన మాదుచుండగా ఆమె ఘనజఘనసౌందర్యము కన్నులార గాంచిన స్త్రీలు - "అయ్యో మేము గూడ పురుషులము కాకపోతిమే అని విచారించినారు" అని వ్యాసభగవానుడు వర్ణించిన తీరును ఇట స్మరణీయము.

"కత్తుక్కరవై" (గోవత్సములు) అను పదముచే బహుశిష్యగణ విభాసితుడైన సదాచార్యుడు సూచితుడు.

**12. కనైత్తిళ జ్గతైరుమై కన్ఱు క్కిరఙ్గి,,**
**నినై త్తు ములైవళియే నిన్ఱు పాల్శోర,**
**ననై త్తిల్లమ్ శేఱాక్కుమ్ నఱ్చెల్వ న్తఙ్గాయ్,**
**పని త్తలై వీళ నిన్ వాశల్ కడై పత్తి,**
**చ్చిన త్తినాల్ తెన్నిలఙ్గైక్కోమానై చ్చెత్త,**
**మన త్తు క్కినియానై ప్పాడవుమ్ నీ వాయ్ తిఱవాయ్,**
**ఇనిత్త నెళున్దిరా యీదెన్న పేరుఱక్కమ్,**
**అనైత్తిల్లత్తారు మఱి న్దేలో రెమ్బావాయ్. 12**

**టీక:** కనై త్తు = (పాలు చేపుకు వచ్చి) అఱచి, ఇళమ్ + కన్ఱు + ఎరుమై = లేత (మొదటి ఈత) దూడగల, గేదెలు, కన్ఱుక్కు = దూడయందు, ఇరఙ్గి = కనికరముతో, నినై త్తు = (ఆ దూడలకు పాలీయవలెనని) తలచి (నందున), ములై వళియే = పొదుగులగుండ, నిన్ఱు = ఎడ తెగకుండ, పాల్ = పాలు, శోర = స్రవించుచుండగా, ఇల్లమ్ = ఇంటి (ముంగిలి)ని, ననై త్తు = తడిపి, శేఱ్ = బురదగా, ఆక్కుమ్ = చేయునట్టి, నల్ + శెల్వన్ + తఙ్గాయ్ = మంచి సంపదగలవాని చెల్లెలా! పని = మంచు, తలై = తలమీద, వీళ = పడుచుండగా, నిన్‌వాశల్ కడై = నీ వాకిలి చూరును (గడపను), పత్తి = పట్టికొని, శినత్తినాల్ = కోపముచే, తెన్ + ఇలఙ్గై + కోమానై = చూడదగిన లంకకు ప్రభువును (రావణుని) శెత్త = వధించిన, మనత్తుక్కు = (అందఱి) మనస్సులకు, ఇనియానై = ప్రియుని, (శ్రీరామచంద్రుని) పాడవుమ్ = గానము చేసినను, నీ = నీవు, వాయ్ = నోరు, తిఱవాయ్ = తెఱవవేమి? ఇనిత్తాన్ = ఇకనైనను, ఎళున్దిరాయ్ = లెమ్మా, ఈదు + ఎన్న = ఇదేమి, పేర్ + ఉఱక్కమ్ = పెద్ద (మొద్దు) నిద్ర, అనైత్తు = అన్ని, ఇల్లమ్ + ఆరుమ్ = ఇండ్లవారును, అఱిన్దు = (మనసంగతి) తెలిసికొనిరి.

**వ్యాఖ్య:** “గోకులమున గేదెలకు పాలు పిండువారే లేకుండిరి. అయినను గేదెలు దూరమున కట్టివేసిన తమ దూడలను తలచికొన్నందున వానికి పాలు చేపునకు వచ్చెను. అవి తమ వత్సములు పాలు కుడుచుకొన్నట్లే సంతృప్తి వహించినందున వాని పొదుగులనుండి క్షీరము విపరీతముగ స్రవింపసాగెను. ఆ పాలతో ఇండ్ల ముంగిళ్ళు తడిసి ఱొచ్చు ఱొచ్చుయి పోయెను. అట్టి గోసంపదగలవాడు సుమా నందుడు. ఆ నందగోపుని చెల్లెలా! ప్రభాతకాలమున మంచు మా తలలమీద పడుచుండగా నీ వాకిలి చూరును పట్టుకొని సుందరమైన లంకకు అధిపతియగు రావణాసురుని సంహరించినవాడును, సర్వమనోహరుడును నగు చక్రవర్తి తిరుమగనారును

(దశరథరాజకుమారుని) మే మందరమును కలసి పెద్దపెట్టున పాడుచున్నను నీవు నోరైన తెరవ వేమికర్మమమ్మా యిది! ఊరి వారందరును మీ ముంగిట పడిగాపులు పడి మిమ్ములను మేల్కొలుపుచుండుట తెలిసినది. ఇకనైన లేచి రావమ్మా" యని శూడిక్కొడుత్తమ్మ తోడిబాలికలతో కలిసి ఒక గోపికను మేల్కొలుపుచున్నది.

కన్ఱుక్కిరఙ్గి (వత్సముపై కరుణించి) లేదూడపై గోవు మిక్కుటమగు వాత్సల్యము వర్షించునట్లే సద్గురువుగూడ క్రొత్తగ తన్నాశ్రయించిన శిష్యునిపై అత్యంత ప్రేమ చూపునను సూచ్యార్థ సూచన మిందు గలదు. ఇట నీ హిందీ పద్యము మంతవ్యము –

**ప॥ సిఖ్ తో ఐసా చాహియే గురుకో సబ్ కుఛ్ దేయ్,**
**గురు తో ఐసా చాహియే సిఖ్‌తే కుఛ్ నహిం లేయ్**

గురువుకు సమస్తము సమర్పించువాడే శిష్యుడు. కాని అట్టి శిష్యునినుండి తృణమైనను స్వీకరింపనివాడు మాత్రమే సద్గురువు!

ములైవళియే (పొదుగులనుండి) చేతితో తాకకుండగనే సంతతధారగా కొండలపై గొట్టములనుండి జలధారలు పడునట్లు గోవులు పాలు స్రవింపజేయుచున్నవి యనుటచే కోరకపోయినను మంచిగురువులు కరుణాంతరంగితులై శిష్యులకు వివిధార్థముల నుపదేశింతురు అను విషయము ఈ వ్యాఖ్యాత శ్రీ చరణరేణువునకు అనుభవసిద్ధము.

**13. పుళ్ళిన్ వాయ్ కీణ్డానై ప్పొల్లా వరక్కనై,**
**క్కిళ్ళి క్కళైన్దానై క్కీ ర్తిమై పాడి ప్పోయ్,**
**ప్పిళ్ళైగ ళెల్లారుమ్ పావైక్కళ మ్బుక్కార్,**
**వెళ్ళి యెళున్దు వియాళ ముఱజ్గిత్తు,**

**పుళ్ళుమ్ శిలుమ్బినగాణ్ పోదరిక్కణ్ణినాయ్,**
**కుళ్ళక్కుళిర కుడైన్దు నీరాడాదే,**
**పళ్ళి క్కిడత్తియో పావాయ్ నీ నన్నాళాల్,**
**కళ్ళ న్తవిర్న్దు కల న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** పుళ్ళిన్ = పక్షియొక్క (తనను చంపవచ్చిన బకాసురుని), వాయ్ = నోటిని (శ్రీకృష్ణుడై), కీణ్డానై = చీల్చినవాడును, పొల్లా = దుష్టుడైన, అరక్కనై = రాక్షసు (డైన రావణు) ని, కిళ్ళి = (గడ్డి పోచనువలె సమూలముగ) గిల్లి, కళైన్దానై = పారవైచినవాడును ఐనవానియొక్క (శ్రీరామచంద్రుని), కీర్తిమై = (వీర) చరితమును, పాడి + పోయ్ = పాడుచుపోయి, పిళ్ళైగళ్ = బాలికలు, ఎల్లారుమ్ = అందరును, పావైక్కళమ్ = (నోము నోచుకొను) సంకేత స్థలమును, పుక్కార్ = ప్రవేశించినారు, వెళ్ళి = శుక్ర నక్షత్రము, ఎళున్దు = లేచి, (పొడిచి) వియాళమ్ = బృహస్పతి నక్షత్రము, ఉఅజ్గిత్తు = అస్తమించినది, పుళ్ళుమ్ = పక్షులుగూడ, శిలమ్బినకాణ్ = (ఎర వెదుకబోయి) కూయుచున్నవి చూడు, పోదు + అరి + కణ్ణినాయ్ = పద్మ (మధ్య) మున నున్న తుమ్మెదవంటి నేత్రములుగల, పావాయ్ = ఓ చిన్నదానా! నీ = నీవు, నల్ + నాళ్ + ఆల్ = (శ్రీకృష్ణునితో మన సమాగమమున కనుకూలమైన యీ) శుభదినమందు, కళ్ళమ్ = (తద్గుణానుభవమును ఒంటరిగ ననుభవించుట యను) కపటమును, తవిర్న్దు = వదలి, కలన్దు = (మాతో) కలసికొని, కుళ్ళక్కుళిర = (తాపమారి శరీరము) పూర్తిగ చల్లబడునట్లుగా, కుడైన్దు = నీట మునిగి, నీర్ + ఆడాదే = స్నానమాడకుండ, పళ్ళి = పక్కమీద, కిడత్తియో = పొరలుచున్నావా, ఆల్ = ఏమి వింత!

**వ్యాఖ్య:** "శ్రీరామచంద్రునకును శ్రీకృష్ణునకును భేద మిసుమంతయును లేదు సుమా! ఆయనయే పక్షిరూపమున తనను హతమార్పవచ్చిన

బకాసురుని శ్రీకృష్ణుడై రూపుమాపినాడు. శ్రీరామావతారమెత్తి ముల్లోకములను బాధించిన దుష్టుడగు రావణాసురుని పది తలలను గడ్డిపోచనువలె సులభముగా గిల్లివైచినాడు. అట్టి పురుషోత్తముని వీరచరిత్రాదులను గానము చేయుచు మన తోడి బాలికలందరును స్నానమాడ బయలుదేరినారు. ఆకసమున బృహస్పతి నక్షత్రము అస్తమించినది, శుక్రనక్షత్ర ముదయించినది. బళ్ళున తెల్లవారుచున్నది. కనుకనే పక్షులు ఎరకై బయలుదేరి నలువంకులను కువకువమని కూయుచున్నవి. పద్మమందలి తుమ్మెదలను బోలిన కన్నులుగల ఓ కన్యకామణీ, శ్రీకృష్ణగుణానుభవవిశ్లేషము (వియోగము) తీరునట్లును, శరీరముతోపాటు మనస్సుగూడ మిక్కిలి చల్లబడునట్లును నీట మునిగి జలకమాడకుండ ఇంకను ప్రక్కపై పొరలుచున్నావా? ఏమి ఆశ్చర్యము? ఇటువంటి మంచికాలమున నింత శుభదినమున కపటము వదలి బైటకు రమ్ము, మన మందరము స్నానమాడ బోవుదము" అని ఆండాళమ్మ నిద్రించుచున్న యొక తెఱవను మేల్కొలుపుచున్నది.

పరస్త్రీబాధకుడైనందున ప్రజాకంటకుడైన రావణుని ఇరువది భుజశాఖలను ఛేదించి సమూలముగ వానిని మట్టుబెట్టిన శ్రీరాముడే శ్రీకృష్ణుడై యవతరించి బకరూపమున వచ్చి తనను అమాంతముగా మ్రింగివేసిన రక్కసుని పొట్ట చీల్చుకొని బైటపడి చంచువును పట్టుకొని రెండుగా చీల్చి వానిని చంపివేసినాడు. అట్టి వాని వీరచరిత్రములను దివ్యమంగళగుణగణములను ప్రశంసించుటకు మేము పోవుచున్నాము, మాతో రమ్ము అని ఆండాళ్‌తల్లి నిద్రించుచున్న యొక గోపికను ప్రబోధించుచున్నది.

**కీర్తిమై అనుచోట**

**శ్లో॥ గచ్ఛతాం దూరమధ్వానం తృష్ణామూర్ఛితచేతసాం,**
**పాథేయం పుణ్డరీకాక్ష నామసఙ్కీ ర్తనామృతమ్.**

తృష్ణామూర్ఛిత చేతస్కులై సుదూరయాత్ర చేయు బద్ధజీవులకు పుండరీకాక్ష నామసంకీ ర్తనామృతము తప్ప వేఱు పాథేయము (దారి బత్తెము) ఘనముగ నుపయోగించుట కేమి యుండను? అను శ్లోకార్థ మను సంధేయము.

పావాయ్ (కన్నెపడుచు) ఈ పదమున ఆ పడుచుపిల్ల, మీనుపిల్లవలె త్రుళ్ళింతలాడునట్టి పరమమృదుమధుర లావణ్యసంభరిత స్వరూప స్వభావములు గమ్యములు.

**14. ఉజ్గళ్ పుళైక్కడై త్తోట్టత్తు వావియుళ్,**
**శెజ్గళునీర్ వాయ్‌నెగిళ్ న్దామ్బల్‌వాయ్ కూమ్బినగాణ్.**
**శెజ్గ ఱ్పొడి క్కూఱై వెణ్బల్తవ త్తవర్,**
**తజ్గళ్ తిరుక్కోయిల్ శజ్గిడువాన్ పోగిన్ఱార్,**
**ఎజ్గళై మున్న మెళుప్పువాన్ వాయ్ పేశుమ్,**
**నజ్గా యెళున్దిరాయ్ నాణాదాయ్ నావుడైయాయ్‌న్,**
**శజ్గొడు శక్కర మేన్దు న్తడక్కైయన్,**
**పజ్గయక్కణ్ణానై ప్పాడేలో రెమ్బావాయ్.**

**టీక:** ఉజ్గళ్ = మీ యొక్క, పుళై + కడై + తోట్టమ్ + వావియుళ్ = పెరటివైపు తోటలోని బావిలోపల; శెజ్గళునీర్ = ఎఱ్ఱకలువలు, వాయ్‌నెగిళ్న్దు = వికసించి, ఆమ్బల్ = నీలోత్పలములు, వాయ్‌కూమ్బిన కాణ్ = ముకుళించుకొన్నవి, శెమ్ + కల్ + పొడి = కావిఱాతిపొడి (రంగుగల), కూఱై = వస్త్రములు (దాల్చి), వెణ్ = తెల్లని, పల్ = దంతములు (గల), తవత్తవర్ = తపోధనులు (సన్యాసులు), తజ్గళ్ = తమయొక్క, తిరుక్కోయిల్

= దేవాలయములందు, శఙ్గు + ఇడువాన్ = శంఖతీర్థముతో అభిషేకించి ఆరాధనము చేయుటకు, పోగిన్డార్ = పోవుచున్నారు, ఎఙ్గళై = మమ్ములను, మున్నమ్ = ముందుగా, ఎళుప్పువాన్ = లేపెదనని, వాయ్‌పేశుమ్ = వాగ్దానము చేసిన (నెరవేర్చుకోని), నాణాదాయ్ = లజ్జావిహీనురాలా, నా + ఉడైయాయ్ = మధురవాణిగలదానా, శఙ్గొడు = శంఖముతోపాటు, శక్కరమ్ = చక్రమును (గూడ), ఏన్దుమ్ = ధరించిన, తడై = విశాలమగు, కైయన్ = కరములుగల, పఙ్గయమ్ + కణ్ణానై = పంకజ నేత్రుడగు శ్రీకృష్ణుని, పాడ = కీర్తించుటకు, ఎళున్దిరాయ్ (ఇకనైన) లెమ్మా!

**వ్యాఖ్య:** ఎంత ప్రొద్దెక్కినను మొద్దు నిద్దుర పోవుచున్న యొక గోపికను గోదాదేవి యిట్లు మేల్కొలుపుచున్నది.

ఏమమ్మా! మిమ్ములనే ముందు లేపెదనని మాతో నిన్న చెప్పి నే డిట్లు నిద్ర పోవుచున్నావా, నీకు సిగ్గు లేదా! అదిగో చూడుము. మీ పెరటితోటలోని దిగుడుబావిలో ఎఱ్ఱకలువలు వికసించి నల్లని కలువలు ముకుళించు కొన్నవి. కావిబట్టలు కట్టి తెల్లని పల్వరుసగల తపోధనులు తమతమ యాలయములకు దేవతార్చనకై బయలుదేరి పోవుచున్నారు. అబ్బా, నీ మధురవాణిని విన మేము చెవులు కోసికొనుచున్నామే! మా ప్రాణములు పోవుచున్నవే! శంఖచక్రధరుడగు నా పద్మనేత్రుని గానము చేసి మా చెవుల త్రుప్పును వదలగొట్టుటకు ఇకనైనను ప్రక్క వదలి లేచిరావమ్మా!

## శఙ్గొడు శక్కర మేన్దుమ్ తడైక్కైయన్

(శంఖచక్రధారి) అను వాక్యార్థముచే సుదర్శన పాంచజన్యాంకిత విశాలభుజార్గళాశోభితు డగు సదాచార్యుడు పరామర్శింపబడినాడు. తన శిష్యులను తదేక జాగరూకతతో తనను మించినవారినిగా జేయ నాతడు బద్ధకంకణుడై యుండుట సహజము గదా!

**శ్లో॥ యే కంఠలగ్న తులసీనళినాక్షమాలా**
**యే బాహుమూల పరిచిహ్నిత శంఖచక్రాః,**
**యే వా లలాటఫలకే లసదూర్ధ్వపుంద్రాః**
**తే వైష్ణవా భువనమాశు పవిత్రయంతి.**

తులసీ పద్మాక్షమాలికలు కంఠమున ధరించి, భుజమూలమున శంఖచక్రములు దాల్చి లలాటమున నూర్ధ్వపుండ్రములతో నొప్పారు శ్రీ వైష్ణవులు త్రిలోకములను తమ శ్రీచరణరేణువులచే సదా పవిత్రము చేయుదురు గదా!

అట్టి భగవదేకప్రవణుడైన సదాచార్యుడు పంకజనేత్రుడగు శ్రీ మహావిష్ణువు నుచ్చైస్స్వరమున కీర్తించుచుండగా దానిని చెవిబెట్టక నిద్రించుచుండు మూర్ఖజీవుల దౌర్భాగ్య మెట్టిదియో గదా!

ఈ యర్థమునే ప్రపన్నజనాగ్రేసరులు శ్రీనమ్మాళ్వారు లెంత మృదువుగా కవితానిబద్ధము చేసినారో –

**పా॥ కులన్దాఙ్గు శాదిగళ్ నాలిలుమ్ కీళిళున్దు ఎత్తనై**
**నలన్దా నిలాత శణ్డాళర్ శణ్డాళర్గ ళాకిలుమ్**
**వలన్దాఙ్గు శక్కరత్తణ్ణన్ మణివణ్ణ ర్కాళెన్నుళ్**
**కలన్దా రడియార్దమ్మాడియా రెమ్మడిగళే.**

బ్రహ్మక్షత్రియవైశ్యశూద్ర జాతులకుగూడ క్రిందివారైనను సరే, వారు చండాలాతిచండాలజాతికి చెందినవారైనను సరే, సుదర్శన పాంచజన్యాలంకృతబాహువగు శ్రియఃపతికి దాసులమను భావన కలిగిన వారైనచో, అట్టి దాసులకు దాసులకు దాసులైనవారిని మాత్రమే మేము పూజింతుము.

**15. ఎల్లే యిళఙ్గిళియే యిన్న ముఱఙ్గుదియో,**
**శిల్లె న్ఱళైయేల్మిన్ నఙ్గైమీర్ పోదరుగిన్ఱేన్,**

**వల్లై యున్ కట్టురైగళ్ పణ్డే యున్ వా యఱిదుమ్,**
**వల్లీర్‌గళ్ నీజ్గళే నానేదా నాయిడుగ,**
**ఒల్లై నీపోదా యున క్కెన్న వేఱుడైయై,**
**ఎల్లారు మ్పోన్దారో పోన్దార్ పో న్దెణ్ణిక్కొళ్,**
**వల్లానై కొన్గానై మాత్తారై మాత్తళిక్క,**
**వల్లానై, మాయనై ప్పాడేలో రెమ్బావాయ్.**

**టీక:** ఎల్లే = ఓసీ! ఇళమ్ + కిళియే = లే జిలుకా, ఇన్నమ్ = ఇంకను, ఉఱజ్గుదియో = నిద్రించుచున్నావా? (అని పల్కగా), నజ్గైమీర్ = ఓ పరిపూర్ణురాలా! శిల్ + ఎన్ఱు = చెళ్ళు చెళ్ళుమన్నట్లు (చిఱచిఱలాడుచు), అళైయేల్‌మిన్ = అట్లు పిలువకు, పోదరుగిన్ఱేన్ = వచ్చుచున్నాను, వల్లై = (మాట్లాడుటయం దతి) సమర్థురాలా! ఉన్‌కట్టురైగళ్ = నీ చతురపదములను, ఉన్‌వాయ్ = నీ నోటిని, పణ్డే = ఇదివరకే, అఱిదుమ్ = (మేము) ఎఱుగుదుము, (అని అనగా) వల్లీర్‌గళ్ = మాటలందు సమర్థులు, నీజ్గళే = మీరే, (పోనీ), నానేదాన్ = నేనే, ఆయిడుగ = కానిందు, నీ = నీవు, ఒల్లై = (మా) సమూహమున, పోదాయ్ = వచ్చి నిలువుమా, ఉనక్కు = నీకు, ఎన్న = ఏమి, వేఱ్ + ఉడైయై = ప్రత్యేకానుభవము! (అని అడుగ), ఎల్లారుమ్ = అందఱును, పోన్దారో = వచ్చిరా, పోన్దార్ = (ఆ) వచ్చినారు, పోన్దు = వచ్చి, ఎణ్ణిక్కొళ్ = లెక్కించుకో, వల్ = బలిష్ఠమగు, ఆనై = (కువలయాపీడ) గజమును, కొన్గానై = వధించిన వాడును, మాత్తారై = (కంసాది) శత్రువుల, మాత్తు = మదగర్వములను, అళిక్కవల్లానై = నశింపచేయ వలతియును, మాయనై = అతిమానుష గుణచేష్టితుడును నగు దేవాదిదేవుని, పాడ = (మనమందర మేకమై వెళ్ళి) కీర్తించుటకు (పోవలెను కాన లేచిరమ్ము.), ఏల్ = ప్రాప్తమై, ఓర్ = అద్వితీయమైన, ఎమ్ = మన యొక్క, పావై = వ్రతము, ఆయ్ = పూర్తియగును (సందియ మెంత మాత్రమును లేదు.)

**వ్యాఖ్య:** ఆరవపాశురము (పాట) నుండి ఇంతవరకు పదిపాశురములలో ఆండాళ్‌తల్లి చెలికత్తెలతోకలసి ఇంటింటికి వెళ్ళి నిద్రించు గోపికలను పేరుపేరు వరుసలతో ప్రబోధించుట గూఢముగా కాననగును. ఈ పాశురములందు ప్రశ్నోత్తరములు మనకు సువ్యక్తమగు చున్నవి. పూర్వము పాశురములలో నిద్రితులను మేల్కొలుపుటమాత్రమే జరిగినది, నిద్రించువారిచ్చు సమాధానములు మన మూహించుకొనవలసి మాత్రమే యుండెను. ఇప్పుడు లోనిగోపిక సమాధానములు గూడ విన వచ్చుచున్నవి. చూడుడు ఈ పాశురమున –

మొదటి పాదము మేల్కొలుపువారిది, రెండవ పాదము నిద్రించు కన్యది. మూడవ పాదము పిలుచువారిది. నాల్గవ పాదము నిద్రించు నామెది. ఐదవ పాదము మేలుకొలుపువారిది. ఆరవ పాదమున మొదటి సగము నిద్రించు పడతిది. మిగతయంతయును మేల్కొల్పువారిదే. ఇట్లు విభజించుకొన్నచో అర్థము సుబోధమగును.

ఏమమ్మా, బాలశుకవాణీ! ఇంకను నిద్ర యేమిటమ్మా! అని యింటివాకిట నిలబడి ఆండాళమ్మ లోన నిద్రించు నామెను ప్రశ్నించినది.

ఇంటిలో మెత్తనిప్రక్కపై యోగనిద్రలోనుండి శ్రీకృష్ణ దివ్య గుణానుభవము చేయుచున్న మగువ సమాధాన మిది –– "అబ్బా, చంపు చున్నా రేమే! న న్నేకాంతముగా, ఆ గోపీమానసచోరుని పాడుకొననిండు. సరే, పదండి వచ్చెదను."

బైటనున్నవారు –– ఆఁ, నీ వాక్చాతుర్యము మే మెఱుగనిదా? మాటలు పేర్చుటలో నిన్ను మించినవా రెవరమ్మా!

లోని యామె –– "ఆ టక్కు టెక్కులు మీ యనుభవములోనివి. కాననే మీ రిట్లు పలుకుచున్నారు. ఇంటిమీదికి దండెత్తికొనివచ్చిపడినది గాక

మీచే మాటలుకూడ పడవలసివచ్చినది గదా! ఇక మీతో నేను గెలువలేను బాబూ! ఎందుకీ వివాదము, పోనిండు! నేనే సర్వసమర్థురాలను, మీరు నోట వ్రేలు పెట్టినను కొఱుకలేనివారు. చాలునా యిక! ఇప్పుడు నేనేమి చేయవలెనో చెప్పుడు" అని గ్రుక్క తిప్పుకొనకుండ శరవర్షము వంటి సమాధానమిచ్చెను.

అప్పుడు బైటిస్త్రీలు -- "శ్రీకృష్ణగుణానుభవము చేయుటకు వటపత్రశాయివద్దకు పోవుచున్న మా గోష్ఠిలో నీవు గూడ చేరవలెనని నిన్ను ప్రార్థించుటకే మేమిచటకు వచ్చినాము. పెద్దగా నీ కభ్యంతర మేమైన నున్న చెప్పుము.

లోని యామె -- అందరును వచ్చినారా?

బైటివారు -- కావలసిన లెక్కించుకొనుము.

అపుడు లోని మగువ తలుపు తెఱచి బైటకు వచ్చి "ఇపుడు మన కర్తవ్యమేమి" అని వారిని ప్రశ్నించెను.

బలిష్ఠమైన కువలయాపీడ మను మదగజమును మట్టుపెట్టిన వాడును, కొండలనుబోలిన కంసాది శత్రుసమూహములను కసిమసంగిన వాడును, అనంత కల్యాణగుణసాగరుడును అగు శ్రీకృష్ణుని స్తుతించి మన వ్రతమును మంగళాంతము చేసికొనవలెను" అని ఆండాళ్ ఆమెకు సమాధానమిచ్చెను.

ఇళజ్గిళియే (బాలశుకవాణీ) ఇట శ్రీమన్మహాభాగవత నిరంతర పరాయణ ప్రవణులగు శ్రీ శుకులవారినామ మవశ్య స్మరణీయమని గోదాదేవి హృదయము.

**శ్లో॥ నిగమకల్పతరోర్గళితం ఫలం**
**శుకముఖా దమృతద్రవసంయుతమ్,**

**పిబత భాగవతం రసమాలయం**
**ముహురహో రసికా భువి భావుకాః!**

**ప॥ వేదకల్పవృక్షవిగళితమై శుక**
**ముఖ సుధాద్రవమున మొనసియున్న**
**భాగవతపురాణ ఫలరసాస్వాదన**
**పదవి గనుఁడు రసికభావవిదులు!**

ఏలయన ఆ శుకమహర్షియే లేనిచో –

**మ॥ లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం**
**జులతా శోభితమున్, సువర్ణసుమనస్సుజ్ఞేయమున్, సుందరో**
**జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాలవాలంబునై**
**వెలయున్ భాగవతాఖ్యకల్పతరు వుర్విన్ సద్విజశ్రేయమై**

అను కీర్తికగ్గమైన సంస్కృతాంధ్ర మహాభాగవతపురాణములను నిధినిక్షేపములు మన కెట్లు దక్కియుండెడివి?

ఇన్న మురజ్ఞుదియో (ఇంకను నిద్రించుచున్నావా)

"కణ్డాల్ సదా పశ్యన్తి యాకైయాలే ఉరక్కమిల్లై."

భగవద్దివ్యమంగళవిగ్రహస్వరూప సందర్శనానంతరము తద్రూప మాధుర్యాస్వాదనమే తప్ప నిద్దురవచ్చుమాట యట్లుండ నిద్రపోవుట యను భావమేని మనసుకు తట్ట నవకాశముండునా? ఇట్టిస్థితిలో నీ వింకను నిద్రించుట యత్యంతాశ్చర్యావహ విషయము గదా, అని కవి హృదయము!

**16. *నాయగనాయ్ నిన్ఱ నన్దగోపనుడైయ**
**కోయిల్ కాప్పానే, కొడిత్తోన్ఱుమ్ తోరణ**

**వాశల్ కాప్పానే, మణిక్కదవ న్దాళ్ తిఱవాయ్,**
**ఆయర్ శిఱుమియఱోము, క్కఱై పఱై**
**మాయన్ మణివణన్ నెన్న లే వాయ్‌నేర్ నాన్,**
**తూయోమాయ్ వన్దోమ్ తుయి లెళ పాడువాన్,**
**వాయాల్ మున్న మున్నమ్ మాత్తాదే యమ్మా, నీ**
**నేశ నిఱైక్కదవమ్ నీక్కే లో రెమ్బావాయ్.**

**టీక:** నాయగన్ + ఆయ్ = (మాకు) నాయకుడై (స్వామియై), నిన్ఱ = (ఇచట) నిలచియున్న, నన్దగోపన్ + ఉడైయ = నందుని యొక్క కోయిల్ = (దివ్య) భవనమును, కాప్పానే = కాపలా కాయువాడా! (రక్షకుడా) కొడి = ధ్వజపటము, తోన్ఱుమ్ = ప్రకాశించునట్టి, తోరణమ్ + వాశల్ = ఇంటికి ప్రధానమగు వాకిలిని, కాప్పానే = కాపాడువాడా! మణి + కదవమ్ + తాళ్ = మణి (నిర్మిత) కవాటముయొక్క గడియను, తిఱవాయ్ = తెరువుమా, ఆయర్‌శిఱుమియరోముక్కు = గొల్ల లేపడుచులమగు మాకు, మాయన్ = ఆశ్చర్యచేష్టలు గల, మణివణ్ణన్ = నీలవర్ణుడు, (శ్రీకృష్ణుడు) నెన్నలే = నిన్ననే, అఱై = (పెద్దగ) మ్రోగు, పఱై = భేరీని, (తప్పెటను) (ఇచ్చెదనని) వాయ్‌నేర్న్దాన్ = వాగ్దానము చేసినాడు, తూయోమ్ + ఆయ్ = పరిశుద్ధులమై, వన్దోమ్ = వచ్చినాము, అమ్మా = స్వామీ! మున్నమ్ + మున్నమ్ = మునుముందు, వాయాల్ = వాక్కుతో, మాత్తాదే = అడ్డుపుల్ల (మాట) మేయకుమా, నేశమ్ + నిలై + కదవమ్ = (భగవత్‌స్నేహమునకు నెలవగు) తలుపును, నీ = నీవే, నీక్కు = (దయతో) తెఱవుమా!

**వ్యాఖ్య:** "గోపకులనాయకుడగు నందుని గృహరక్షకుడా, ధ్వజముచే నొప్పుచున్న తోరణములతో గూడిన ద్వారమును కాపలాకాయువాడా! మాపై దయతో రత్నఖచిత కవాటపు గడియ తెఱవుమా! మేము కపట మెరుగని

గొల్లపిల్లలము. ఆశ్చర్య గుణాకరుడును నీల మేఘనిభాంగుడును నగు కృష్ణస్వామి వ్రతాంగమగు వాద్య విశేషమును మా కిచ్చెదనని నిన్ననే పలికెను. కాన నేతత్ప్రాప్తికై సర్వ పరిశుద్ధులమై వానికి సుప్రభాతము పాడ వచ్చినాము. నీవు మనస్సులో మమ్ములనుగురించి ఏమనుకొన్నను సరే కాని ముందు నోటితోమాత్ర మాటంకపఱుపకుము. నీ కెంతో పుణ్య ముండును. భగవదనుభవమున కాటంకము కల్గించుచున్న యీ తలుపు తెఱచి మమ్ము రక్షింపుము'' అని ఆండాళ్‌గోపిక నందునియింటి ద్వారరక్షకులను ప్రార్థించుచున్నది.

ఈ పాశురము ఈ గ్రంథ విశేషార్థములను తెఱచి చూపు తాళపు చేయి. విస్తార భయముచే కొన్నిమాత్రమే యిట ప్రదర్శితము --

ఇందు ఆళ్వారులకును ఆచార్యులకును నాయకమణివలె మెఱయు చుండు భగవద్రామానుజులవారు ప్రబోధితులని కొందరందురు. అది యెట్లున్నను ఆండాళమ్మ తమ యాచార్యులును పితృదేవులును అగు శ్రీ విష్ణుచిత్తులను ప్రబోధించె ననుటలో విప్రతిపత్తి లేదు. ఈ రీతిగ నిందు సదాచార్యవర్గమంతయు మేల్కొలుపబడుచున్నది.

**తుయిలెళ పాడువాన్** (నిద్రనుండి లేపుటకు) అను దళముచే

శ్లో॥ **భో కృష్ణ, భో మాధవ, భో ముకుంద,**
**భో నందసూనో, భగవన్, మురారే,**
**భోగీంద్ర భోగాత్మకతల్పత స్త్వ**
**ముత్తిష్ఠ, జాగృహ్యనుకంప్యమానః**

- "ఓ కృష్ణా! ఓ మాధవా! ఓ ముకుందా! ఓ నందకుమారా! ఓ మురారీ! భోగీంద్ర (అనంతుని) భోగ (పడగ అను) తల్పము (ప్రక్క) నుండి నెమ్మదిగ లెమ్మా. మా యందు దయ చూపుమా."

అను పద్యార్థ ముద్ద్యోదిత మగుచున్నది.

**వాయ్‌నేర్‌న్దాన్** (మాట యిచ్చెను) అను పద సంగతిచే -

**"శ్లో॥ సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే,**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ."**

- "ఒక్కసారి నీ వాడను అని శరణుజొచ్చిన వాని కెట్టివానికైనను అభయప్రదానము చేయుటయే నా వ్రతము" అను శ్రీరామచంద్రుని శ్రీసూక్తియును -

**"శ్లో॥ ద్యౌః పతేత్ పృథివీ శీర్యేత్ హిమవాన్ శకలీభవేత్,**
**శుష్యేత్తోయనిధిః కృష్ణే! న మే మోఘం వచో భవేత్"**

- "ఓ కృష్ణా! (ద్రౌపదీ) మిన్ను విఱిగి మీదపడినను, పుడమి బీటలు వాఱినను, హిమవత్పర్వతము నుగ్గునుగ్గయినను, తోయధులన్నియు నింకిపోయినను, ప్రపన్నరక్షణ విషయమున నా వాక్కు మాత్రము వ్యర్థము గాదు" అను శ్రీకృష్ణుని వచనమును - అనుసంధేయములు గదా!

**నేశనిలైక్కదవమ్** (స్నేహబంధముగల తలుపు) అనుచోట --

చేతనుల నుద్ధరించుటకై శ్రీ భాష్య భగవద్విషయాది గ్రంథరత్నముల పుటలు విప్పి వానియందలి విశేషార్థములు శిష్యులకు కరతలామలకము చేయుమని కవయిత్రి మనకై సమస్తపూర్వాచార్యులను వేడినా రనియు పలుక నగును.

**17. అమ్బరమే తణ్ణీరే శోఱే యఱఞ్జెయ్యుమ్,**
**ఎమ్బెరుమాన్ నన్దగోపాలా వెళున్దిరాయ్,**
**కొమ్బనా ర్కెల్లామ్ కొళున్దే కులవిళక్కే,**
**ఎమ్బెరుమాట్టి యశోదా యఱివుఱాయ్**

**అమ్బర మూడఱు త్తోఙ్గియుల గళన్ద,**
**ఉమ్బర్ కోమానే యుఱఙ్గా దెళున్దిరాయ్,**
**శెమ్బొ ఱ్కళలడి చ్చెల్వా బలదేవా,**
**ఉమ్బియుమ్ నీయు ముఱ ఙ్గేలో రెమ్బావామ్.**

**టీక:** అమ్బరమే = వస్త్రమును, తణ్ణీరే = నీరును, శోఱే = అన్నమును, అఱమ్ = ధర్మబుద్ధితో, శెయ్యుమ్ = (దానము) చేయు, ఎమ్బెరుమాన్ = మాకు స్వామియైన, నన్దగోపాలా = నందగోపుడా, ఎళుందిరాయ్ = నిద్ర లెమ్మా, కొమ్బు + అనార్కు + ఎల్లామ్ = ప్రబ్బలితీగెవంటి నడుముగల స్త్రీలందరికిని, కొళున్దే = ప్రధానురాలా! కులమ్ + విళక్కే = (గొల్ల) కులమునకు, మంగళదీపమా, ఎమ్ + పెరుమాట్టి = మాకు స్వామినివైన, అశోతాయ్ = ఓ యశోదాదేవీ! అరివురాయ్ = నిద్ర లెమ్మా, అమ్బరమ్ = ఆకాశమునంతయును, ఊడు + అఱుత్తు = మధ్య భేదించుకొని, ఓఙ్గి = పరమపదము వరకు పెరిగి, ఉలగు = లోకములను, అళన్ద = కొలిచిన, ఉమ్బర్ = దేవతలకు, కోమానే = రాజైనవాడా! శెమ్ + పొన్ = ఎఱ్ఱనిసువర్ణమయమగు, కళల్ = పాదాభరణములు దాల్చిన, అడి = శ్రీపాదములుగల, శెల్వా = శ్రీమంతుడవైన, బలదేవా = ఓ బలరామా! ఉమ్బియుమ్ = నీ తమ్ముడు (కృష్ణుడు) ను, నీయుమ్ = నీవును, ఉఱఙ్గేల్ = (ఇక) నిద్రింపకుడు.

**వ్యాఖ్య:** వస్త్రములును, తీర్థప్రసాదములును, బీదలకు దానముచేసెడు మా స్వామి యగునందగోపాలుడా! నిద్రలెమ్మా, లతాంగుల కగ్రగణ్యయును, గోపకుల దీపమును, అస్మత్స్వామియును అయిన యశోదాదేవీ! మేల్కొనుమా, ఆకసమును భేదించుకొని పెరిగి సమస్తలోకములను కొలిచిన దేవాధిదేవుడవగు శ్రీ కృష్ణా! మేల్కొనుము, బంగారు పెండెరము శ్రీపాదమందు గల సంపన్నుడవగు బలరామ స్వామీ! నీ తమ్ముడును నీవును

నిద్రింపక మేల్కొనుడీ” అని ఆండాళమ్మ పల్కుచున్నది.

**కులవిళక్కే** (కులదీపమైనదానా) అను పదము –

**శ్లో॥ ఉల్లాసపల్లవితపాలిత సప్తలోకీ**
**నిర్వాహకోరకిత నేమకటాక్షలీలామ్,**
**శ్రీరఙ్గ హర్మ్యతల మఙ్గళ దీపరేఖాం**
**శ్రీరఙ్గరాజమహిషీం శ్రియమాశ్రయామః**

అర్ధకటాక్షపాతమాత్రముచేతనే జగత్సృష్టికిని సంరక్షణకును, శ్రీరంగనాథునకు ఆ శ్రీరంగనాయకి సాయపడుచుండును. అట్టి కటాక్షముతో ఆయన ఆలయప్రాంగణమున మంగళాకరమగు జంగమ రత్న దీపరేఖవలె ప్రజ్వలించుచున్న యా లోకమాత శ్రీదేవినే మన మాశ్రయించి తరింతము.

– అను శ్రీ గుణరత్నకోశ శ్లోకార్థమునకు జ్ఞాపకము.

ఓఙ్గియులకళన్ద (విజృంభించి లోకములను కొలిచిన) అని పదత్రయముచే త్రిలోకిని కొలిచిన శ్రీహరి యవతారవైభవమును ఆంధ్రమహాభాగవత మెంత గొప్పగ వర్ణించినది!

**శా. ఇంతింతై వటుఁడింతయై మఱియుఁదానింతై నభోవీథిపై**
**నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**
**నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై**
**నంతై సత్యపదోన్నతుం డగుచుఁబ్రహ్మాండాంత సంవర్ధియై**

**ప. రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై**
**శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణకేయూరమై**
**ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర**
**ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్.**

ఈ గ్రంథాదిని ప్రథమ తనియన్‌లో శ్రీ పరాశర భట్టర్‌వారు "శ్రుతిశతశిరస్సిద్ధమగు పారతంత్ర్యము నీమె యా జగత్పతికే అధ్యాపనము చేయుచున్నా" రన్నారు గదా! అట్టి వేదప్రతిపాద్య సూక్తానువాద భాగములు గూడ నీ రత్నఖనిలో వెదకిన కొలదియు వెలువడుచుండును!

**ఓఙ్గియులగళన్ద** అను పైపద్యము నర్థము ఆ యా వేదభాగములని మనము తెలిసికొన్ననాడు వేదమాతనుబోలిన యీ యాముక్తమాల్యదా దేవిపై మన శ్రద్ధాభక్తు లినుమడింపక మానవు. పరిశీలింపుడు వీనిని --

1. త్రీణిపదా విచక్రమే విష్ణుర్గోపాఽదాభ్యః (ఋగ్వేదము)

2. ఇదం విష్ణు ర్విచక్రమే త్రేథా నిదధే పదమ్ ( " )

ఈ మంత్రములు సుప్రసిద్ధములు గదా!

**18. ఉన్దు మదగళిత్త నోడాద తోళ్‌వలియన్,**
**నన్ద గోపాలన్ మరుమగళే నప్పిన్నాయ్,**
**కన్ద ఙ్గమళుమ్ కుళలీ కడై తిఱవాయ్**
**వన్దెఙ్గుమ్ కోళి యళైత్తనగాణ్, మాదవి**
**ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలినఙ్గళ్ కూవినగాణ్,**
**పన్దార్ విరలి యున్ మైత్తునన్ పేర్ పాడ,**
**శెన్దామరైక్కైయాల్ శీరార్ వళై యొలిప్ప,**
**వన్దు తిఱవాయ్ మగిళ్ న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** మదమ్ = మదజలము, ఉన్దు = స్రవించుచున్న, కళిత్తన్ = గజముబోలి, ఓడాద = వెన్నుచూపని, తోళ్‌వలియన్ = భుజబలముగల, నందగోపాలన్ = నందుని, మరుమకళే = కోడలా, కన్దమ్ = (సు) గంధము, కమళుమ్ = వ్యాపించుచున్న, కుళలీ = కేశబంధముగల, నప్పిన్నాయ్ = ఓ నీళాదేవీ! కడై = గడియ, తిరువాయ్ = తీయుమా, కోళి = కోళ్ళు, వన్దు = వచ్చి,

(గుమికూడి) ఎజ్జుమ్ = ఎల్లెడలను, అళైత్తనకాణ్ = కూయుచున్నవి, మాదవి + పన్దల్‌మేల్ = బండిగురివింద పందిరిమీద, కుయిల్ + ఇనజ్గళ్ = కోయిలలగములు, పల్‌కాల్ = పలుమార్లు, కూవినకాణ్ = కూయుచున్నవి, పన్దు + ఆర్‌విరలి = బండినిపట్టుకొన్న (చేతి) వ్రేళ్ళుగల ఓ యమ్మా!, ఉన్‌మైత్తునన్‌పేర్ = నీ భర్తనామములు, పాడ = (మేము) గానముచేయుటకై, వన్దు = (నీవు నడచి) వచ్చి, శీర్ + ఆర్ = సౌందర్యము నిండిన, వళై = (హస్తములందలి) వలయములు (కరకంకణములు), ఒలిప్ప = (గల్లుగల్లున) మ్రోగుచుండగా, శెమ్ + తామరై + కైయాల్ = కెందామరనుబోలు చేతితో, మగిళ్న్దు = (మిక్కిలి) ఉత్సాహముతో తిఱవాయ్ = (తలుపు గడియ) తీయుమా!

**వ్యాఖ్య:** ఆండాళమ్మ తోడి గోపికలతో నందగోపుని సుందర భవనాంగణమున ప్రవేశించి తలుపు తెరువుడని ప్రార్థించినది. ఆయన కదలలేదు. తరువాత బలరామకృష్ణులను లేచి రమ్మని పిలచినది. వారేమి తక్కువ తిన్నారా? వారును ఉలుకలేదు, పలుకలేదు. అప్పు డామె శ్రీకృష్ణుని పట్టపురాణి నీళ నిట్లు ప్రబోధించుచున్నది –

"నందుడు మహాభుజపరాక్రమములు గలవాడు. మదజలము ధారలు గట్టుచున్న ఏనుగులుగూడ బలమున నాతనికి సాటిరావు. అట్టి మహాబలుని కోడలగు నీళాదేవీ! నీ కేశపాశమునందలి సుగంధము గుప్పుమని దశదిశలందును వ్యాపించుచుండగా ఇంకను నీవు నిద్రించుట తగునటమ్మా! వచ్చి తలుపు తెరువు. చూడు, నాల్గుపైపులను చేరి "ఓ జనులారా! కాలకృత్యములు చేసికొను వేళయినది లెండు లెండ" ని కోళ్ళు కూయుట మీ చెవిని పడుటలేదా! అంతేగాదు, బండిగురివెందతీగెల పందిళ్ళమీద నెక్కి కోకిలలు చేయు రొదలుగూడ మీకు వినబడుట లేదా? ఏ మాశ్చర్యము! నీవు అందమైన నీ చేతివ్రేళ్ళతో బంతి పట్టుకొని ఆడు సమయముగూడ

అగుచున్నది. లేచి రావమ్మా! మే మందరము నీ భర్త అగు శ్రీకృష్ణుని గానముచేయుట కెంతో తమితో వచ్చినాము. నీవుగూడ ఉత్సాహమురకలు వేయుచుండగా వచ్చి, తలుపు తెరచి లోకసంగ్రహార్థము మేము చేయు నీ వ్రతమున సహకరించి పుణ్యము కట్టుకొమ్మా, మా యమ్మా!"

ఈ పాశురము భగవద్రామానుజులవారి కత్యంత ప్రియమట! భిక్షాటనము చేయుచు నొక దినమున వారు మహాపూర్ణులవాకిట నీ పద్యము ననుసంధించుచుండగా వారి పుత్రిక అత్తుళ్ళాయమ్మ వచ్చి తలుపు తెరచె నట!! నీళాదేవియే వచ్చి తలుపు తెరచినట్లు భావపరవశు లయి యతిపతి యటనే కొంతసేపు నిలబడిపోయిరట!!!

అహో! ఎట్టి మధురస్మృతి!

**వన్దెఙ్గుమ్ కోళి యళైత్తనకాణ్** (కోళ్ళు అంతట కూయుచున్నవి) శిష్యులు తమ తోడివారిని, గురువులను నిద్రలేపుట యిట ధ్వని గమ్యము.

శ్రవణసుభగముగ తమ మధుర కంఠములతో సదాచార్యులు సచ్ఛాత్రులకు వేదాంతబోధ చేయుచుండుట – "కుయిలినఙ్గళ్ కూవిన కాణ్" (కోకిలలు కూయుచున్నవి) అనుటచే సూచితము.

"శీరార్ వళై యొలిప్ప" కరకంకణములు (మ్రోగగా) అనుటచే వివిధ భావబోధకములగు ధ్వన్యర్థములు మనకు ప్రతీయమాన మగుచున్నవి. విస్తారభీతిచే మరికొన్ని యర్థములు వదలుట యయినది.

**19. కుత్తువిళ క్కెరియ క్కోట్టుక్కాల్ కట్టిల్‌మేల్,**
**మెత్తెన్ఱ పఞ్చశయనత్తిన్ మే లేఱి,**
**క్కొత్తలర్ పూఙ్గుళల్ నప్పిన్నై కొఙ్గైమేల్,**
**వైత్తు క్కిడన్ద మలర్ మార్పా, వాయ్ తిఱవాయ్,**

**మైత్తడఙ్గణ్ణినాయ్ నీ యున్ మణాళనై,**
**ఎత్తనైపోదుమ్ తుయి లెళ వొట్టాయ్‌గాణ్,**
**ఎత్తనై యేలుమ్ పిరి వాత్తగిల్లాయాల్,**
**తత్తువ మన్రు తగ వేలో రెమ్బావాయ్.**

**టీక:** కుత్తువిళక్కు = దీపస్తంభములందలి దీపములు, ఎరియ = ప్రకాశించుచుండగా, కోడు + కాల్ = ఏనుగుదంతపు కాళ్ళు (కోళ్ళు) గల, కట్టిల్‌మేల్ = మంచముమీద, మెత్తెన్న = మెత్తని, పఞ్చశయనత్తిన్‌మేల్ = ఐదుగుణములుగల (హంసతూలికా) తల్పముమీద, ఏరి = అధిష్ఠించి, కొత్తు = గుత్తులు (గుత్తులు) గా, అలర్ = వికసించిన, పూ + కుళల్ = పూవులతో (నొప్పుచున్న) కేశభారముగల, నప్పిన్నై కొజ్గై = నీళాదేవి స్తనములను, మేల్ = మీద, వైత్తు = ఉంచుకొని, కిడైన్ద = (పవళించి) ఉన్న, మలర్‌మార్‌పా = విశాల వక్షము గలవాడా, వాయ్ తిఱవాయ్ = నోరు తెరువుమా! మై = కాటుక పెట్టుకొని, తడమ్ = విశాలమయిన, కణ్ణినాయ్ = నేత్రములు గల్గి, పిరివు = (కృష్ణ) వియోగమును, ఎత్తనై యేలుమ్ = క్షణకాల మయినను, ఆత్తకిల్లాయ్ = సహింపజాలని ఓ నప్పిన్నైపిరాట్టీ, నీ = నీవు, ఉన్ = నీ యొక్క, మణాళనై = ప్రియుని, ఎత్తనైపోదుమ్ = ఒక క్షణమేని, తుయిల్ = నిద్రనుండి, ఎళవొట్టాయ్ కాణ్ = లేవనీయకున్నావు, తత్తువమ్ = (ఇది) నీకు తత్వము (స్వరూపము,) అన్రు = కాదు, తగవు = (నీ స్వభావమునకు) తగినది, (అన్రు = కాదు)

**వ్యాఖ్య:** వలసినచోటికి కొనిపోదగినట్లు దీపస్తంభములు నిండుగా వెలుగుచున్నవి. దంతపుకోళ్ళుగల హంసతూలికా తల్పమున నీళాకృష్ణులు శయనించి ఉన్నారు. ఆ శయనమునకు పంచశయనము అనిపేరు. అందము, చల్లదనము, మెత్తదనము, తెల్లదనము, సువాసన అను ఐదు

గుణములు గల మంచమే పంచశయనము. దానిపై నీళాదేవి యున్నదిగదా! ఆమె శిరసున దాల్చిన పూలమాలలు తీగెనంటుకొని యున్నట్లుగనే వాడకుండ నుండి సహజసౌరభము వెదజల్లుచున్నవి. ఆమె స్తనములు శ్రీ కృష్ణుని విశాలవక్షమును కప్పివేసియున్నవి. అట్టి స్థితిలో ఒడలు తెలియకుండు రీతిగ కాంతాకుచాలింగనసుఖమత్తుడైన యా శ్రియఃపతికి గోదాదేవి పిలుపు వినబడుట యెట్లు? ఒకవేళ వినబడి లేవబోయినను వృక్షమును లతవలె పెనవేసికొనియున్న నప్పిన్నైపిరాట్టి ఆయనను గట్టిగ అదుముకొనును గాని లేవనిచ్చునా?

అంతే యయినది. శ్రీకృష్ణుడు లేవలేదు. గోపికలకై తలుపు తియలేదు. అపు డాముక్తమాల్యద యిట్లనుచున్నది. "ఏమమ్మా, శ్రీకృష్ణసంశ్లేషము నీ వొక్కతెవే యనుభవించుట తగునా? మా యందరి పనియు నేమి కావలెను? భర్తను వీడి రాజాలకపోయినమానె. నోరు తెరచి లెక్క కొక్క పలుకేని పలికి మా కూరట కల్గించిన నీకు పాపము చుట్టుకొనునా యేమి?"

ఈ మాటలకు మెత్తపడి శ్రీకృష్ణుడు వారికి సమాధానము చెప్పుటకు నోరు తెరవబోగా నీళాదేవి టక్కున నాతని నోటికి తన చేయి యడ్డము పెట్టెను.

ఇది కిటికీగుండ చూచిన గోపిక లిట్లనుచున్నారు – "కన్నులకు కాటుక పెట్టుకొని సింగారించుకొన్న యో పడుచుపిల్లా! కాటుక పెట్టుకొనని మా కన్నులు శ్రీకృష్ణునకై ఎంత వాచిపోవుచున్నవో! ఆయనను రానీయక పోయినను నీవైన కొంచెము వచ్చి చూడుము. నీ విట్లు చేయుట నీ స్వరూపస్వభావములకు పూర్తిగ విరుద్ధము సుమా! ఇది నీకు తగవు గాదు. ఆలోచించుకొనుము, దయతో శ్రీకృష్ణసంశ్లేమున మేము గూడ నీతో పాలు పంచుకొని ధన్యులమగుట కవకాశ మనుగ్రహింపుము."

మేలేరి (మీదనెక్కి) "తంపాదేనాధ్యారోహతి" ఆ భగవంతుని జేరిన ముక్తపురుషుడు తన కాలితో ఆయన నెక్కి త్రొక్కుట యనునదే గదా బ్రహ్మానందము! ఇది శ్రుతి సూక్తి సుడీ! ఇట్టి స్థితిని ఆండాళమ్మ కోరుటలో తప్పేమి!! ఇదియే గదా పర్యంక విద్య!!!

వాయ్ తిఱవాయ్ (నోరు తెరువుమా) ఆచార్యా! జ్ఞానోపదేశము చేయుమా అని గూడ అర్థము తీయనగును.

**"శ్లో॥ అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా,**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః"**

జ్ఞానాంజన శలాకచే నజ్ఞానతిమిరాంధుల చక్షువులను తెఱపించు వాడు గదా గురువు!

మైత్తడజ్ఞణ్ణినాయ్ (కాటుక కండ్లు కలదానా) అనునది –

**క. మీరలు మీయది యనునది**
**వేఱు మొదలు నూడఁబెరికి విశ్వేశ్వరునిన్**
**జేరుఁడి, ఆత్మలకంతకు**
**మీరిన ఆధిక్యమేది? మేలొందఁగూర్చున్**

అను శఠకోపమహర్షి శ్రీసూక్తినే యనువదించును గదా!

**20. ముప్పత్తుమూవ రమరర్కు మున్ శెన్ఱు,**
**కప్ప న్తవిర్కుమ్ కలియే తుయిలెళాయ్,**
**శెప్ప ముడైయాయ్ తిఱలుడైయాయ్, శెత్తార్కు**
**వెప్ప ఙ్గొడుక్కుమ్ విమలా తుయి లెళాయ్,**
**శెప్పన్న మెన్ములై చ్చెవ్వాయ్ చ్చిఱుమరుఙ్గుల్,**
**నప్పిన్నై నఙ్గాయ్ తిరువే తుయి లెళాయ్,**

**ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్ మణాళనై,**
**ఇప్పోదే యెమ్మై నీరా ట్టేలో రెమ్బావాయ్**

**టీక:** ముప్పత్తుమూవర్ = ముప్పది మూడువిధములగు, అమరర్క్కు = దేవతలకు, మున్ = (ఏకష్టమును రాక) ముందే, శెన్టు = పోయి, కప్పమ్ = వారికంపమును (భీతిని), తవిర్క్కుమ్ = పోగొట్టునట్టి, కలియే = బలిష్ఠుడా! తుయిల్ + ఎళాయ్ = నిద్రనుండి లెమ్మా, శెప్పమ్ = ఋజుత్వము, ఉడై యాయ్ = కలవాడా, తిఱల్ = సామర్థ్యము, ఉడై యాయ్ = కలవాడా, శెత్తార్కు = శత్రువులకు, వెప్పమ్ = తాపమును, కొడుక్కుమ్ = కల్గించు, విమలా = నిర్మలుడా, తుయిల్ = నిద్ర, ఎళాయ్ = లెమ్మా, శెప్పు + అన్న = కలశములవంటి, మెన్ + ములై = మృదువగు స్తనములను, శెవ్వాయ్ = పగడమువంటి క్రీ బెదనిని, శిఱు = సన్నని, మరుఙ్గల్ = నడుమును, నప్పిన్నై = నప్పిన్నై యను పేరునుగల, నఙ్గాయ్ = పూర్ణురాలా, తిరువే = శ్రీమహాలక్ష్మినిబోలినదానా? తుయిల్ = నిద్రనుండి, ఎళాయ్ = లేచి, ఉక్కముమ్ = (నోముకై) విసనకఱ్ఱయును, తట్టొళియుమ్ = కంచు అద్దమును, తన్దు = ఇచ్చి, ఉన్మణాళనై = నిత్యకల్యాణపురుషుడగు నీ పతిని, ఎమ్మై = మమ్మును, ఇప్పోదే = ఇపుడే, నీర్ + ఆట్టు = స్నానము చేయింపుమా!

**వ్యాఖ్య:** "ముప్పదిమూడుకోట్ల దేవతలకును ముందుగా వెళ్ళి వారి భయమును పోగొట్టు మహాబలవంతుడా! నిద్ర లెమ్ము! ఆశ్రితరక్షాదీక్షితుడా. శత్రువులకు దుఃఖము కల్గించు నిర్మలుడా! నిదుర లెమ్మా" అని గోదాదేవి శ్రీకృష్ణుని నిదుర లేపినది. ఆయన పలుక నందున నప్పిన్నైపిరాట్టిని లేపుచున్నది – "కలశములను బోలిన మృదువైనస్తనములను, ప్రవాళాధరమును, సన్నని నడుమును పరిపూర్ణావయవ సౌందర్యమును గల నీళామహాలక్ష్మీ! నిద్ర

లెమ్మా! విసనకఱ్ఱను అద్దమును ఇచ్చి నీ నాయకునితో మమ్ములను ఇపుడే స్నానము చేయింపుము”.

దేవతలు లెక్కింప నలవి కానివారు గదా! ముప్పదిముగ్గురు దేవతలని యెట్లు పలుకుట యనగా నిది సమాధానము – అష్టవసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, అశ్వినీదేవత లిద్దరు – ఈ దేవతలను ప్రధానముగా పేర్కొందురు.

నందుని పరిపాలనలో సుభిక్షముగనున్న యీ గోపికల కేమి ప్రమాదము వచ్చినదని శ్రీకృష్ణుని శరణుజొచ్చినారో ఈ పద్యభావము తెలుపును –

**ఉ. బంధుల బిడ్డలన్ మగల భ్రాతలఁ దల్లులఁదండ్రులన్ మనో**
**జాంధతఁజేసి డించి శరణందిన మమ్ము వియోగదుర్దశా**
**సింధువులోనఁ ద్రోచి యిటు చేరకపోవుట పాడి గాదు; పు**
**ష్పంధయ, మా యధీశునకుఁ బాదములంబడి యొత్తి చెప్పవే!**

ఓ కృష్ణా! మహాబలవంతులును అమరులును నగు దేవతలు నిన్ను దరి జేరునపుడు కాపాడుచుందువు గదా! అబలల మగు మమ్మిట్లు వియోగ దుర్దశాసింధువున దిక్కు తెలియని రీతిగా వదలివేయ న్యాయమా అని వారా త్రిలోకరక్షకుని ప్రశ్నించుట యుక్తమే గదా!

శెప్పముడైయాయ్ (ఆర్జవవంతుడా) అనుటచే శ్రీకృష్ణుడు ద్రౌపదిమానమును అక్షయవస్త్రదానముచే కాపాడిగూడ పశ్చాత్తాపము చెందిన విధము సూచితము –

**శ్లో॥ గోవిందేతి యదాఽక్రన్దత్ కృష్ణా మాం దూరవాసినమ్,**
**ఋణం ప్రవృద్ధ మివ మే హృదయాన్నా పసర్పతి.**

కృష్ణ (ద్రౌపది) ఎంతోదూరమునుండి "గోవిందా! యని ఆక్రందించినది గదా! వడ్డీ పేరుకొని తడిసి మోపెడై బాధించు ఋణమువలె నామె దీనాక్రందనము నా హృదయమున మాటిమాటికి సెలవేయుచున్నది. అబ్బా! ఏమి చేయ నగును! అని శ్రీకృష్ణు డనలేదా!

శెత్తార్కు వెప్పమ్ కొడుక్కుమ్ (శత్రువులకు కంపము కల్గించు) అనుటచే అజాతశత్రువగు నారాయణునకు తన భక్తుల శత్రువులే తన శత్రువులని – వారిని హతమార్చుటకు వెనుదీయడని – సాధులహృదయమే ఆయనదని – అంబరీషుని కథ ననుసంధించు కొనుటచే బోధపడును.

**21. ఏత్త కలఙ్గ ళెదిర్ పొఙ్గి మీదళిప్ప,**
**మాత్తాదే పాల్ శొరియుమ్ వళ్ళల్ పెరుమ్బశుక్కళ్,**
**ఆత్తప్పడైత్తాన్ మగనే యఱివుఱాయ్,**
**ఊత్తముడై యాయ్ పెరియా, యలగినిల్,**
**తోత్తమాయ్ నిన్ఱ శుడరే తుయిలెళాయ్,**
**మాత్తా రునక్కు వలి తొలై న్దున్‌వాశఱ్కణ్,**
**ఆత్తాదువ న్దున్నడి పణియుమాపోలే,**
**పోత్తియామ్ వన్దోమ్ పుగళ్ న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** ఏత్త = పట్టిన, కలఙ్గళ్ = భాండములు, ఎదిర్ = ఎదురుగా, పొఙ్గి = పొంగి, మీదు = పైకి, అళప్ప = పొరలునట్లు, మాత్తాదే = ఎడతెగక, పోల్ = పాలు, శొరియుమ్ = వర్షించునట్టి, వళ్ళల్ = ఈవిగల, పెరుమ్ = బలసియుండు, ఆత్త = లెక్క లేనన్ని, పశుక్కళ్ = పశువులను, పడైత్తాన్ = పడసినవానియొక్క, మకనే = పుత్రుడా! అఱివు + ఉఱాయ్ = నిద్రలెమ్మా, ఊత్తమ్ = (వేదప్రతిపాద్యత) అను దార్ఢ్యము, ఉడైయాయ్ = కలవాడా! ఉలకినిల్ = లోకమున, తోత్తమ్ + ఆయ్‌నిన్ఱ = (ఆశ్రితపక్షపాతము)

తోచునట్లు (అవతరించి) నిలచిన, శుడరే = తేజోరూపుడా! తుయిల్ + ఎళాయ్ = నిద్ర లెమ్ము, మాత్తార్ = శత్రువులైనవారు, ఉనక్కు = నీకు, వలి = (తమ) బలము, తొలైన్దు = తొలగి (ఉడిగి) పోయి, ఉన్ + వాశల్కణ్ = నీ యొక్క వాకిటను, ఆత్తాదు = సహింపక, వన్దు = వచ్చి, ఉన్ + అడి = (నీ) శ్రీపాదములందు, పణియుమ్ + ఆపోలే = పడునట్లు, పుగళ్న్దు = పొగడుచు, పోత్తు = మంగళారతి పాడుచు, యామ్ (దాసులమైన) మేము, వన్దోమ్ = వచ్చి (నిన్నాశ్రయించి) నాము.

**వ్యాఖ్య:** "పెట్టిన కుండలన్నియు నిండి పొర్లునట్లు విడువకుండ పాలిచ్చునట్టి ఔదార్యసంపదగలవి గోకులమందలి గోవులు. అట్టి గోసంపదను వర్ణనాతీతముగా బడసిన మహాధనుడు గదా నందుడు; ఆ నందగోపుని సుపుత్రుడైన శ్రీకృష్ణస్వామీ! మాకై నిదుర లెమ్మా! లోకవృత్తమునకు ప్రమాణమైన వేదములే నీ మహిమ తెలిసికొనలేక పోయినవన్న మేమెంత వారము! శత్రుదుస్సహమగు ప్రతాప ప్రకాశములు సహజ కవచ కుండలములుగా నవతరించిన శ్రీ గోపాలచూడామణీ! మేల్కొనుమా, నీ కోడిపోయిన శత్రువులు, కృపార్థులై నీ వాకిట పడిగాపులు పడియుండునట్లే మేముగూడ త్వద్గుణసంపద్బద్ధులమై మంగళారతి నీ కీయ వచ్చినాము. అనన్యశరణ్యుల మైన మమ్ము కరుణించి నీ శరణాగతత్రాణ బిరుదాంక మును నిలుపుకొనుమా" అని గోదాదేవి స్వామిని ప్రార్థించుచున్నది.

వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్ (ఔదార్యముగల గొప్ప పశువులు) అనుట శిష్య హృత్తాపహారు లగు గురువుల సహజవాత్సల్యోదార భావసంపదను సూచించును.

**శ్లో॥ గురవో బహవస్సన్తి శిష్యవిత్తాపహారకాః,**
**దుర్లభోఽస్మిన్ గురుర్లోకే శిష్యహృత్తాపహారకః**

శిష్య విత్తాపహారమునకై సిద్ధముగనుండు గురువులకు కొదువ ఎప్పుడును లేదు. శిష్య హృత్తాపహారకుడగు గురువెప్పుడును దుర్లభుడే గదా! ఆ గురువు ముఖకమలమునుండి భగవదుపదేశామృతమధువు అయత్నముగనే స్రవించి కవితారూపమున ప్రవహించి హరిభక్తి ప్రియంభావుకుల హృదయకేదారములను సాగుచేసి యందు త్రివిధ పురుషార్థవిశిష్టమగు మోక్షఫలమును పండించును. అట్టి సదాచార్యుని కవితయే కవిత!

ఉన్నత ధారుణీధ్ర శిఖరోత్పత దచ్ఛపయస్వినీఝరీసన్నిభ మైన తన సత్కవిత నాతడు భగవదభిరుచిపరముగనే రచించును గదా! అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత పాన విశేషమత్తచిత్తుడై హరిస్వరూపు డగు నా నరకేసరిచే లోకులితర మేమి యాశించినను నట్టివారు వ్యర్థులును విధి వంచితులును కాకమానరు!

శుడరే (తేజోరూపుడా) అను పలుకు –

**శ్లో॥ అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్,**
**పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్.**

"తమ కోసమే మానవశరీరము దాల్చిన నా పరతత్వ మెరుగలేక మూఢులు నన్నవమానించి నరకకూపమున బడుదురు."

– అను గీతాచార్యుని సదుక్తి నుద్ధరించును.

**22. అఙ్గణ్ మా ఞాలత్తరశ రబిమాన,**
**బఙ్గమాయ్ వన్దు నిన్ పళ్ళిక్కట్టిత్కీళే,**
**శఙ్గ మిరుప్పార్పోల్ వన్దు తలై ప్పెయ్దోమ్,**
**కిణ్గిణి వాయ్ చ్చెయ్దద తామరై ప్పూప్పోలే,**

**శెజ్గణ్ శిఱుచ్చిఱిదే యెమ్మేల్ విళియావో,**
**తిఙ్గళు మాదిత్తియను మెళున్దాప్పోల్,**
**అఙ్గ ణిరణ్డు ఙ్కొ ణ్డెఙ్గళ్ మేల్ నోక్కుదియేల్,**
**ఎఙ్గళ్మే ల్చాబ మిళ న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** అమ్ = సుందరమై, కణ్ = విశాలమై, మా = గొప్పదైన, ఞాలమ్ = భూమిని (పాలించిన), అరశర్ = రాజులు, అభిమాన బంగమ్ + ఆయ్ = తమ అభిమానము (గర్వము) భంగమై, వన్దు = వచ్చి, ఉన్ = నీ యొక్క, పళ్ళిక్కట్టిల్‌కీశే = సింహాసనముక్రింద, శఙ్గమ్ = సంఘముగా (చేరి), ఇరుప్పార్‌పోల్ = ఉన్నట్టి, వన్దు = (మేము) వచ్చి, తలై + పెయ్‌దోమ్ = (నిన్ను) సమీపించితిమి, కిఙ్గిణివాయ్ + శెయ్‌త = చిఱుగజ్జెలవలె కొంచెము వికసించిన, తామరై + పూ + పోలే = తామరపూవువలె, శెమ్ + కణ్ = కెందామరలవంటి కనులను, శిఱు + శిఱిదే = కొంచెము కొంచెముగా, ఎమ్మేల్ = మా మీద, విళియావో = ప్రసరింప చేయవా? తిఙ్గళ్‌మ్ = చంద్రుడును, ఆదిత్తియనుమ్ = సూర్యుడును, ఎళున్దాప్పోల్ = ఉదయించినట్లు, అమ్ = అందమైన, కణ్ + ఇరణ్డుమ్ = కొణ్డు = నేత్రద్వయముతో, ఎఙ్గళ్‌మేల్ = మా మీద, నోక్కుదియేల్ = కటాక్షించినచో, ఎఙ్గళ్‌మేల్ = మాకున్న, శాబమ్ = శాపము (వ్యసనము), ఇళిన్దు = (తొలగి) నశించును.

**వ్యాఖ్య:** స్వామీ! ఈ సువిశాల సుందరపృథ్విని పరిపాలించిన మహాచక్రవర్తు లెల్లరును తమ యహంకారమమకారముల నణచుకొని దేవర సింహాసనము సమీపమున సాధువైన మేకలమందవలెనే గుంపులుగూడి మీ కడగంటిచూపు తమపై నెప్పుడు పడునా యని యెదురు చూచుచుందురు.

గుణములకు వారితో పోలిక లేకున్నను ఆర్తితో వారిని పోలిన మేము మీ సన్నిధికి శరణార్థులమై వచ్చినాము. కాన సూర్యచంద్రులను బోలిన నీ

నయనయుగళిని సగము సగముగా తెఱచి మమ్ము కటాక్షించినను మా పంట పండును. మా పాపములు భస్మమయి మాకున్న కష్టములన్నియు గట్టెక్కిపోవును. కాన స్వామీ! నీవు మమ్మనుగ్రహింపక తప్పదు సుమా!

**అబిమానబంగ మాయ్ వన్దు, తలై ప్పెయ్‌దోమ్**

(మా గర్వాహంకారములు నశించి నిన్ను శరణు జొచ్చినాము.) అనుచోట నీ భాగవత పద్యభావము అచ్చముగ నీ గోపికలదే గదా!

**ఉ. క్రమ్మి నిశాచరుల్ సురనికాయములన్ వడిఁదాకి వీఁక వా**
**లమ్ముల తెట్టెముల్ వఱుప నడ్డము వచ్చి జయింతు వంద్రు నిన్**
**నమ్మిన ముగ్ధలన్, రహితనాథల, నక్కట! నేడు రెండుమూ**
**దమ్ములయేటు కాఁడెగువ నడ్డము రాఁదగదే, కృపానిధీ!**

**ఎజ్గళ్ మేల్ శావమ్** (మాకు తగిలిన శాపము)

భగవద్విరహమే గదా వీరికి తగిలిన శాపము!

**23. మారి మలై ముళఞ్జిల్ మన్ని క్కిడ న్దుఱజ్గుమ్,**
**శీరియ శిజ్గ మఱివుత్తు త్తీ విళిత్తు,**
**వేరి మయిర్ పొజ్గ వెప్పాడుమ్ పేర్ న్దుదఱి,**
**మూరి నిమిర్ న్దు ముళజ్గి ప్పుఱప్పట్టు,**
**పోదరు మాపోలే నీ పూవైప్పూ వణ్ణా, వున్**
**కోయిల్‌ని న్ఱిజ్గనే పోన్దరుళి, కోప్పుడైయ,**
**శీరియశిజ్గాశన త్తిరున్దు, యామ్‌వన్ద**
**కారియ మారాయ్ న్దరు ళేలో రెమ్బావాయ్.**

**టీక:** మారి = వర్షాకాలమున, మలై = కొండయొక్క, ముళఞ్జిల్ = గుహలో, మన్ని = సుఖముగా, కిడన్దు = పడుకొని, ఉఱజ్గుమ్ = నిద్రపోవుచున్న,

శీరియ = శౌర్యముగల, సింగమ్ = సింహము, అఱివుత్తు = నిద్రలేచి, తీ = అగ్ని కణములు రాలునట్లు, విళిత్తు = చూచి, వేరి = పరిమళము గల, మయిర్ = జూలు, పొజ్గ = నిక్కబొడుచుకొనునట్లు, ఎప్పాడుమ్ = నలుదిక్కులకును, పేరిన్దు = శరీరము సాగదీసి, ఉదఱి మూరినిమిర్న్దు = మత్తు వదలునట్లు (మీది దుమ్ము) దులుపుకొని, ముళజ్గి = గర్జించి, పుఱప్పట్టు = బయలుదేరి, పోదరుమాపోలే = వచ్చినట్లుగనే, పూవై + పూవణ్ణా = అవిసెపూవువంటి (నీలపు) వన్నెగల స్వామీ, నీ = నీవు, ఉన్ = నీ యొక్క, కోయిల్ నిన్టు = పడకటింటినుండి, ఇజ్గనే = ఈ రత్న మంటపమునకు, పోన్దరుళి = విచ్చేసి, కోప్పు + ఉడైయ = జయప్రదమైన, శీరియ = (శ్రేష్ఠమైన), సింగాసనత్తిల్ = సింహాసనమున, ఇరున్దు = అధిష్ఠించి, యామ్ = మేము, వన్ద = (నీ వద్దకు) వచ్చిన, కారియమ్ = కార్య (విశేష) మును, ఆరాయ్న్దు = విచారించి, అరుళ్ = కటాక్షింపుము.

**వ్యాఖ్య:** వర్షాకాలమున పర్వతగుహలో హాయిగా ఒడలు మరచి నిద్రించును మృగరాజు సింహము. అది మేలుకొనగనే భయంకరముగ చూచి మెడమీద జూలునుండి పరిమళము వెలువడుచుండగా నలుప్రక్కల తిరిగి ఒడలు దులుపుకొని సాగదీసికొని గుహనుండి బైటకు వచ్చి తన యాశ్రితమృగముల కార్యములు తీర్చును. ఆ మృగరాజువలెనే అతసీపుష్ప సంకాశ శరీరాభగల నీవును నీ గృహాంతరసీమనుండి బైటకు వచ్చి జయశీల మగు నీ సింహాసనము నధిష్ఠించి మా కష్టములు విచారించి తగు పరిహారము ననుగ్రహింపవలెను సుమా!

మలై ముళ రజిల్ (పర్వత గుహలో)

వేదమున ధర్మసూక్ష్మములు వివరించు భాగమే గుహ.

**"శ్లో॥ శ్రుతిర్విభిన్నా స్మృతయశ్చ భిన్నా**
**నైకో మునిర్యస్య మతం ప్రమాణమ్.**

**ధర్మస్య తత్వం నిహితం గుహాయాం**
**మహాజనో యేన గతః స పన్థాః."**

శ్రుతులు వేరు, స్మృతులు మరొక తీరు. పోనీ యేముని మతమైన ప్రమాణముగా ననుసరింతమన్న వారి సంఖ్య యనంతము. ధర్మతత్వము గుహలో గలదు (అగమ్యము). కాన మహాజనుడు (శ్రేష్ఠుడు) పోయిన (అనుష్ఠించిన) మార్గమే అనుసరణీయము.

(మయిర్‌పొంగ) (జూలు నిక్కబొడుచుకొని) అనుచోట శ్రీరాముడు సీతాదేవి తొడపై శిరసుంచి నిద్రించుచుండగా దుర్బుద్ధితో దేవేంద్ర పుత్రుడు జయంతు డా తల్లిస్తనప్రదేశమును తన ముక్కుతో చీల్చెను. వెంటనే ఉష్ణరక్తపు బిందువొకటి మీదపడి పడగవిప్పిన త్రాచువలె బుసకొట్టుచు లేచి యా నరకేసరి యిట్లు గర్జించెను – "ఎవడు నీ స్తన ప్రదేశమును తాకినది? పఞ్చశిరస్కు డగు ఫణిపతితో నెవ డా చెరలాట లాడవచ్చినది? చెప్పుము, వాని భరతము పట్టెదను" – అను కథాంశము స్మృతికి రాకమానదు.

పోన్దరుళి (విచ్చేసి) పురుషోత్తముడు చతుర్గతి గలవాడు. అవి 1) వృషభగతి 2) మతంగగతి 3) వ్యాఘ్రగతి 4) సింహగతి అని. వృషభము నందలి పౌరుషము, మదగజ మందలి గాంభీర్యము, వ్యాఘ్ర మందలి పరాక్రమము, సింహ మందలి పరాభిభవన సామర్థ్యము "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అని ప్రసిద్ధిగాంచిన శ్రీకృష్ణున కుండక మరెవరి కుండును! కాన ఈ గమనములన్నియు శ్రీకృష్ణునియందు జూడ గోపికలు కుతూహలపడి యిట్లు పలుకుచున్నారు. ఇట సింహగతి యితరగమనముల కుపలక్షకము.

**24. అ న్ఱివ్వులగ మళన్దా యడి పోత్తి,**
**శెన్ఱఙ్గు తెన్నిలఙ్గై శెత్తాయ్ తిఱల్ పోత్తి,**

**పొన్నచ్చగడ ముదైత్తాయ్ పుగళ్ పోత్తి,**
**కన్ఱు కుణిలా వెఱిన్దాయ్ కళల్ పోత్తి**
**కున్ఱు కుడైయా వెడుత్తాయ్ కుణ మ్బోత్తి,**
**వెన్ఱు పగై కెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్ పోత్తి,**
**ఎ న్ఱె నున్ శేవగమే యేత్తి ప్పఱై కొళ్వాన్,**
**ఇన్ఱి యామ్ వన్దో మిర న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** అన్ఱు = (వామనావతారము ధరించిన) నాడు, ఇవ్వులకమ్ = ఈ లోకమును, అళన్దాయ్ = కొలిచిన, అడి = (నీ) శ్రీపాదములకు, పోత్తి = మంగళము, అఙ్గు = అక్కడికి, శెన్ఱు = వెళ్ళి, తెన్ = ఇలఙ్గై = సుందరమగు లంకను, శెత్తాయ్ = మట్టు పెట్టిన, తిఱల్ = (భుజ) బలమునకు, పోత్తి = మంగళము, పొన్ఱ = (రూపుమాసి) పోవునట్లు, శకడమ్ = శకటాసురుని, ఉదైత్తాయ్ = (కాలితో) తన్నిన నీ యొక్క, పుగళ్ = పొగడ్తకు(కీర్తికి), పోత్తి = మంగళము, కన్ఱు = (వత్సాసురుడను) దూడను, కుణిలాయ్ = గోణిబిళ్ళనువలె, ఎఱిన్దాయ్ = విసరిన నీ యొక్క కళల్ = శ్రీపాదమునకు, పోత్తి = మంగళము, కున్ఱు = కొండను, కుడైయాయ్ = గొడుగువలె, ఎడుత్తాయ్ = ఎత్తిన, కుణమ్ = (నీ కల్యాణ) గుణ (గణ) ములకు, పోత్తి = మంగళము, పగై = పగవారిని, వెన్ఱు = కూకటివేళ్ళతో, కెడక్కుమ్ = పెల్లగించునట్టి, నిన్కైయిల్వేల్ = నీ చేతియందలి బల్లెమునకు, పోత్తి = మంగళము, ఎన్ఱు + ఎన్ఱుమ్ = ఈ యీ ప్రకారములుగ, శేవగమే = నీ వీరచరితములనే, ఏత్తి = స్తుతించి, పఱైకొళ్వాన్ = పురుషార్థప్రాప్తికై, ఇన్ఱు = ఇపుడు, యామ్ = మేము, వన్దోమ్ = వచ్చినాము, ఇరఙ్గు = కృపచేయుము.

**వ్యాఖ్య:** ఓ శ్రీకృష్ణా! ఆనాడు ఉపేంద్రుడవై లోకముల కొలిచిన నీ శ్రీపాదములకు మంగళము. లంకకు దండెత్తిపోయి దానిని రూపుమాపిన

నీకు నిత్యమంగళము. శకటాసురుని సమూలముగ మట్టుపెట్టిన నీకు శుభమగుగాక! వత్సాసురుడై వచ్చిన రాక్షసుని వెలగ చెట్టుమీదికి విసరికొట్టి సంహరించి పొంకముగా నిలబడిన నీ శ్రీపాదమునకు మంగళము. దేవేంద్రుని గర్వమడచుటకై గోవర్ధనపర్వత మెత్తి యాతని శిలావర్షము నాపి ఘనత గాంచిన నీకు శభమంగళము. శత్రు వినాశకమగు నీ బల్లెమునకు మంగళము. ఈ విధముగా నీ వీరచరిత్రను గానముచేసి నిన్ను మంగళాశాసనము చేయుటకు మే మిపుడు నీ వద్దకు వచ్చినాము. కాన మేము కోరిన వరము ననుగ్రహింపుము" అని గోదాదేవి శ్రీకృష్ణుని ప్రార్థించుచున్నది.

ఈ పాశురమున ఆండాళ్ గోపిక ఆయన చేసిన షట్సంఖ్యాక వీర కృత్యములకై భగవంతునికి మంగళారాత్రికము పట్టుచున్నది. ఈ ఆరు అవతార విశేషములే ఈ గోపికలకు షడ్రుచులని ధ్వని! భగవదేక పరతంత్ర లగు వీరికి భగవద్రుచియే రుచిగాని యితర రుచులపై మన సెట్లు పోవును? భగవదేకరస నిర్భరలగు ఈ గోపికలకు తద్రసానందానుభవముచేతనే కడుపుతోపాటు మనసుగూడ నిండు ననుటకు వీరి యేకాగ్రనిష్ఠయే సాక్ష్యము!

అడిపోత్తి (శ్రీపాదములకు మంగళము.) బలిచక్రవర్తి పెట్టు బాధలనుండి దేవతలను రక్షించుటకై నాడు వామనుని త్రివిక్రమాపదానము ప్రసిద్ధము. నే డాచార్యుడుగూడ భగవద్విరోధుల నడచి తన్నాశ్రయించినవారికి శరణ్యముగ తన పాదములనే చూపుచున్నాడు. కాన నా శ్రీహరి పాదములతోపా టీ ఆచార్యరూపియగు హరికిగూడ వీరు మంగళము పాడుచున్నారు. వామనుడు మూడడుగులతో లోకములు స్వాధీనము చేసుకొన్న ఘనుడు.

ఆయనవలెనే యీ నరహరిగూడ మంత్రత్రయ రహస్యోపదేశము చేతను తత్వత్రయ వివరణముచేతను భువనత్రయమును లోబరచుకొన సమర్థుడు గదా!

వప్రప్రాకారజఘనయు విపులాంబునవాంబరయు నగు లంకా సుందరిని శ్రీరాముడు రూపుమాపెను. ఆచార్యుడును దేహసుఖమును అరిషడ్వర్గమును జయించి సమాశ్రితుల పాపరాశియను లంకను భస్మము చేయును.

శ్రీకృష్ణుడు కంసునిపంపున తనకు చెఱుపు చేయవచ్చిన శకటాసురుని కూల్చినాడు. సదాచార్యుడును మన సంసారశకటము ఛేదించి సర్వులను నూర్ధ్వపథగాములను చేయును. సదాచార్య విమాన మధిరోహించినవారు అర్చిరాదిమార్గమున పయనించి యవలీలగా పరమపదము చేరుదురు.

ఇతరులవలెనే ఆచార్యుడునుపైకి విషమవిషవలయమగ్నుడైనట్లుగనే కనుపించును. భార్యాపుత్రులకు పరతంత్రుడై సంసారపంకమున చిక్కుకొన్నట్లే అట్టివాని నితరు లనుకొందురు. కాని యాతడు తామరాకు మీది నీటిబిందువువలె నిర్లిప్తుడుగనే యుండును. ఇట్టి స్థితి సాధ్యమా యను శంక వలదు. పరిశీలింపు డీ నాథమునుల వారనుగ్రహించిన శ్లోకమును–

**శ్లో॥ పుంఖానుపుంఖవిషయా నుపభోగమానో**
**ధీరో న ముంచతి ముకుందపదారవిందమ్,**
**సంగీత నాట్యగతితాళవశం గతాఽపి**
**మౌళిస్థకుంభపరిరక్షణధీర్నటీవ**

విషయసుఖముల ననుభవించుచున్నను, ధీరుడు (పండితుడు) అయినవాడు ముకుందపదపద్మారాధన నేమఱడు. ఒక నర్తకి సంగీతము, గతి, తాళము మొదలగువాని కనుగుణముగ నాట్యము చేయుచున్నను తన

శిరస్సున నిడుకొన్న జలపూర్ణకుంభమునుండి ఒక్క నీటిచుక్కగూడ క్రింద పడనీయనంతటి మెలకువతో నుండుట యనుభవసిద్ధము గదా! లౌకికనర్తకి మాటయే యిట్లుండ నటననుండి దూరముగనుండి త్రికరణ శుద్ధిగా భగవంతునే నమ్మియుండు సదాచార్యునిమాట చెప్పనేల! భగవ చ్చింతా నిమగ్నుడైన అతడొకవేళ తెలిసిగాని తెలియకగాని కాలు జారినను "తీనిల్ తూశాగుమ్" అగ్నిలో బడిన దూదివలెనే ఆతని పాపములు భస్మమైపోవును.

ఆవుదూడ రూపము ధరించి తనకు చెరుపు చేయవచ్చిన వత్సాసురుని – ఒక వెలగచెట్టుమీదకు విసరికొట్టి హతమార్చిన మహావీరుడు మన బాలకృష్ణుడు! గోటిబిళ్ళను బహుదూరము సునాయాసముగ మీటిన వినోద క్రీడయే గదా ఆతని కీపని!

ఇక గోవర్ధనోద్ధరణము సంగతి –

పూర్వాచారమగు నింద్రయాగమును శ్రీకృష్ణుని బోధకు లోబడి గోపకులు మానివేసినందున బుసలు కొట్టుచు దేవేంద్రుడు ప్రళయకాల మేఘములను గోకులముమీదికి శిలావర్షము కురిపింప బంపినాడు. ఏడేండ్ల యా పసివాడు ఆ పెద్దవారందర కీ విధముగ నభయమిచ్చినాడు –

**శా. బాలుం డీతఁడు, కొండ దొడ్డది, మహాభారంబు సైరింపఁగా**
**జాలండో – యని దీనిక్రింద నిలువన్ శంకింపఁగాఁబోల – దీ**
**శైలాంభోనిధి జంతుసంతతి ధరాచక్రంబు పైఁబడ్డ నా**
**కే లల్లాడదు బంధులార! నిలుఁ డీ క్రిందన్ బ్రమోదంబునన్."**

ఆ బిడ్డ గోవర్ధనపర్వతము దాల్చుట నెంత కమ్మగా వర్ణించెనో భగవత్పరవశుడైన కవిమూర్ధన్యుడు పోతనామాత్యుడు!

**మ. హరిదోర్దండము గామ, గుబ్బ శిఖరం, బాలంబి ముక్తావళుల్**
**పరఁగన్ జారెడు తోయబిందువులు, గోపాలాంగనాపాంగ హా**

**సరుచుల్ రత్నచయంబుగాఁగ – నచలచ్ఛత్రంబు శోభిల్లెఁ, ద**
**ద్గిరిభిద్దుర్మదభంజియై, జలధరాక్లిన్న ప్రజారంజియై.**

గొల్లవారు సర్పాదిబాధానివృత్తికై బల్లెమును తాల్చుట సంప్రదాయము. నందుని చేతనున్నట్లే శ్రీకృష్ణునిచేతిలోగూడ బల్లెముండును. ఆ బల్లెమునకు గూడ మంగళము పాడుచున్నారు వీరు. ఈ బల్లెము శంఖచక్రాదులగు నితరాయుధముల కుపలక్షకము.

ఏమేమో కోరుకొనవలెనని ఎంతో శ్రమించి వ్రతము చేసిన గోదాదేవి కా పరాత్పరుని సేవ లభించినతర్వాత నోట మాటయే రాలేదు. వచ్చినను ఆయన యనంతకల్యాణగుణరాజి కెవరి దుష్టదృష్టి తగులునోయను భయముచే మంగళము మాత్రము వెలువడినది. ఆమె తండ్రి శ్రీవిష్ణు చిత్తులుగూడ గరుడవాహనారూఢుడై వచ్చిన శ్రీమహావిష్ణువును గాంచగనే ఒడలు తెలియని శివముతో పసిబిడ్డనువలె నా స్వామిని దీవించె గదా!

అట్లే యీమెగూడ భగవంతుని కాంచినంతనే సర్వము మరచిపోయి వాని శ్రీపాదమంగళమునే దృఢముగా కోరుకొనుచున్నది. ఆహా! ఎట్టి నిర్మలహృదయ మీమెది!

**“పదకవిత:**
**ఈ పాదమే కదా యిల యెల్ల గొలిచినది**
**యీ పాదమే కదా యిందిరాహస్తముల కితవైనది**
**ఈ పాదమే కదా యిందఱును మ్రొక్కెడిది**
**యీ పాదమే కదా యీ గగనగంగ పుట్టినది.”**

– తాళ్లపాక అన్నమాచార్యులు.

**25. ఒరుత్తి మగనాయ్ ప్పిఱ న్దోరిరవిల్,**
**ఒరుత్తి మగనా యొళిత్తువళర,**

**త్తరిక్కిలా నాగి త్తాన్ తీఙ్గు నినైన్ద**
**కరుత్తై ప్పిళై ప్పిత్తు క్కఞ్జన్ వయిత్తిల్,**
**నెరు ప్పెన్న నిన్ఱ నెడుమాలే, యున్నై**
**యరుత్తిత్తు వన్దోమ్ పఱై తరుదియాగిల్**
**తిరుత్తక్క శెల్వముమ్ శేవగముమ్ యా మ్పాడి,**
**వరుత్తము న్తీర్న్దు మగిళ్ న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** ఒరుత్తి = సాటిలేని ఒకస్త్రీ (దేవకి) కి, మగన్ + ఆయ్ = కుమారుడై, పిఱన్దు = పుట్టి, ఓర్ + ఇరవిల్ = ఒకే (అదే) రాత్రిలో, ఒరుత్తి = మరొక సాటిలేని స్త్రీకి (యశోదకు), మగనాయ్ = పుత్రుడై, ఒళిత్తు = (కంసునికి) చాటుగా, వళర = పెరుగుచుండగా, తరిక్కిలాన్ + ఆగి = సహింపలేనివాడై, తాన్ = తాను, తీఙ్గు = ద్రోహము, నినైన్ద = తలపెట్టిన, కఞ్జన్ + కరుత్తై= కంసుని కోరికను, పిళైప్పిత్తు = వ్యర్థము చేసి, వయత్తిల్ = వాని (కంసుని) గర్భమున, నెరుప్పు + ఎన్న = నిప్పు (బడబాగ్ని) వలె, నిన్ఱ = (పీఠము పెట్టుకొని) ఉండినట్టి, నెడుమాలే = ఆశ్రిత వ్యామగ్ధుడా! ఉన్నై = నిన్ను, అరుత్తిత్తు = అర్థించి, వన్దోమ్ = వచ్చినాము, పఱై = మా కోరిక, తరుదియాగిల్ = ఇచ్చినచో, తిరు + తక్క = శ్రీమహాలక్ష్మి (సైతము) కోరదగిన, శెల్వముమ్ = సంపదయును, శేవగముమ్ = (నీ) బలపరాక్రమములను, యామ్ = మేము, పాడి = గానము చేసి, వరుత్తముమ్ = (మా) శ్రమ, తీరున్దు = తీరి, మగిళ్న్దు = బ్రహ్మానంద మనుభవింతుము.

**వ్యాఖ్య:** శ్రీకృష్ణుడు మథురలో కంసుని చెరసాలలో దేవకీవసుదేవులకు బిడ్డయై జన్మించెను కంసుని భయముచే వసుదేవు డారాత్రికి రాత్రియే ఆ బాలుని గోకులమున నందునింట దిగవిడిచివచ్చెను. ఆహా, ఆ బిడ్డ ఎవరికో పుట్టి మరెవరికో దక్కినాడు గదా! ఈ విధముగ చాటున తన్ను మట్టుపెట్టువాడు పెరుగుచున్నాడని కంసున కెట్లో తెలిసెను. ఆత

డసూయావిష్టుడై కృష్ణవధ కనేకప్రయత్నములు చేసెను. వాని నన్నిటిని వ్యర్థముచేసి కంసుని కడుపునగూడ చిచ్చుపెట్టి చివర కాతనినే మట్టు పెట్టిన కేసరికిశోరము గదా బాలశ్రీకృష్ణుడు! ఆండాళమ్మ యీ కథ శ్రియః పతికి జ్ఞప్తి తెచ్చి యిట్లనుచున్నది – "ఆశ్రితులపై వల్లమాలిన మోహము పెంచుకొన్న యో స్వామీ! పురుషార్థ మర్థించి మేము నీ దరిజేరిన సంగతి నీకును తెలిసినదే గదా! నీవు మాకోరిక తీర్చ దలచినచో శ్రీదేవిగూడ పొగడదగిన సంపదగిను దానిని గాపాడదగిన శక్తి సంపదను మా కనుగ్రహింపుము. అపుడుమాత్రమే మేమీ నెలదినములును ఉషఃకాలమున లేచి మా పడ్డపాట్లు విస్మరించి నిరతిశయబ్రహ్మానందామృత మాస్వాదించి తరింపగలము."

పుండరీకాక్షుడు, పీతాంబరుడు, పంచాయుధవిభూషితుడు నగు వానికి కన్నతల్లియైనను యశోదకుగల భాగ్యము దేవకికి లేదని చెప్పుటకే కవయిత్రి వారిద్దరి పేర్లను ఇందు మరగుపరచినది.

పిఱన్దు (పుట్టి) అను పదము "అజాయమానో బహుధా విజాయతే" (పుట్టుక లేనివాడయినను దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించుటకై యనేక జన్మల నా భగవంతుడెత్తును) అను పురుషసూక్త మంత్రమును –

**శ్లో॥ జన్మ కర్మ మే దివ్య మేవం యో వేత్తి తత్వతః**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున.**

"నా దివ్యజన్మకర్మల యుత్పత్తిక్రమ మెవరు తెలిసికొన యత్నింతురో వారికి పునర్జన్మ శూన్యము" అని గీతాచార్యుడు అర్జునున కుపదేశించిన యర్థమును – గుర్తుకుతెచ్చి తీరును గదా!

**26.** **మాలే మణివణ్ణా మార్ గళి నీరాడువాన్,**
**మేలైయార్ శెయ్వనగళ్ వేణ్డువన కేట్టియేల్,**
**ఞాలత్తై యెల్లామ్ నడుఙ్గ మురల్వన,**
**పాలన్న వణ్ణత్తు పాఞ్జశన్ని యమే,**
**పోల్వన శఙ్గఙ్గళ్ పోయ్ ప్పాడుడై యనవే,**
**శాల ప్పెరు మ్పఱైయే పల్లాణ్డిశైప్పారే,**
**కోలవిళక్కే కొడియే వితానమే,**
**ఆలినిలైయా యరు శేలో రెమ్బావాయ్**

**టీక:** మాలే = ఆశ్రిత వ్యామోహముగలవాడా! మణివణ్ణా = (ఇంద్రనీల) మణివంటి (శరీర) వర్ణముగలవాడా, ఆలిన్ + ఇలై యాయ్ = (మఱ్ఱి) యాకున పవ్వళించిన ఓ స్వామీ! మార్గళి = ఈ ధనుర్మాసమున, నీరాడువాన్ = స్నానమాడుటకు (వచ్చినాము) మేలైయార్ = పూర్వుల యొక్క, శెయ్వనగళ్ = అనుష్ఠానములు, వేణ్డువన = అవసరమైనవానిని, కేట్టియేల్ = విన్నచో (చెప్పెదము), ఞాలత్తై = భూమిని, ఎల్లామ్ = అంతయును, నడుఙ్గ = అదరునట్లు, మురల్వన = మ్రోగునట్టి, పాల్ + అన్న = పాలవంటి, వణ్ణత్తు = వర్ణముగల, ఉన్ = మీ యొక్క, పాఞ్చశన్నియమే పోల్వన = పాంచజన్య శంఖమును పోలిన, శఙ్గఙ్గళ్ = శంఖములను, పోయ్ = మిక్కిలి, పాడుడై యనవే = విశాలమైన, శాల = చాల (పెద్ద) పెరుమ్ = గొప్ప, పఱైయే = తప్పెటయును, పల్లాణ్డు + ఇశైప్పారే = మంగళము పాడువారును, కోలవిళక్కే = మంగళదీపమును, కొడియే = ధ్వజమును, వితానవే = చాందినీయును, అరుళ్ = అనుగ్రహింపుము.

**వ్యాఖ్య:** ఆశ్రితులం దపరిచ్ఛిన్నమగు వాత్సల్యముగల శ్రీకృష్ణుడు వారి నిష్ఠకు మెచ్చి "కొమ్మలారా, అనన్యసాధ్యమగు మీ భక్తిప్రపత్తులకు మిక్కిలి ప్రీతుడనైనాను. నేను మీ కమ్ముడు పోయినాను. కాన మీకు వలసినవన్నియు

కోరుకొనుడు. సందేహములేక తీర్చెదను" అని పలికెను. అప్పుడు గోపికలతో గూడిన ఆండాళన్ను స్వామిని భూనభోంతరాళములు దద్దరిల్ల జేయు పాంచజన్యమువంటి శంఖములను, గొప్పవాద్యమును, పెరియాళ్వారులను బోలిన మంగళాశాసన కర్తలను, మంగళదీపమును, ధ్వజపటమును, చాందినీ వస్త్రమును కోరుకొనెను. స్వామి శ్రద్ధగా ఆలకించి "మీరు అసాధ్యమయినవారు. కాననే అసాధ్య వరములను కోరుకొన్నారు. నా వద్దనున్న ఆ ఒక్క పాంచజన్యమే పుచ్చుకొనుడు. ఆ శంఖమును బోలు శంఖములు నే నెక్కడ తేగలను? ఇదిగో నా వాద్యము? మంగళాశాసనము చేయుటకు పెరియాళ్వారులనే గైకొనుడు. శ్రీరంగభవన ప్రాంగణమున జంగమదీపరేఖవలె నడయాడు పట్టపురాణి నీళాదేవినే గ్రహించి మంగళదీపపు పని నెరవేర్చుకొనుడు." అని పలికి పై వానితోపాటు ధ్వజమునకు గరుత్మంతుని, చాందినీకి తన పీతాంబరమును ఇచ్చుటకు సిద్ధమయ్యెను. అపుడు గోపికలు – "మాకు ఇవి ఒక్కొక్కటి కాదు అనేకముగా కావలె" నని పట్టుబట్టిరి. "అట్టివాని సంపాదించు టెట్లు నాకు" అని స్వామి విస్తుపోయి ఆలోచింపసాగెను.

అప్పుడు గోపిక లిట్లు పల్కుచున్నారు –

ప్రళయకాలమున పదునాల్గు లోకములు చిఱుబొజ్జను దాల్చి మఱ్ఱి యాకున బండుకొనిన యఘటిత ఘటనాసమర్థుడా! ఓ మాయకాడా! అనుకొనవలెనే గాని యసాధ్యమనునది నీకు గలదా? దయతో నీవు మా యభీష్టము ననుగ్రహింపక తప్పదు సుమా!"

**మేలైయార్ శెయ్వనగళ్** (పూర్వులు ఆచరించినవి)

అను పదబంధముచే "లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి" (లోకోద్ధరణను మనసున నుంచుకొనియైన మనము వర్ణాశ్రమ ధర్మముల ననుష్ఠింపక తప్పదు) అనియును –

**శ్లో॥ యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః**

శ్రేష్ఠుడాచరించినదియే లోక మాచరించును అనియును - శ్రీకృష్ణుడానతిచ్చిన వాక్యద్వయము అనుస్మరణీయము.

**పల్లాణ్డిశైప్పారే** (మంగళము పాడువారు)

అనుటచే విష్ణుచిత్తులవంటి వారితో సత్సంగమే మనకు వాంఛనీయము అని సూచ్యము.

**27. కూడారై వెల్లుమ్‌శీ ర్కోవిన్దా, వున్దన్నై**
**ప్పాడి ప్పఱై కొణ్డు యామ్బెఱు శమ్మానమ్,**
**నాడు పుగళుమ్ పరిశినాల్ నన్ఱాగ,**
**చ్చూడగమే తోళ్వళైయే తోడే శెవిప్పూవే,**
**పాడగమే యెన్ఱనైయ ప్పల్‌కలనుమ్ యా మణివోమ్,**
**ఆడై యుడుప్పో మదన్పిన్నే పాల్సోఱు,**
**మూడ నెయ్‌పెయ్‌దు ముళఙ్గై వళివార.**
**క్కూడి యిరున్దు కుళిర్ న్దేలో రెమ్బావాయ్.**

**టీక:** కూడారై = (నీ భక్తులతో) కూడి (కలసిమెలసి) యుండనివారిని, వెల్లుమ్ = జయించునట్టి, శీర్ = శీలసంపదగల, కోవిన్దా = ఓ గోవిందుడా! ఉన్‌దన్నై = నిన్ను, పాడి = కీర్తించి, పఱై = వాద్యమును (పురుషార్థమును), కొణ్డు = (తీసి) కొని, యామ్ = మేము, పెరుమ్ = లభించు (పొందు) నట్టి, శమ్మానమ్ = సన్మానము - (ఇది సుమా), నాడు = దేశము (అంతయు), పుగళుమ్ = పొగడునట్టి, పరిశినాల్ = బహుమానముచేత, నన్ఱాగ = లస్సగా, శూడగమే = (కర) కంకణములు, తోళ్‌వళైయే = భుజకీర్తులు, తోడే = చెవికమ్మలు, శెవి + పూవే = కర్ణపుష్పములు, పాడగమే = అందెలు, ఎన్ఱు + అనైయ = అని చెప్పబడిన, (ఇంకను), పల్ = పలు, కలనుమ్ =

ఆభరణములను, యామ్ = మేము, అణివోమ్ = ధరించెదము, ఆడై = (విలువగల) చీరెలను, ఉడుప్పోమ్ = కట్టుకొందుము, అదన్‌పిన్నే = అటుతర్వాత, పాల్‌శోఱు = పాలతో వుడికిన అన్నము (క్షీరాన్నము) ను, మూడ = మునుగునట్లు, నెయ్ = నెయ్యి, పెయ్‌దు = పోసి, ముళంగై = ముంజేతిగుండ, వళివార = కారునట్లు (భుజించి) కూడి + ఇరున్దు = దేవరతో కలసియుండి, కుళిర్‌న్దు = ఉల్లము చల్లబరచుకొందుము.

**వ్యాఖ్య:** తన్నాశ్రయింపనివారిని సైతము నీ కల్యాణగుణశీలసంపదచే జయించునట్టి గోవిందస్వామీ! నిన్ను నుతించి మాకు ప్రాప్తమయిన నీ కైంకర్యలక్ష్మిని బడయుట అను ఘనసన్మానముతోపాటు నేడే దేశమంతయు కీర్తించునట్లు కరకంకణములు, భుజకీర్తులు, శ్రవణాభరణములు, కర్ణపుష్పములు, పాదాంగదములు – మొదలగు సమస్తసువర్ణాభరణములును నీవు దగ్గరనుండి ధరింపజేయగా ధరించుకొందుము. నీకు నచ్చిన చీరెలనే ధరించెదము.

ఆ తర్వాత అన్నమును, పెసరపప్పును కలిపి పాలతో వండిన "అక్కారవడిశల్" అను ప్రసాదమును నీకు నివేదించెదము. దానిలో బాగుగ నెయ్యిపోసి ముంజేతిగుండ నేయి కారునట్లు తృప్తిగా నీతోకలసి మే మందరమును భుజింతుము. దేవరతో కలసి మా మనశ్శరీరతాపము లారునట్లుగా సుఖపడవలెనని కోరుకొనుచున్నాము.

గోవిన్దా! (గోవిందుడా) (వేద) వాక్కులచే స్తుతింపబడువాడు గోవిందు డని విశేషార్థము. అట్టి వేదములకుగూడ అగోచరమగు గోవిందుని స్వరూపరూప కల్యాణగుణవిభూత్యాదులను వర్ణింపదగిన అధీతి బోధాచరణ ప్రచారసమర్థుడగు ఆచార్యుడుగూడ గోవిందుడే యనుటలో సందియమేల? "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" అని గదా శ్రుతిసూక్తి! దివ్యసూరుల శ్రీసూక్తులు జిహ్వారంగమున నర్తనమాడు భగవత్కవితా సంపన్నుడుగదా యీ యాచార్యుడు!

ఉన్దన్నైప్పాడి (నిన్ను కీర్తించి)

**శ్లో॥ గురుపాదాంబుజం ధ్యాయేత్ గురో ర్నామ సదాజపేత్**

గురుపాదములె ధ్యానింపవలెను. సదా గురునామమే జపింపవలెను.

**పఱైకొణ్డు** (పురుషార్థము పొంది) గురుపదజపమే మేమిన్నాళ్ళును కోరిన పురుషార్థము. గురుపదధ్యానముతోపాటు గురువు పాడిన మృదుమధుర పదార్థసంఘటిత శ్లోకసంపదతో భగవన్నామజపము చేయుటయే మా పురుషార్థమని నమ్ముకొనియున్నాము.

1) **శూడగమే** (హస్తాభరణము) అంజలి 2) **తోళ్వళైయే** (భుజాలంకారము) భుజాగ్రములందు శంఖచక్రధారణము. 3) **తోడే** (చెవికమ్మలు) తిరుమంత్రము 4) **శెవిప్పూవే** (కర్ణపుష్పములు) ద్వయమంత్రము 5) **పాడగమే** (కాలియందెలు) గురుపాద సేవ.

వారు పొందగలమని తలచిన సన్మానములు వేదమునగూడ నుద్ఘోషితములు – పరిశీలింపుడీ మంత్రసూక్తము –

**"తం పంచశతాన్యప్సరసాః ప్రతిధావంతి శతం మాలా**
**హస్తాః, శతమంజనహస్తాః, శతం భూషణహస్తాః,**
**శతం వాసోహస్తాః, శతం చూర్ణహస్తాః,**
**తం బ్రహ్మాలంకారేణాలంకుర్వంతి"**

వైకుంఠమును క్రొత్తగ ప్రవేశించిన ముక్తపురుషునికి ఐదునూర్ల అప్సరసలు ఎదురై బ్రహ్మరథము పట్టి పరబ్రహ్మవద్దకు తీసికొని పోదురట. నూర్గురు పూలమాలలు, నూర్గురు అంజనము, నూర్గురు సుగంధ చూర్ణము, నూర్గురు దివ్యపీతాంబరములు మరి నూర్గురు దివ్యాలంకారముల తెచ్చి ఆ ముక్తాత్మకు బ్రహ్మాలంకారము సేయుదురు.

**శ్లో॥ తాపః పుండ్రస్తథా నామమంత్రో యాగశ్చ పంచమః**
**అమీ హి పంచసంస్కారాః పరమైకాంత్యహేతవః**

1) అగ్నితో తప్తము చేసిన శ్రీహరి శంఖచక్రముల దాల్చుట 2) ఊర్ధ్వపుండ్రధారణము 3) రామానుజదాస నామము 4) నారాయణ మంత్ర లాభము 5) దేవతార్చన. ఈ పంచ సంస్కారములును పై ఐదువస్తువులచే సూచితము.

**"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి"**

ఆ ముక్తాత్మ సర్వకామములను పరబ్రహ్మతోకలసి అనుభవించును అనియు –

**"అహమన్నాదోఽహమన్నాఽదోఽహమన్నాదః"**

"నేను అన్నము ననుభవింతును"

అనియు వేదము చెప్పిన అన్నమును బ్రహ్మమును ఒకటే. "అద్యతే ఇతి అన్నమ్" అను వ్యుత్పత్తిని బట్టి అనుభవింపదగినదానితో పాటు ఇంద్రియానుభవగోచరమైన బ్రహ్మపదార్థముగూడ అన్నమే యగునని సిద్ధాంతము.

శోఱు (అన్నము) భగవద్గుణానుభవము.

**పాల్‌శోఱు** (క్షీరాన్నము) భాగవతగుణానుభవము.

"బంధుజనై స్సహ భుక్తం భుక్తమ్" బంధువులతో చేసిన మృష్టాన్న భోజనమే తృప్తికరమైనది. ఆత్మబంధువులతో గలసి భగవ న్నివేదిత ప్రసాదము ననుభవించు సౌభాగ్య మెంతటివారికో గదా!

**28. కఱవైకళ్ పిన్ శెన్ఱు కానమ్ శేర్ న్దుణ్బోమ్,**
**అఱివొన్ఱు మిల్లాద వాయ్‌క్కులత్తు, త్తున్దన్నై**

**ప్పిఱవి పిఱన్దనై పుణ్ణియమ్ యాముడైయోమ్,**
**కుఱై వొన్ఱు మిల్లాద గోవిన్దా, వున్ఱన్నో**
**డుఱవేల్ నమ క్కి ఙ్గొళిక్క వొళియాదు,**
**అఱియాద పిళ్ళైగళో మన్బినా, లున్ఱన్నై**
**చ్చిఱుపే రళైత్తనవుమ్ శీఱి యరుళాదే**
**ఇఱైవా నీ తారాయ్పఱై యేలో రెమ్బావాయ్.**

**టీక:** కఱవైగళ్ = పశువులకు, పిన్ = వెనుక, శెన్ఱు = (వెళ్ళి), కానమ్ = కాననము, శేర్న్దు = చేరి, ఉణ్బోమ్ = తినువారము, అఱివు = జ్ఞానము, ఒన్ఱుమ్ = ఒక్కటి (కొంచెము) గూడ, ఇల్లాత = లేనట్టి, ఆయ్కులత్తిల్ = గొల్లకులమున, ఉన్ఱన్నై = దేవర, పిఱవి = మా సజాతీయముగ, పిఱన్దన = అవతరించిన, పుణ్ణియమ్ = (మహా) పుణ్యమును, యామ్ = (గొల్లవారమైన) మేము, ఉడైయోమ్ = కలవార మైతిమి, కుఱైవు = కొరత, ఒన్ఱుమ్ = కొంచెమైనను, ఇల్లాత = లేని, కోవిన్దా = ఓ గోపాలకృష్ణా! ఇఱైవా = ఓ మా స్వామీ! ఉన్ఱన్నోడు = నీతో (మాకున్న), ఉఱవు = సంబంధము, ఇఙ్గు = ఇచ్చట, నమక్కు = మనకు, ఒళిక్క = వదల (వలెనన్నను), ఒళియాదు = వదలదు, అఱియాద = ఎరుకలేని, పిళ్ళైగళోమ్ = (పసి) పిల్లలమగు మేము, అన్బినాల్ = ప్రేమచేత, శిఱుపేర్ = చిట్టిపేరుతో, అళైత్తనవుమ్, పిలచినను, నీ = (ఆశ్రితవత్సలుడ వగు) నీవు, శీఱియరుళాదే = కోపము తెచ్చుకొనకుండ, పఱై = (మా) అపేక్షిత (పటహ) మును, తారామ్ = ఇమ్మా!

**వ్యాఖ్య:** “గోవిందుడ వైన ఓ గోపాలకృష్ణా! ఉదయము నుండి, రాత్రి వరకు అడవిలో గోవుల మేపుచు తిరుగుచు కాలము గడపువారము గదా మేము. ఇంటినుండి చలిదియన్నము మూటగట్టుకొని పోయి మడిమైల అంటు ఎంగిలి లేకుండ భుజించు నలవాటు గలవారము. ఇంత తెలివితక్కువ వారమైనను మమ్మనుగ్రహించుటకే నీవు మా యీ తక్కువ కులమున

నవతరించినావు. నీవు మా కులమున పుట్టుటయే మా పుణ్యము. మన నడుమగల యీ యనాది బంధుసంబంధము ఎప్పటికిని ఎవరిచేతను విడదీయరానిది. మాతో కలసి పెరిగినవాడవు గదా యని చనువుతో నిన్ను ఏవేవో కొంటె పేర్లు పెట్టి పిలచినాము. అందుకు మాపై కోపమ్ము వలదు మా శ్రీ కృష్ణా! మా యిష్టపురుషార్థము ననుగ్రహింపుమా" యని ఆండాళ్ గోపిక తోడి గోపికలతో కలసి యా గోవిందుని ప్రార్థించుచున్నది.

**శ్లో॥ యన్నామ నాథ! నవనీతమచూచురస్త్వం**
**తచ్ఛాదనాయ యది తే మతిరావిరాసీత్,**
**కిం ముగ్ధ, దిగ్ధమమునా కరపల్లవం తే**
**గాత్రం ప్రత్యుజ్య నిరగాః కిల నిర్విశంకః**

ఓ కృష్ణా! వెన్న దొంగిలిన నీ కది యితరుల కగుపింపజేయకుండు టకు మార్గమే పొడసూపలేదా? ఇది చాల నచ్చెరువు కల్గించుమాట! నీ చేతనున్న వెన్న ఒడలికి రాచుకొని పొరుగింటినుండి బై టికెట్లు వచ్చితివి? ఇంత అమాయకుడవా నీవు!

**కఱవైగళ్ పిన్‌శెన్ఱు** (పశువులవెంట పోయి) పశువులవెంట వెళ్ళినందున పశుకృత్యములే మా కలవడినవి. అందుచే సాక్షాత్తుగ మేము సైతము పశువులమే యయిపోయినాము.

**శ్లో॥ ఆహార నిద్రా భయమైథునాని**
**సామాన్యమేతత్పశుభిర్నరాణామ్**
**జ్ఞానం హి తేషామధికో విశేషో**
**జ్ఞానేన హీనః పశుభిస్సమానః**

ఆహారనిద్రాభయమైధునాది కృత్యములకు సంబంధించినంతవరకు మానవునకును పశువునకును భేదము లేదు. పశువునుండి మనుష్యుని

వింగడించి చెప్పునదొక జ్ఞానము మాత్రమే. "మోక్షే ధీః జ్ఞానమ్" అని గదా జ్ఞానమునకు నిఘంటు నిర్వచనము. అట్టి మోక్షేచ్ఛ లేనివాడు పశువే యగుననుటలో సందియమేమి!

## పుణ్ణియమ్ యామ్ ఉడైయోమ్

(పుణ్యమూర్తి వగు నిన్ను సంపాదించుకొన్నాము.)

సాక్షాత్తుగ శ్రీకృష్ణపరమాత్మనే కొంగుబంగారముగ సంపాదించు కొనగలిగినంత గొప్పది గదా మా పుణ్యము. కాననే –

**శ్లో॥ వరమిమముపదేశ మాద్రియధ్వం**
**నిగమవనేషు నితాంతచారఖిన్నాః,**
**విచినుతభవనేషు వల్లవీనా**
**ముపనిషదర్థములూఖలే నిబద్ధమ్.**

"భగవత్తత్త్వాన్వేషణకై నిగమారణ్య సంచారము చేసి నితాంత ఖిన్నులయి వ్యర్థులయిన మహర్షులారా! నా యీ యుపదేశము మీ రికనైన చెవినిడుట లెస్స. గోపికల యిండ్లలో వెదకినచో ఉపనిషత్తుల కర్థ (ప్రతిపాద్య విషయ)ము తల్లిచే ఱోట గట్టిబడి లభించును." అని యొక భక్తకవి హృదయము రసపరవశమై వాక్రుచ్చెను గదా!

గోపికలు తా మే పుణ్యమును చేయలేదని యొకప్రక్క పల్కుచునే ఇంత పుణ్యవతులము అనుచున్నా రే యిది యెట్లు పొసగును? అని యొక శంక.

మేము పుణ్యహీనుల మన్నాము గాని నిన్ను పుణ్యహీనుడ వనలేదే. మా జ్ఞానశూన్యతకు నీ దోషశూన్యతకు సరిపోయినది. మేము లోతయిన గోతిలో నున్నాము. నీవో పెద్దమిట్టపై నున్నావు. ఆ మిట్ట నీ గోతిలోకి

త్రోసిన మన మేకమై పోగలము. అపుడు నీకును మాకును దూరమెక్కడ, భేద మేది?

చూచితిరా! గోపికలది యెంత హేతుబద్ధ తర్కవాదమో! వారా తెలివితక్కువ పిల్లలు, వారి మాటలు నమ్మిన మనమా తెలివి తక్కువ వారము!!

**అన్బినాల్** (ప్రేమతో) నీవు చనవిచ్చి మమ్ము నెత్తికెక్కించు కొన్నందున మేము నీ పరత్వఘనత్వాదులను గుర్తింపలేక యేమేమో తేలికమాట లన్నాము. నిన్నెంతో తేలికగ చూచినాము. మమ్ము మన్నింపుమా.

అర్జునుడుగూడ గీతోపదేశము నంది విశ్వరూపసందర్శనము చేసిన తర్వాత నిట్లే పల్కెను గదా-

**శ్లో॥ సఖేతి మత్వా ప్రసభం యదుక్తం**
**హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి,**
**అజానతా మహిమానం తవేమం**
**మయా ప్రమాదాత్ప్రణయేనవాపి**

**శ్లో॥ యచ్చాపహాసార్థమసత్కృతోఽసి**
**విహారశయ్యాసనభోజనేషు.**
**ఏకోఽథవాప్యచ్యుత! తత్సమక్షం**
**తత్క్షామయే త్వా మహమప్రమేయమ్**

నిన్ను కేవలము చెలికానినిగా తలచి యాదవకృష్ణా! సఖా! అని చులకనగా ఇంతవరకు సంబోధించినాను. ప్రమాదముచేతను ప్రణయ వశుడనయి నిన్ను గుర్తించలేకపోయినాను. విహారశయ్యాసనభోజనాదు లలో నిన్ను తగురీతిగ గౌరవింపలేకపోయియుందును. భక్తరక్షణ విషయమున భ్రంశములేని దామోదరా, దాసుని తప్పులు దండముతో సరి యన్నట్లు నా యపరాధములు సైచి నన్ను కాపాడుమా! "అన్యథా శరణం

నా స్తి" యనునట్లును "నీవే తప్ప నితః పరం బెఱుగ" నన్నట్లును "నీవు తప్ప నాకు వేఱు దిక్కెఱుంగ విశ్వవంద్య"

**(శిఱుపేర్ అళైత్తనవుమ్)** (చిన్న పేరుతో పిలచినను)

"నారాయణనే నమక్కే పఱై తరువాన్ అని "నారాయణన్ మూర్తి" అని నిన్ను పిలచుటచే నీకు తప్పక కోపము వచ్చియుండును. ఆ కోపము వదలివేయుము. పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా! గోవిందుడని సులభనామము నీకుండగా దానిని వదలి నిన్నితర నామములతో పేర్కొనుట మాతప్పే. అయినను దీనిని నీవు క్షమింపక తప్పదు." అనుచున్నది ఆండాళ్‌తల్లి శ్రీకృష్ణపరమాత్మతో.

**29. శిత్తమ్ శిఱుకాలై వన్దున్నై చ్చేవి, త్తున్**
**పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళ్ కేళాయ్,**
**పెత్తమ్ మేయ్ త్తుణ్ణుమ్ కుల త్తిత్పిఱన్ద. నీ**
**కుత్తేవ లెజ్గళై క్కొళ్ళామ ఱ్పోగాదు,**
**ఇత్తై ప్పఱై కొళ్వా నన్ఱుగాణ్ గోవిన్దా,**
**ఎత్తైక్కు& మేళేళు పిఱవిక్కు, మున్దన్నో**
**డుత్తోమే యావో మున క్కే నా మాట్చెయ్‌వోమ్,**
**మత్తై నజ్గామజ్గళ్ మా త్తేలో రెమ్బావాయ్.**

**టీక:** గోవిందా = ఓ గోవిందుడా! శిత్తమ్ శిఱుకాలై = మిక్కిలి వేకువనే, వన్దు = వచ్చి, ఉన్నై = నిన్ను, శేవిత్తు = సేవించి, ఉన్‌పొత్తామరై అడి = నీ బంగారమువలె అందమైన పాదపద్మములకు, పోత్తుమ్ = మంగళము పాడుటకు, పొరుళ్ = ఉద్దేశము, కేళాయ్ = వినుము, పెత్తమ్ = పశువులను, మేయ్‌త్తు = మేపి, ఉణ్ణుమ్ = భుజించునట్టి, కులత్తిల్ = (గొల్ల) కులమున, పిఱైన్దు = పుట్టిన, నీ = నీవు, ఎజ్గళై = మా అంతరంగ కైంకర్యమును,

కొళ్ళామల్ = స్వీకరింపక, పోకాదు = పోరాదు, ఇత్తై = నేడు (ఈయబడు), పఱై = భేరీని, కొళ్వాన్ అన్టుకాణ్ = కై కొనుటకు కాదు సుమా (మా రాక!) ఎత్తైక్కుమ్ = కాలతత్వమున్నంత వరకును, ఏళేళు పిరవిక్కుమ్ = ఏడేడు జన్మలకును, ఉన్టన్నోడు = నీతో, ఉత్తోమే యావోమ్ = బంధుత్వము కలిగియుండువారమే కావలెను, ఉనక్కే = నీకే, నామ్ = మేము, ఆళ్‌శెయ్‌వోమ్ = సేవ చేసెదము, నమ్ = మా యొక్క, మత్తై = ఇతరమైన, కామజ్గళ్ = కామములను, మా త్తు = నశింపజేయుము.

**వ్యాఖ్య:** ముందు పద్యములలో గోపికలు కోరిన వాద్యము శ్రీకృష్ణు డిచ్చెను. అపుడు వారందరితోకలసి గోదాదేవి ఆయన కిట్లు విన్నవించుచున్నది–

"గోవిందా! వేకువనే మీ సన్నిధికి వచ్చి ఈ నెల దినములును మిమ్ము సేవించి మంగళము పాడినది కేవలము ఈ వాద్యము పొంది వెనుదిరిగి పోవుటకు కాదు. పశువులనే రక్షకముగా భావించి తత్పోషణ లోనే కాలక్షేపము చేసిన మా అజ్ఞానము మన్నించి దేవర మా అంతరంగ దాస్యము అంగీకరింపక తప్పదు సుమా. సర్వదేశసర్వకాలసర్వావస్థల యందును, అన్నిజన్మములలోను మీ కైంకర్యమందే మేము మెలగునట్లు మీరు సంకల్పింపవలెను. భగవత్కామము తప్ప ఇతర కామములను మా మనసులలో తలయెత్తనీయరాదు. ఒకవేళ వేఱుకోరిక లెప్పు డయిన కలిగినను వెంటనే త్రుంచివేయవలెను."

లోగడ **"పఱై"** అని పలుమార్లు పలికిన దాని స్వరూప స్వభావముల నిపుడు సొగసుగ వివరించుచున్న దీమె. **"గోవిన్దా"** గోవులు నీకు ప్రియము గదా! గోవులద్వారా మేమును మీకు ప్రియమే యని తేలి పోయినది. కాన నింతవరకు నిగూఢమయిన మా కోర్కె నిపుడు వాచ్యము చేయుచున్నాము. మేము చెప్పకయే నీ వీపాటికి తెలిసికొని యుందువు. అయినను "స్త్రీ చాపలాదేత దుతాహృతమ్" స్త్రీలకు చాపల్యము సహజము గదా!

**"శి త్తమ్ శిఱుకాలై"** (మిక్కిలి వేకువను) గురువు శిష్యుని లేపి వేదము అధ్యాపనము చేయించునట్లు ఈమెయు కృష్ణుని లేపి వేదార్థమును ఆతనికి జ్ఞప్తికి తెచ్చుచున్నది. ఆత డింత కాలము గోవులను మేపుటలోనే కాలము గడపినాడు గదా! ఏ విషయమైనను చింతన సేయనిచో మఱపునకు రాక మానునా!

## "పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళ్"

(అందమైన నీ పాదపద్మములకు మంగళము పాడు ప్రయోజనము)

దీని కుద్దేశ మిదియేగాని మఱొకటి కాదు. ప్రశ్నయు సమాధానము నిందే గర్భితము. "ఎద్దీశున కశ్వం బగు?" (శివునకు వాహన మెద్ది?) అనుప్రశ్నకు "ఎద్దీశున కశ్వం బగు" (శివునకు వాహన మెద్దే) అని అదే సమాధానము గదా!

నీ పాదపద్మములకు మంగళము పాడుట మాత్రమే మా ప్రయోజనము. ఒకవేళ మాకు తెలియకుండ మే మేమైన కోరినను వానిని సమూలముగ ఛేదించివేయుమా! ఈ కైంకర్యము మా కొక్కనాడు గాదు. ఒక్క జన్మమున గాదు, ఎన్ని జన్మములకైనను నీ వనుగ్రహించి తీరవలెను.

ఇప్పట్టున నీ గీతాచార్యోక్తి జ్ఞప్తికి తెచ్చుకొన దగినది –

**శ్లో॥ బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున,**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప!**

అరున్జా! నాకును నీకును ఎన్ని జన్మములు గడచినవో నీ వెఱుగవు గాని నేను మాత్ర మెఱుగుదును సుమా!

అహో! ఈ గోపీబాలల భక్తిప్రపత్తినిష్ఠలు ఎంత పరాకాష్ఠ కెక్కినవి!

**శ్లో॥ ఆసామహో చరణరేణుజుషామహం స్యాం**
**బృన్దావనే కిమపి గుల్మలతౌషధీనామ్,**
**యా దుస్త్యజం స్వజనమార్యపథం చ హిత్వా**
**భేజుర్ముకున్దపదవీం శ్రుతిభిర్విమృగ్యామ్**

వేదవాక్కులకుగూడ అగమ్యమైన విష్ణుపద ప్రపత్తిమార్గమును సుగమము చేసికొన్న యీ గోపిక లెంత ధన్యులు! వీరి శ్రీచరణరేణువులు సోకిన బృందావనమందలి తరుగుల్మలతాదు లెంత పుణ్యము చేసికొన్నవో గదా!!

**"పడియాయ్ క్కిడన్దున్ పవళవాయ్ కాణ్బేనే"**

శ్రీ వేంకటేశ్వరస్వామీ! నీ కొండకు మెట్టుగా నయి యుండినను నీ ప్రవాళాధరము దర్శించుచు కాలక్షేపము చేయు భాగ్యము నా కబ్బెడిది గదా." అని శ్రీ కులశేఖరాళ్వారుల శ్రీ సూక్తి గదా!

**"ఉనక్కే నామ్ ఆళ్ శెయ్వోమ్"**

(నీ కొక్కనికే మేము సేవ చేసెదము) అను వాక్యము –

**సూక్తము. ఏకో హ వై నారాయణ ఆసీత్, న బ్రహ్మా,**
**నేశానో, నేమే ద్యావాపృథివీ**

ఒక్క నారాయణుడే పరతత్వము, బ్రహ్మగాని, ఈశ్వరుడు గాని, ద్యావాభూములుగాని కానే కావు. అను శ్రుతిసూ క్తి కనువాదము కాదా!

దీనినే భగవద్రామానుజుల పరమాచార్యులు శ్రీ యామునాచార్యుల వారు స్తోత్రరత్నమున నిట్లు ప్రవచించినారు –

**శ్లో॥ భవన్తమేవానుచరన్నిరన్తరం**
**ప్రశాంతనిశ్శేషమనోరథాన్తరః,**

**కదాఽహమైకాన్తికనిత్యకిఙ్కరః**
**ప్రహర్షయిష్యామి సనాథజీవితమ్**

నిన్నే సదా యనుసరించుచు నితర మనోరథములను దరికి రానీయను; ఐకాన్తిక నిత్యకిఙ్కరుడనై నిన్ను నాథునిగా చేసికొని నా జీవితమెప్పుడు హర్షానుభవముతో గడచునో గదా!

గోపికల యీ కోర్కె నమ్మాళ్వారుల యీ పాశురార్థమును ప్రతి బింబించుచున్నది -

**ఉ. మిన్నున నున్నవారలును మేదినివారలు నాసచేయు సం**
**పన్నుఁడె వచ్చి నా మనసుఁబట్టెను; నా కిఁక మచ్చెకంటి, వి**
**త్తోన్నతి, సత్సుతుల్, మిగులనోరిచి, నా పయి కూర్మిసేయు నన్**
**గన్న మదంబ, మత్ప్రియు నా సకలంబును నాతడే యగున్**

**30. వఙ్గక్కడల్ కడైన్ద మాదవనై క్కేశవనై,**
**తిఙ్గళ్ తిరుముగత్తు చ్చేయిళై యార్ శెన్ఱిఱైఞ్జి,**
**అఙ్గప్పఱై కొణ్డ వాత్తై, యణిపుదువై**
**ప్పైఙ్గమల త్తణ్డెరియల్ పట్టర్ పిరాన్ కోదై శొన్న,**
**శఙ్గత్తమిళ్ మాలై ముప్పదు న్దప్పామే,**
**ఇఙ్గిప్పరి శురైప్పా రీరిణ్డు మాల్వరైత్తోళ్,**
**శెఙ్గణ్తిరుముగత్తు చ్చెల్వ త్తిరుమాలాల్,**
**ఎఙ్గుమ్ తిరువరుళ్ పెత్తిన్బుఱువ రెమ్బావాయ్.**

**టీక:** వఙ్గమ్ = (పెద్దపెద్ద) ఓడలు (లేక అలలు) గల (వంగమ్–భంగ శబ్దభవము అని కొందరు) కడల్ = కడలిని, కడైన్ద = మథించినట్టి, మాదవనై = లక్ష్మీకిపతి యగు, కేశవనై = శ్రీమహావిష్ణువును, తిఙ్గళ్ తిరుముగమ్ + శేయ్ + ఇళై యార్ = చంద్రునిబోలిన ముఖ లావణ్యముతో మంచి

యాభరణములు దాల్చిన గోపబాలికలు, శెన్ఱు = (వటపత్రశాయియైన శ్రీకృష్ణునివద్దకు)పోయి, ఇఱైఞ్జి = స్తుతించి, అఙ్గు = అచ్చట (గోకులమున), అప్పఱై = ఆ (పరమ) పురుషార్థమును, కొణ్డ = (తీసి) కొన్న, వాత్తై = వార్తను, అణిపుదువై = అందమైన విల్లిపుత్తూరున (జన్మించిన), తత్ = శ్రమపోగొట్టు, పైమ్ + కమలమ్ = పసిడి రంగుగల కమలములయొక్క తెరియల్ = మాలికలు దాల్చిన, పట్టర్‌పిరాన్ = పెరియాళ్వారుయొక్క కోతై = (పుత్రిక యగు) గోదాదేవి, శొన్న = ఆనతిచ్చిన, శంగమ్ = సంఘముగానున్న, తమిళ్ = ద్రవిడమయమైన, మాలై = శ్రీసూక్తిమాలను, ముప్పదుమ్ = ముప్పదియును, తప్పామే = తప్పనిసరిగా, (వరుస తప్పక), ఇఙ్గు = ఇక్కడ (ఇహమున), ఇప్పరిశు = ఈ ప్రకారముగ, ఉరై ప్పార్ = అనుసంధించువారు, ఈర్ + ఇరణ్డు = రెండురెండై (నాలుగై), మాల్‌వరై = పెద్దకొండలవంటి, తోళ్ = భుజములు, శెమ్ = ఎఱ్ఱని, కణ్ = నేత్రములు, తిరుముగత్తు = ముఖమండలము గల, శెల్వమ్ = సర్వసంపత్సముద్రుడైన, తిరుమాలాల్ = శ్రియఃపతియగు సర్వేశ్వరునిచే, ఎఙ్గుమ్ = సర్వదేశము లందును, తిరు + అరుళ్ = పరిపూర్ణ కృపను, పెత్తు = పొంది, ఇన్బు = బ్రహ్మానందమును, ఉరువర్ = పొందుదురు.

**వ్యాఖ్య:** గోకులమున చంద్రబింబాననలై యొప్పారు గోపికలు కేశవుడైన శ్రీకృష్ణునిగూర్చి కాత్యాయనివ్రత మాచరించి పరమార్థలాభమునందినారు. ఆ విధానమునే పెరియాళ్వారు లనబడు విష్ణుచిత్తులవారి పుత్రిక గోదాదేవి సుందరవాణీమాలికగా ద్రవిడభాషలో కావ్యరూపమున కూర్చినది. ఈ ముప్పది పాశురములను ప్రతినిత్యమును తప్పక యనుసంధించువారు ఆ శ్రియఃపతియొక్క పరిపూర్ణ కృపకు పాత్రులై ఇహపరములందు బ్రహ్మానందమందగలరు.

**ఆణిపుదువై** (నగరరత్నమగు విల్లిపుత్తూరు) భగవంతుడగు వటపత్రశాయి వైభవమునకును, లక్ష్మీరూపిణియగు గోదాదేవి ప్రభావమునకును, భాగవత శ్రేష్ఠుడయిన శ్రీ విష్ణుచిత్తుని మహిమకును నెలవు ఇది! ఓం అనగా అ + ఉ + మ అను మూడు అక్షరముల కలయిక, అ = విష్ణువు, ఉ = గోదాదేవి, మ = శేష (దాస) స్వరూపుడగు విష్ణుచిత్తులు. కాన ప్రణవమువంటి పవిత్రనగరము గదా యిది.

**శొన్న** (పలికిన) గోపీభావమును తనపై ఆరోపించుకొని చెప్పిన కవితామాల యిది.

**తప్పామే** (తప్పకుండ) ఒక్క పాడుట మాత్రమే కాదు – వర్ణమునగాని, పదమునగాని, వాక్యమునగాని, తప్పుండరాదు అని అర్థము.

**ఇప్పరిశు** (ఈ విధానము) ధనుర్మాస వ్రతవిధానముచే పరమ పురుషుని కరతలామలకము చేసికొనదగిన దివ్యప్రబంధము గదా యిది! గోకులమందలి గోపికలు శ్రీకృష్ణుని సమకాలికలు గాన వారి కాదేవుని సాన్నిధ్యభాగ్యము కల్గినది. ఆ సాన్నిధ్యమును గోదాదేవి ఆరోపించుకొని తన్మయతతో మార్గళి వ్రత మనుష్ఠించినది. ఈ వ్రతమును కాయికముగా నామె యాచరింపలేదు. మానసికముగా వాచికముగా నాచరించెను. శ్రీకృష్ణ వాల్లభ్యము సంపూర్ణముగా నామె కబ్బినది. నాటినుండి భాగవతోత్తము లందరు నామె మార్గమే ఆత్మోజ్జీవన సాధనమని భావించినారు.

భక్తసులభుడగు శ్రీకృష్ణభగవానునియొక్క అనన్య వాత్సల్య కారుణ్య ములకు హర్షపులకితాంగు లైనారు వారు. స్వామి వేంచేసియున్న సన్నిధికి వెళ్ళి –

**చం. హరి భజియింతు నే నహరహంబు హరి న్నుతియింతు భక్తితో**
**హరికి సపర్యసేతు హరి కంజలు లిత్తు మనోహరంబుగా**

**హరిసరియైన దేవత యజాండమున న్న హి యంచు నెంచ శ్రీ**
**హరిపురిఁ జేరవచ్చు-మనసా! హరిపాదము లాశ్రయింపుమా!**

– అను రీతిగా నవవిధ భక్తిభావములతో ఆయనను సేవించినారు. పటహరూప మగు బహుమానము గైకొందుమని గోదాదేవివలెనే ప్రార్థించినారు. వ్యాజముతో భగవత్కైంకర్యవృత్తిని తమ కనుగ్రహింపుమని యా దేవుని ప్రార్థించినారు.

కాన మనముగూడ పద్మాక్షు డగు నా శ్రియఃపతిని ఈ ధనుర్మాస వ్రతవిధానముతో సేవించి అవిచ్ఛిన్న సుఖసంపదలను బడసి బ్రహ్మానంద నిర్భరుల మగుదుము గాక!

**చం. పరమదయానిధే, పతితపావననామ, హరే, యటంచు-సు**
**స్థిరమతులై సదా భజనసేయు మహాత్ముల పాదధూళి నా**
**శిరమునఁ దాల్తు, మీరటకుఁ జేరకుఁడంచు యముండు కింకరో**
**త్కరముల కాన వెట్టునఁట! దాశరథీ, కరుణాపయోనిధీ!**

ఈ పద్యార్థమే యీ శ్లోకార్థము గదా –

**శ్లో॥ సన్తః శ్రీరంగపృథ్వీశ చరణత్రాణశేఖరాః,**
**జయన్తి భువనత్రాణ పదపంకజరేణవః**

శ్రీరంగనాథుని పాదుకలు శిరసావహించి లోకత్రాణపారీణములగు రేణువులను తమ చరణములందు దాల్చిన భాగవతోత్తములకు జయమగు గాక!

**శ్లో॥ విమలగురు కటాక్షాత్ప్రాహ టీకామపూర్వాం**
**సలలితరసపూర్ణాం మాతృసంస్తోత్రకామః**
**వరరుచిభృత గోదాగ్రంథమాలానుజీవీ**
**నరహరిరితి నామా శారదారాధకోఽయమ్.**

**ప. కృష్ణముఖనిస్సృతంబగు గీత పోల్కి**
**గోద పాడెను శ్రీగీతి - గురుకటాక్ష**
**పాత్రుఁడైనట్టి నరహరి భవ్యశైలి**
**శ్రీచరణరేణువై దీనిఁ జెప్పెనిట్లు**
**భగవదభిరుచి యను పేరఁ బరమభక్తి!**

## ఫలశ్రుతి

**ప. గోద యను బాలశుకవాణి కుతుకమలర**
**నీ తిరుప్పావు పాడెను - ఇది పఠింప**
**భక్తి విన్నను వ్రాసినఁ బ్రజ్ఞ కలుగుఁ**
**గుదురు బ్రహ్మానుభూతి వైకుంఠుఁడబ్బు!**

ఆండాళ్ తిరువడిగళే శరణమ్.

(ఆండాళ్ శ్రీపాదములే శరణము.)

జీయర్ తిరువడిగళే శరణమ్.

(మణవాళమహామునుల శ్రీపాదములే శరణము.)

ఓం తత్ సత్.

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు!

## ఆండాళ్ తిరునక్షత్ర తనియన్

**"శ్లో॥ కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవాం,**
**పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్.**

సౌరమానమున కర్కాటకమాసమున పుబ్బానక్షత్రమున శ్రీరంగ నాయకి యంశమున లోకరక్షణార్థము పాండ్యదేశమున శ్రీ విల్లిపుత్తూర నవతరించిన శ్రీ గోదాదేవికి మా నమస్సుమనస్సులు!

**"శ్లో॥ నీళాతుఙ్గ స్తనగిరితటీ సుప్త ముద్బోధ్య కృష్ణం**
**పారార్థ్యం స్వం శ్రుతిశతశిరస్సిద్ధమధ్యాపయంతీ,**
**స్వోచ్ఛిష్టాయాం స్రజి నిగళితం యా బలాత్కృత్య భుంక్తే.**
**గోదా తస్యై నమ ఇదమిదం భూయ ఏవాస్తు భూయః.**

శ్రీకృష్ణుడు నీళాదేవియొక్క కుచపర్వతసీమ నాక్రమించి నిద్రించి యుండెను. అట్టివానికి తన హక్కయిన వేదాంత ప్రతిపాదక మగు పారతంత్ర్యమును బోధించుచు నాండాళమ్మ తాను ధరించి వదలిన పుష్ప మాలికలతో పురుషోత్తముని బంధించెను. అంతేగాదు, బలాత్కరించి యాతని ననుభవించెను. అట్టి గోదాదేవికి మా సహస్ర నమస్కారములు.

## వాళితిరునామములు

**కోదైపిరన్దవూర్ కోవిన్దన్ వాళుమూర్**
**శోదిమణిమాడమ్ తోన్ఱుమూర్; నీతియాల్**
**నల్లపత్తర్ వాళుమూర్ నాన్మఱైక ళోదుమూర్**
**విల్లిపుత్తూర్ వేదక్కోనూర్**
**పాదఙ్గళ్ తీర్కుం పరమనడి కాట్టుమ్**

**వేదమనైత్తుక్కుం విత్తాగుమ్-కోదైతమిళ్**
**ఐయైన్దు మైన్దుమ్ అఱియాద మానిడరై**
**వైయమ్ శుమప్పదుమ్ వమ్బు.**

గోదాదేవి జన్మస్థలమగు శ్రీ విల్లిపుత్తూరు వటపత్రశాయి యగు బాలముకుందుని నెలవు. మణిమంటపాది నిర్మాణములతో నా దివ్యనగర మలకానగరినే తలదన్నుచుండును. నీతినియమములు గల శ్రీ వైష్ణవ శిఖామణులచే నది సమృద్ధము! వేదవేదాంగవేత్తయు సార్థకనాముడు నగు శ్రీ విష్ణుచిత్తులవా రవతరించిన పవిత్రదివ్యదేశ మది!

అట్టి ధన్యినవ్యనగరమున మన పుణ్యపరిపాకముచే శ్రీ విష్ణుచిత్తులకు పుత్రికగా లభించిన దీ తల్లి. గోద అను పదముమాత్ర ముచ్చరించిన చాలును - దానితో మనము విష్ణుపదమును శ్రీ మహావిష్ణువుయొక్క శ్రీ పాదద్వయిని - ఆయన నివాస మగు పరమపదమును గూడ సునాయాసముగా పొందగలము. గోదా పద మొక్కటియే వేదమునకు ప్రణవమును పోలినట్టిది. అర్థపంచక మహిమను పంచసంస్కారావశ్యకతను బోధించు తిరుప్పావు సారము నెరుగని మానవుల జన్మము వ్యర్థము. వారు భూమికి కేవల భారభూతులు.

**తిరువాడిప్పూరత్తిల్ జకత్తుదిత్తాళ్ వాళియే,**
**తిరుప్పావై ముప్పదుం శెప్పినాళ్ వాళియే,**
**పెరియాళ్వార్ పెత్తెడుత్త పెణ్పిళ్ళై వాళియే,**
**పెరుమ్బూదూర్ మామునిక్కు ప్పిన్నానాళ్ వాళియే,**
**ఒరునూత్తు నాఱ్పత్తు మూన్నురైత్తాళ్ వాళియే,**
**ఉయిరరఙ్గర్కే కణ్ణి యుగన్దళిత్తాళ్ వాళియే,**

**మరువారు న్దిరువల్లవళనాడు వాళియే,**
**వణ్ పుదువైనగర్ కోదై మలర్ పదంగళ్ వాళియే.**

కర్కటమున పూర్వఫల్గుని (పుబ్బ నక్షత్రమున) తులసీవనమున నవతరించిన తల్లికి మంగళము! ముప్పది పాశురములు చెప్పిన మా తల్లికి జయమంగళము! పెరియాళ్వారుల ప్రేమను చూరగొన్న భూపుత్రికి భువన మంగళమ! శ్రీ పెరుంబుదూర నవతరించినట్టి మహామౌని యతిరాజుకు సోదరియైన యయోనిజాతకు మహామంగళము! నూటనలుబదిమూడు పాశురములుగల నాయ్చ్చియార్ తిరుమొళిని పాడిన తల్లికి పరమ మంగళము! శ్రీరంగనాథుని పాదాబ్జద్వయిని నిత్యనివాసముగా చేసికొన్న మదంబకు మా మంగళము! తన జన్మచే పాండ్యరాజ్యమును వైభవాన్వితముగ నొనర్చిన జగజ్జననికి నిత్యమంగళము! సుందరనగరము శ్రీ విల్లిపుత్తూర నవతరించిన యా తల్లి పదములకు సర్వమంగళము!

❊ ❊ ❊